అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
ఆదివారం 20-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 233 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

సాగుపై సోయేదీ!

10 జిల్లాలకు జేడీఏలు కరువు..1800 పోస్టులు ఖాళీ

దిక్కుతోచని అన్నదాత..తగ్గుతున్న ఉత్పత్తి

సకాలంలో వర్షాలు పడకపోవడంతో పాటూ పంట రుణాలు అందక దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు నానా తంటాలు పడుతుంటే... వారికి చేదోడు వాదోడుగా ఉండాల్సిన వ్యవసాయ శాఖ అచేతనంగా మారిపోయిన పరిస్థితి కనిపిస్తున్నది. రాష్ట్రంలో ఆ శాఖ పనితీరు చూస్తుంటే అసలు వ్యవసాయ శాఖకూ వ్యవసాయానికీ సంబంధం ఉన్నదా లేదా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. పలు జిల్లాల్లో ఉన్నతాధికారులు కానీ, మండలాల్లో విస్తరణాధికారులు కానీ లేని ఈ శాఖను పటిష్టపరచకుండా వ్యవసాయ రంగంలో కీలక మార్పులు తెస్తామని ప్రభుత్వం చెప్తున్న మాటలను రైతులు ఆక్షేపిస్తున్నారు. రైతులకు వచ్చే ఏడాది ఇస్తామంటున్న ఆర్థిక సాయం గురించి ఇప్పటి నుంచే ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం ముందుగా వ్యవసాయ శాఖ పనితీరుపై దృష్టి కేంద్రీకరించాలని వారు కోరుతున్నారు.



మోత్కురి యాదయ్య

'ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి. విత్తనం వేసే ముందుగానీ, వేసిన తర్వాతగానీ, పంట పెరిగే క్రమంలో ఏ మందులు వాడాలి. ఎంత మోతాదులో వాడాలి. ఏ విధంగా వాడాలి. అనే సమాచారం ఇచ్చే వారు లేరు. చేను ఏపుగా రావడం లేదు, పూతలేదు, కాత లేదని ఫర్టిలైజర్ షాపుకెళ్లి అడిగితే దుకాణం యజమానికి తోచింది ఇస్తుండు. అది తీసుకొచ్చి చేనుకు కొడితే ఎదుగు లేదు బొదుగు లేదు, పూత లేదు, కాతాలేదు. మళ్లీ ఆ షాపుకెళ్లి మందు పని చేయడం లేదంటే ఇంకో మందు కొట్టమని చెబుతుండు. ఈ లోగా పంట నాశనం అవుతుంది తప్పా పంట చేతికందే పరిస్థితి లేకుండా పోతుంది. ఫలానా రోగానికి ఫలానా మందు వాడాలని చెప్పే అధికారులు గ్రామాల్లో కనిపించడం లేదు' ఇవి ఆయా గ్రామాల్లో రైతులు చెబుతున్న మాటలు కానీ ప్రభుత్వం మాత్రం రైతులకు సూచనలు ఇచ్చేందుకు విస్తరణ అధికారులను నియమించబోతున్నట్టు మూడేండ్ల నుంచి చెబుతూ వస్తున్నది. కానీ ఇప్పటి వరకు కొత్తగా నియమించిదిలేదు, రైతుల కష్టాలు తీర్చింది లేదు. దీంతో వ్యవసాయ శాఖలో విస్తరణ విభాగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రస్తుతం 882 మంది ...9లో

కేసీఆర్‌కు ఉత్తమ రైతు అవార్డు



9లో



పట్టాలు తప్పిన ఉత్కల్

యూపీలో ఘోర రైలు ప్రమాదం

- 23మంది మృతి, 72మందికి పైగా గాయాలు
- రైళ్ల దారిమళ్లింపు..సహాయక చర్యల్లో యంత్రాంగం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకున్నది. ఒడిశాలోని పూరీ నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు వెళ్తున్న కలింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో దాదాపు 23 ...9లో

ఎన్డీయేలోకి నితీష్ జేడీయూ!



విస్తారంగా వర్షాలు...
పొంగుతున్న వాగులు

కొట్టుకుపోయిన రోడ్లు

- ఏజెన్సీల్లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పలుచోట్ల వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించిన స్థానికులు



నవతెలంగాణ-యంత్రాంగం

రాష్ట్రంలోని పలుజిల్లాల్లో శనివారం రోజంతా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలూ పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల వరద తాకిడికి రోడ్లు తెగిపోయాయి. దీంతో ఏజెన్సీలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. మున్నేరు, వైరా, కట్లేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాలేరు, ...9లో

తెలంగాణలో స్వేచ్ఛ కరువు

సీఎం కనుసన్నల్లో ప్రజాస్వామ్య విరుద్ధ పాలన : టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ప్రజా సంఘాలు, ప్రతిపక్షపార్టీలు, ప్రజలకు స్వేచ్ఛ కరువైందని, ప్రస్తుతం రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, తెలంగాణ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండ రామ్ ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్య విరుద్ధంగా పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు, తెలంగాణ ఆశయాల సాధన కోసం ప్రజల మధ్యకు ...9లో

పాఠశాల కోసం ఘెరావ్

- బడి తెరిచేవరకు కదలనివ్వబోమన్న విద్యార్థులు
- రేపటి నుంచి ఉపాధ్యాయులను పంపిస్తాం.. : డీఈవో
- న్యాయవిజ్ఞాన సదస్సు కేంద్రంగా సమస్య కొలిక్కి

వివరాలు 2లో



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో...

కాశ్మీర్ సమస్యపై మోడీకి
చిత్తశుద్ధి లేదు

- పార్లమెంటరీ బృందానికి ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు
- ఐటీ రిటర్న్స్‌పై కేంద్రం స్పష్టత ఇవ్వాలి
- ప్రధానిదొక లెక్క, ఆర్థికమంత్రిది మరో లెక్క.. ఏది నిజం..? : ఏచూరి



భువనేశ్వర్: కాశ్మీర్ సమస్య పరిష్కారం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి అన్నారు. బుల్లెట్లు లేదా దూషణలతో కాశ్మీర్ సమస్యకు పరిష్కారం సాధ్యం కాదని ప్రధాని నరేంద్రమోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించడాన్ని ఏచూరి విమర్శించారు. కొంతకాలం క్రితం కాశ్మీర్‌లో పర్యటించిన పార్లమెంటరీ బృందానికి కేంద్రం ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఏచూరి అన్నారు. సమస్య పరిష్కారానికి ...9లో

సూరత్ నుంచి బతుకమ్మ చీరలు



సిరిసిల్లలో సరిపడా ఉత్పత్తి లేకే..

- నాణ్యతపై దృష్టి పెట్టండి
- బిల్లులు సకాలంలో చెల్లించేలా చూస్తాం : చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్

వివరాలు 2లో

కొక్కొరోకో..



బేడీలు వేయకేం చేస్తామయ్యా..? వీళ్లేమన్న కోట్లు కోట్లు స్కాములు చేశారా, మర్డర్లు చేశారా.. రాచమర్యాదలు చేయడానికి..!!

శాఖల వారీగా
వివరాలివ్వండి

ఉద్యోగాల భర్తీ మాట నమ్మొచ్చా! : సీపీఐ(ఎం)


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగాల కల్పనకు సంబంధించి పంద్రాగస్ట్‌నాడు గోల్కొండ కోట నుండి ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం, పేర్కొన్న అంకెలు అనేక తప్పుల తడకలతో కూడుకుని ఉన్నాయని సీపీఐ (ఎం) విమర్శించింది. సీఎం చెప్పిన మాటలకు ఆచరణలో అమలు తీరుకు పొంతనే లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతను మభ్యపెట్టకుండా ఏయే శాఖల్లో ఎన్నెన్ని ఖాళీలున్నాయి? వాటిలో ఎన్నింటికి నోటిఫికేషన్ జారీ చేశారు? వాటిలో ఎన్ని భర్తీ చేశారు? ప్రస్తుత పరిస్థితేమిటి? తదితర వివరాలతో కూడిన ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ 27,660 పోస్టులు భర్తీ చేశాం, ఇంకో 36,800 పోస్టులు భర్తీ ప్రక్రియలో ఉన్నాయి, మరో 48,070 పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామంటూ సీఎం ప్రకటించారని తమ్మినేని గుర్తుచేశారు. అదే జాబితాలో ఆర్‌టీసీలో 3,950 పోస్టులను భర్తీ చేసినట్టు చెప్పారని తెలిపారు. అయితే ఆ పోస్టులకు ...9లో

మాటల్లోనే హైటెక్

"అబద్ధానికి నోరెక్కువ" అని సామెత.. ఈ మాట కేంద్ర ప్రభుత్వ పాలకులకు సరిగ్గా అతికినట్టు సరిపోతుంది. పాలనలోకి వస్తే ఐటీ, టెలీ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో 1.7 కోట్ల మందికి ప్రత్యక్షంగా, కనీసం 8.5 లక్షల మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బీజేపీ రాజకీయ ఉద్దండులు ఊదరగొట్టారు.ఇప్పుడు ఆ మాటలు ఉత్తివేనని తేలింది. కొత్త ఉద్యోగాల కల్పన అటుంచితే, ఉన్న ఉద్యోగాలను సైతం కాపాడలేని పరిస్థితుల్లో ప్రస్తుత సర్కారు పెద్దలు చేతులెత్తేశారన్న విషయం మరోమారు రుజువైంది. భారత ఐటీ సెక్టారు పరిస్థితిపై అంతర్జాతీయ మీడియా సంస్థల కథనాలు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నాయి. ఆ నేపథ్యంపై "నవ తెలంగాణ" ప్రత్యేక కథనం.. 9లో

ఏడేండ్ల కనిష్టానికి దిగజారిన భారత ఐటీ పరిశ్రమ





వరదల ఉధృతితో విలవిల్లాడుతున్న అస్సాంలో వణ్య జీవులు కూడా పెద్ద సంఖ్యలో చనిపోయాయి. కజిరంగ నేషనల్ పార్కులో 15 ఖడ్గమృగాలు, 185 జింకలు, ఒక రాయల్ బెంగాల్ టైగర్ (చిత్రంలో చూడవచ్చు), కొన్ని ఏనుగులు సహా 225 జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. వీటి కళేబరాలు వరద నీటిలో తేలుతున్న దృశ్యాలు స్థానికులకు కంటతడి పెట్టిస్తున్నాయి.

గోశాలలో మృత్యుగోస..

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేత అరెస్టు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని గోశాలలో 200 ఆవులకు పైగా మృతి చెందిన ఘటనలో బీజేపీ నేత హరీశ్‌వర్మను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. హరీశ్‌వర్మ.. దుర్గ్ జిల్లాలోని రాజ్‌పూర్‌లో ఎయిడెడ్ గోశాలను నడుపుతున్నాడు. అయితే గోశాలలో కొంతకాలంగా ఆవులకు దాణా, వైద్య సదుపాయం అందించడం లేదు. ఈ నేపథ్యంలో ఆకలితో అలమటించి మూడు రోజుల్లోనే 200 పైగా ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ విషయం బయటకు తెలవొద్దన్న ఉద్దేశంలో ఆవులను గుట్టుచప్పుడు కాకుండా పూడ్చి పెడుతున్నారు. ఒక్కో గుంతలో 10 నుంచి 15 ఆవులను పూడ్చిపెడుతున్నట్టు స్థానికులు వెల్లడించారు.

గోరఖ్‌పూర్ సంఘటన జాతీయ విషాదం : రాహుల్‌గాంధీ

- బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో 100మందికి పైగా చిన్నారులు మృతి చెందారని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. ఈ దుర్ఘటన జాతీయ విషాదమని రాహుల్ అన్నారు. శనివారం ఉదయం గోరఖ్‌పూర్ చేరుకున్న రాహుల్..సమీపంలోని నాలుగు గ్రామాల్లో పర్యటించి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

బాధితులు చెప్పిన వివరాల ప్రకారం ఆక్సిజన్ కొరత, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే చిన్నారులు మృతి చెందినట్టు స్పష్టమైందని రాహుల్ అన్నారు. యూపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ విషాదమని ఆయన అన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించకుండా, ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌ను రాహుల్ డిమాండ్ చేశారు. మోడీ పాలనలో దేశంలో ఆరోగ్య రక్షణ ఎలా ఉన్నదో ఈ సంఘటన ద్వారా తెలుస్తున్నదని రాహుల్ అన్నారు. నూతన భారత్ అంటే ఇదేనా..?అని అయన ప్రశ్నించారు. బీఆర్‌డీ వైద్యకళాశాల ఆస్పత్రిని సందర్శించకపోవడానికి రాహుల్ వివరణ ఇచ్చారు. యోగి ఆదిత్యనాథ్ ఆ ఆస్పత్రిని సందర్శించిన సందర్భంగా అక్కడ చికిత్స పొం దుతున్న చిన్నారులు ఇబ్బంది పడ్డట్టు తన దృష్టికి వచ్చిందని, అందువల్లే తన పర్యటన షెడ్యూల్ మార్చుకున్నట్టు రాహుల్ తెలిపారు. ఈ పర్యట నలో రాహుల్ వెంట కాంగ్రెస్ సీనియర్‌నేత గులాంనబీఆజాద్ ఉన్నారు. శనివారం బాబారాఘవ్‌దాస్ వైద్య కళాశాల ఆస్పత్రిని సందర్శించాలని రాహుల్‌గాంధీ తొలుత నిర్ణయించుకున్నారు. అయితే, ఆ తర్వాత ఆయన తన పర్యటన షెడ్యూలును మార్చుకున్నారు.

గోరఖ్‌పూర్ పిక్నిక్ స్పాట్ కాదు : యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్

రాహుల్ పర్యటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విమర్శలు చేశారు. స్వచ్ఛతా అభియాన్ ప్రాముఖ్యత ఏమిటో ఢిల్లీలో కూర్చునే యువరాజు(రాహుల్)కు తెలియదని ఆదిత్యనాథ్ అన్నారు. గోరఖ్‌పూర్‌ను ఆయన తన పిక్నిక్ స్పాట్‌గా మార్చుకునేందుకు అనుమతి ఎందుకు ఇవ్వాలో తగిన కారణం లేదని ఆదిత్యనాథ్ అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గోరఖ్‌పూర్‌లో 'స్వచ్ఛ ఉత్తర్‌ప్రదేశ్, స్వస్థ్ ఉత్తర్‌ప్రదేశ్' ప్రచార కార్యక్రమాన్ని ఆదిత్యనాథ్ శనివారం ప్రారంభించారు.

మహిళను కొట్టి చంపారు

- జుట్టు కత్తిరింపు నెపంతో దారుణం



రాంచి: టెక్నాలజీ రోజురోజుకు కొంత పుంతలు తొక్కుతున్నా మూఢ నమ్మకాలు మాత్రం సమాజాన్ని వీడడం లేదు. జుట్లు కత్తిరించి, మంత్రాలు చేస్తున్నదన్న నెపంతో ఓ మహిళను స్థానికులు చంపారు. ఈ దారుణ ఘటన జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్ జిల్లాలో చోటు చేసుకున్నది. జిల్లాలోని రాధానగర్‌లో వారం రోజుల క్రితం ఓ బాలిక జుట్టును గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. క్షుద్ర పూజల నేపథ్యంలోనే ఈ పని చేసి ఉంటారని స్థానికులు భావించారు. ఇదిలా ఉండగా.. శనివారం ఓ మహిళ, తొమ్మిదేండ్ల బాలుడు సహా నలుగురిని గ్రామస్తులు తీవ్రంగా కొట్టారు. ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోగా, మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా ప్రాంతంలో పోలీసు ఉన్నతాధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాణమతి నెపంతోనే దాడి జరిగి ఉంటుందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఆయన వివరించారు.

గవర్నర్ల నియామకం తర్వాతే కేంద్ర మంత్రి వర్గ విస్తరణ..!

న్యూఢిల్లీ : గవర్నర్లు లేని రాష్ట్రాలకు నియామకాలు జరిపిన అనంతరమే కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించనున్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల గవర్నర్లు ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. కొందరు కేంద్ర మంత్రులను గవర్నర్లుగా నియమించాలని మోడీ సర్కార్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రక్రియ అనంతరం ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మంత్రులతో వెళ్ళదీస్తున్న శాఖలతోపాటు కొత్తగా ఖాళీ అయ్యే స్థానాల్లో బీజేపీతో పాటు ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన నేతలకు అవకాశం కల్పించాలని ప్రధాని మోడీ యోచిస్తున్నట్టు సమాచారం. దేశంలో ప్రస్తుతం ఆరు రాష్ట్రాలకు తాత్కాలిక గవర్నర్లు ఉన్నారు. బీహార్ గవర్నర్‌గా ఉన్న రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత, ఆయన స్థానంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠికి అదనపు బాధ్యతలు అప్పగించారు. తమిళనాడు గవర్నర్‌గా ఉన్న కొణిజేటి రోశయ్య పదవీకాలం ముగిసిన తరువాత ఆ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సి.ఎచ్ విద్యాసాగర్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు ఉమ్మడి గవర్నర్‌గా ఈఎస్ఎల్ నరసింహన్ వ్యవహరిస్తుండగా, గుజరాత్ గవర్నర్ ఓం ప్రకాశ్ కోహ్లి మధ్యప్రదేశ్‌కు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాగాలాండ్ గవర్నర్‌గా వున్న పద్మనాభ ఆచార్య అరుణాచల్ ప్రదేశ్‌కు, అస్సాం గవర్నర్ భన్వర్ లాల్ పురోహిత్ మేఘాలయకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉంది. తెలంగాణ, ఏపీ ఉమ్మడి గవర్నర్ నరసింహన్, జమ్ముకాశ్మీర్ గవర్నర్ నరేంద్ర నాథ్ బెహర్, ఒరిస్సా గవర్నర్ ఎస్.సి జమిర్, సిక్కిం గవర్నర్ శ్రీనివాస్ పాటిల్ వంటి వారి పదవి కాలం త్వరలో ముగియనుంది. దీంతో వారి స్థానంలో కూడా కొత్త వారిని నియమించాల్సి వుంది.

రైతుకు శత్రువు గో రక్ష

వ్యవసాయ రంగంలో చెంగుచెంగున గెంతెత్తే పశువుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. 'గో రక్షణ' పేరుతో దాడులు, మోడీ సర్కారు పశువిక్రయాలపై నిబంధనలు అన్నదాతను దిక్కుతోచని స్థితికి నెట్టేస్తున్నాయి. పశువులు ఇటు సేద్యానికీ పనికిరావడంలేదు... అటు వాటిని అమ్మలేకా పోతున్నారు... కుటుంబ పోషణే భారమైన పరిస్థితుల్లో... వాటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. అలా తిరుగుతున్న పశువులు ఊరికే ఉంటాయా? గ్రామస్తులపై దాడులు చేయడమే కాదు... ఉన్న కొద్ది పాటి పంటలను నాశనం చేస్తున్నాయి.



పొలంలో చొరబడిన పశువులను తరుముతున్న గ్రామస్తులు

గోండా (ఉత్తర్ ప్రదేశ్) : రోజూలాగే రాజ్‌పాల్ సింగ్ ఆ రోజు రాత్రి కూడా తన నివాసంలోని గుమ్మం పక్కన మంచం మీద పడుకున్నాడు. అర్ధరాత్రి పశువుల అరుపులతో ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. మంచం మీద నుంచే తొంగి చూశాడు. ఒక ఎద్దు తలుపు దగ్గర నిలబడి ఉంది. అక్కడకు సమీపంలో కట్టేసి ఉన్న ఆవులపై దాడికి అది సిద్ధంగా ఉంది. పక్కనే ఉన్న చిన్న కర్రను అందుకుని.. ఆ పశువును అక్కడి నుంచి తరిమే ప్రయత్నం చేశాడు. అది వెనక్కి వెళ్లడానికి బదులు... రాజ్‌పాల్ సింగ్‌పై దాడి చేసింది. అమాంతంగా కుమ్మేసింది. మంచంతో సహ ఎగిరిపడ్డాడు. ఒక్కసారిగా షాక్‌కు గురైన రాజ్‌పాల్ సింగ్ బిగ్గరగా కేకలేశాడు. అది విన్న పొరుగింటివారు పరుగులు పెట్టుకుంటూ వచ్చి.. ఎద్దును అక్కడి నుంచి తరిమారు. గాయాలపాలైన అతన్ని ఆస్పత్రికి తరలించారు. రాజ్‌పాల్‌కు తుంటి ఎముక విరిగింది. ఈ ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నది. అయితే అప్పటి నుంచి **రాజ్‌పాల్ సింగ్**



మంచానికే పరిమితమయ్యాడు. పెద్ద వయస్సు కావడంతో కోలుకోవడం కష్టమవుతోంది. ఇప్పటికే రూ.40 వేలకుపైగా వైద్యం కోసం ఖర్చు చేశాడు. పూట గడవటమే కష్టంగా ఉన్న.. ఆ పేద కుటుంబానికి అది పెద్ద భారమే. ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లా బైసన్ పూర్వ గ్రామంలో జరిగిన 'ఎద్దుదాడి' ఘటన ఇది. చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ఈ ఘటన చర్చనీయాంశమైంది. కానీ, ఇలాంటివి రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 250 నుంచి 300లకు పైగా పశువులను చుట్టుపక్కల గ్రామ జనం స్వేచ్ఛగా వదిలేశారు. ఎందుకంటే... ఆ పశువులను పోషించడం వారికి భారమైపోతోంది. ఇక ఆ పశువులు ఊరికే ఉంటాయా..? అచ్చోసిన అంబోతుల్లా రంకెలేస్తున్నాయి. మనుషులపై దాడి చేయడంతోపాటు... పొలాలపై పడి పచ్చని పంటలను సర్వ నాశనం చేస్తున్నాయి.

బీజేపీ ఆవు రక్షణ నినాదం.. గ్రామస్తులకు నష్టమా?

యూపీ ప్రభుత్వం చట్టవిరుద్ధమైనవన్న సాకుతో కబేళాలపై నిషేధాన్ని విధించింది. ఆ తర్వాత పశువుల వర్తకాన్ని నియంత్రిస్తూ మోడీ సర్కార్ బిల్లు కూడా తెచ్చింది. అప్పటి నుంచీ ఈ ప్రాంతంలో పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. సాంప్రదాయంగా జరిగే 'క్యాటిల్ ఫెయిర్'లు జరగడంలేదు. మార్కెట్‌లు మూతపడటంతో... రైతులు వారికి ఉపయోగంలేని పశువులను బలవంతంగా బయటకు వదిలేస్తున్నారు.

శివేంద్ర ప్రతాప్ నాలుగు బిగాల భూమిలో కంది పంట వేశాడు. ఇందులో సగం పంటను పశువులు నాశనం చేశాయి. "గ్రామంలో చాలా మంది తమ పశువులను రోడ్లపైకి వదిలేశారు. పచ్చని పొలాలూ పూర్తిగా లేదా పాక్షికంగా నాశనం అయ్యాయి. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో ఎవరికీ అర్థం కావడంలేదు' అని ప్రతాప్ అనే రైతు వాపోయారు.

"పశువులు ప్రత్యేకించి ఎద్దులు ఆ ప్రాంతంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎవరూ ధైర్యంగా ముందుకు రావడంలేదు" అని రాజ్‌పాల్ గుర్తుచేసుకున్నారు. "అది దాదాపు నన్ను చంపినంత పనిచేసింది. నేను ఇప్పుడు బతికి ఉన్నానంటే అది అద్భుతమే.. కానీ మంచం మీద నుంచి ఇంకా లేవలేకపోతున్నాను... జీవితం నరకమైంది..." అని రాజ్‌పాల్ రోధిస్తూ చెప్పాడు.

> "కబేళాలపై నిషేధం వల్లే ఈ సమస్య తలెత్తింది. వీటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాటిని కబేళాలకు పంపలేరు.. అలా అని తమ వద్దా ఉంచుకోలేరు.. మరో రెండేండ్లు ఇదే కొనసాగితే... సమస్య అదుపు తప్పిపోతుంది.."

"నేను అనేకసార్లు పంట నష్టపోయాను. ఉత్తర సివన్ గ్రామంలో దాడికి గురికాని పంట పొలం లేదు. పాలివ్వని ఆవులు, గేదెలు, దూడలు, అలాగే ఇతర ఉపయోగం లేని పశువులను గాలికొదిలేస్తున్నారు. వాటి పోషణ భారమవుతున్నది. అలా ఒదలొద్దని ఒత్తిడికూడా చేయలేకపోతున్నాం.." అని స్థానిక ప్రాథమిక పాఠశాలలో సహాయకుడిగా పనిచేస్తున్న మరో గ్రామస్థుడు **శివసేవక్ సింగ్** చెప్పాడు.



ఈ పశువులు ఒక్క పొలాల్లో విధ్వంసం సృష్టించడమే కాదు.. రోజువారీ జీవితానికి కూడా అంతరాయం కలిగిస్తున్నాయి. "నేను ఉదయం పాఠశాలకు చేరుకునేటప్పటికి దాదాపు 40కిపైగా పశువులు పాఠశాల వరండాను ఆక్రమించుకుని ఉంటాయి. విద్యార్థులందరినీ పిలిచుకురావాలి... వాటిని అక్కడి నుంచి తోలించి... పేడను ఎత్తించి... ఆ వరండాను శుభ్రం చేసిన తర్వాత మేం తరగతులు ప్రారంభించలేం.. పరిస్థితి ఇంత దారుణంగా ఉంది..' అని శివసేవక్ తెలిపారు.



సావిత్రి... కౌలుకు తీసుకున్న ఒకటిన్నర బిగాల పొలంలో మొక్కజొన్న పంట వేసింది. రాత్రిళ్లు సహా ఎంతో జాగ్రత్తగా కాపలా ఉన్నప్పటికీ.. పశువులు రెండుసార్లు పొలంలోకి చొరబడ్డాయి.. పంటను నాశనం చేశాయి. తన బంధువుల్లో చాలా మంది ఇదే చేదు అనుభవాన్ని చవిచూశారు. వెదురు కర్రలతో కంచెవేస్తే.. పరిస్థితి గుడ్డిలో మెల్ల మాదిరి.. కొంత మెరుగైందని సావిత్రి చెప్పింది.

పొరుగు గ్రామం గడ పూర్వాలోనూ ఇదే పరిస్థితి. పొలంపై పడి పంటను నాశనం చేస్తున్న పశువులను తరుముతుండగా... రామ్ బిహారి పాఠక్‌పై ఒక ఎద్దు దాడి చేసింది. ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. "పశువుల క్రయ విక్రయాలను ఎందుకు నిషేధించారో మాకు అర్థం కావడంలేదు..." అని రామ్ బిహారి అన్నారు. "ఎలాంటి ఉపయోగంలేని పశువులను ఎవరైనా ఎంత కాలం పోషిస్తారు? తమ వద్ద ఎంతకాలం ఉంచుకుంటారు? ఇంతకుముందు అలాంటి వాటిని కబేళాలకు పంపేవారు... మాపై, మా పొలాలపై దాడులు ఉండేవి కావు. పంట పొలాలకు నష్టం వాటిల్లేది కాదు. ఆచరణలో గో రక్షణ పంటలను నాశనం చేసేదిగా మిగిలింది. అలాగే రోడ్డు మీద వెళుతున్న బాటసారులను సైతం కొన్ని సందర్భాల్లో వెంబడిస్తున్నాయి..." అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పరిస్థితి ఇంత ఆందోళనకరంగా ఉన్నా... అవి పంట పొలాలను నాశనం చేస్తున్నా... చంపడానికి అవి మీదకు వస్తున్నా... వాటిని చంపడానికి మాత్రం అక్కడి వారు భయపడుతున్నారు.

గోరక్ష మంచిదా?

రాంబిహారి ఒక హిందూ మత బోధకుడు. భజనలు చేస్తాడు.. శ్లోకాలు పాడుతూ ఉంటాడు. హిందూ విశ్వాసాలకు నిబద్ధుడైన అతన్ని ప్రభుత్వ పశువిక్రయ నియంత్రణ చట్టం చికాకుపెట్టడంతో.. ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'గోరక్ష పశువులను రైతులకు శత్రువులను చేసింది. ఆ చట్టం పశువులను రక్షించగలదా? ఇది ఒక ప్రహసనం మాత్రమే కాదు... రైతుల వినాశనానికి దారితీస్తున్నది.



గ్రామంలోని పంట పొలాలు నాశనమవుతున్నాయి" అని రాంబిహారి అన్నారు. "గతంలో.. ఉదయం లేవ గానే మా సొంత పనులు చేసుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు లేవగానే ఒక ఆయుధాన్ని పట్టుకొని పొలంలోకి పరుగులు పెట్టాల్సి వస్తోంది" అని వాపోయారు.

"రైతులు ఇప్పుడు ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. ఎద్దుల అవసరం లేకుండా పోయింది. కానీ ప్రభుత్వం కబేళాలను మూసివేసినప్పటి నుంచి వాటిని కొనుగోలు చేసేవారే లేరు. పశువుల మార్కెట్‌లు మూతపడ్డాయి. ఉపయోగంలేని పశువులను ఎవరైనా ఎంతకాలం పోషించగలరు? ఎంకాలం వాటిని తమ వద్ద ఉంచుకోగలరు?" అని రాంబిహారి ప్రశ్నించారు. "ఎవరైతే వాటి మాంసాన్ని తినాలనుకుంటున్నారో... వారిని తిననిద్దాం.. మనం తినాలనుకోకపోతే... ఎవరూ మనల్ని బలవంతం చేయరు. రోడ్లపైనన్నా అవి యథేచ్ఛగా తిరగవు. పొలాలు సురక్షితంగా ఉంటాయి. రైతుల వినాశనాన్ని తెచ్చే గోరక్ష మంచిదా?' అని ఆయన ప్రశ్నించారు.

కబేళాల మూసివేత ఇక్కడ తీవ్ర ప్రభావాన్ని చూపిందని ఆ గ్రామ రిటైర్డ్ పోస్టుమాస్టర్ రసబిహారి పాండే చెప్పారు. "ప్రభుత్వం మాంసాన్ని ఏదో విధంగా ఎగుమతి చేస్తూనే ఉంది. అదేవిధంగా కొద్ది మంది దానిని తినాలనుకుంటే... అందులో తప్పేముంది..?" అని పాండే అభిప్రాయపడ్డారు.

"ఈ విషయమై జిల్లా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసేందుకు కొంతమందిమి కలిసి వెళ్ళాం. జంతువులు మన ఆస్తి. ఒక్కొక్కరు ఒక్కో పశువును ఇంట్లో పెట్టుకోండి. తన వద్ద ఇంతకంటే మరో పరిష్కారం లేదని అన్నారు. పశువులకు పెద్ద మేత క్షేత్రాన్ని, సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయమని మేజిస్ట్రేట్‌ను అడిగాం. మా డిమాండ్‌ను ఎవరూ పట్టించుకోలేదు" అని గడె పూర్వాకు చెందిన అమిత్ పతక్ వాపోయారు.

"యోగి ఆదిత్యనాథ్ గొప్ప జంతు ప్రేమికుడు. మేము మా సమస్యపై ఆందోళనచేస్తున్నప్పుడు... అతను పశువులకు మేత తినిపిస్తూ... వాటి మీద మరింత ప్రేమను ఒలకబోశారు. మరి వీటిని కూడా తీసుకెళితే బాగుంటుంది. రాగర్గంగ్ మార్కెట్ ఇక్కడకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. దారి మార్గంలో చూస్తే రోడ్డు మీద 500లకు పైగా పశువులు కనిపిస్తాయి. అవి అలా తిరుగుతుంటే.. పంట పొలాలు సురక్షితంగా ఉంటాయని ఎలా భావించగలం? అవి మా పొలాల్లో చేసే విధ్వంసానికి నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు?" అని అమిత్ పతక్ ప్రశ్నిస్తున్నారు.

"కబేళాలపై నిషేధం వల్లే ఈ సమస్య తలెత్తింది. వీటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాటిని కబేళాలకు పంపలేరు.. అలా అని తమ వద్దా ఉంచుకోలేరు.. మరో రెండేండ్లు ఇదే కొనసాగితే... సమస్య అదుపు తప్పిపోతుంది.." అని గ్రామ పెద్ద ద్వివేది చెప్పారు. ఆయన చెప్పిన మాటల్లో... "పరిస్థితి అధ్వాన్నంగా మారింది. పశువుల దాడుల నుంచి రైతులకు విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించాలి. ప్రస్తుత పాలనలో... వాటిని కొనుగోలు చేసేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఎవరైనా వాటిని కొనుగోలు చేసి తరలించుకువెళుతుంటే అధికార పార్టీ కార్యకర్తలు కనికరంలేకుండా కొడుతున్నారు. ఈ నేపథ్యంలో ధైర్యం చేసి ఈ ఉపయోగంలేని పశువులను ఎవరైనా ఎందుకు కొంటారు? పాలకులు మేల్కోకపోతే.. సమస్య మరింత జటిలమవడం ఖాయం"

ఉన్మాదుల వేధింపులు భరించలేక...

ఆత్మహత్యకు ప్రయత్నించిన విద్యార్థిని

- మృత్యువుతో పోరాడుతున్న బాలిక



షామ్లీ : వరుస లైంగికదాడులు, వేధింపులు వెలుగు చూస్తున్న ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణ ఘటన వార్తల్లోకెక్కింది. షామ్లీ జిల్లాలో ఉన్మాదుల వేధింపులు భరించలేక 12వ తరగతి విద్యార్థిని కిరోసిన్ పోసుకుని నిప్పంటిం చుకుంది. తీవ్ర కాలిన గాయాలైన ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఆమె ముఖం పూర్తిగా దెబ్బతింది. 'ఇప్పుడు నాకు బతుకుమీద ఆశలేదు...' అంటూ ఆమె రోదిస్తోంది. షామీ జిల్లా బల్లియాలో... 12వ తరగతి చదువుతున్న రాగినిని ఇద్దరు వ్యక్తులు ఉన్మాదుల్లా వేధిస్తుంటే తల్లిదండ్రులు ఇటీవలే ఆమెను స్కూల్ మాన్పించారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆమె ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. 'ఒక రోజు ధైర్యం కూడగట్టుకుని స్కూల్‌కు వెళ్ళాను. వారి వేధింపులు షరా మామూల య్యాయి. వారి వేధింపులను నిరసిం చాను. వారిపై కేకలు వేశాను. దీంతో మారు మరింత రెచ్చిపోయారు. తమ మాట వినకపోతే.. మా అన్నను చంపుతామని బెదిరించారు. దాంతో భయపడిపోయాను. అక్కడి నుంచి నన్ను బలవంతంగా ఒక హోటల్‌కు తీసుకెళ్ళారు. అక్కడ లైం గికదాడికి పాల్పడ్డారు. ఆ దుర్మార్గ చర్యను వీడియో తీసి ప్రతిరోజూ వేధింపులకు గురిచేస్తున్నారు.

ఎవరికైనా చెబితే అన్నతో పాటు, కుటుంబసభ్యులనూ చంపేస్తామంటూ రోజూ వేధింపులకు గురిచేసేవారు. తన అన్నను ఏం చేస్తారోనన్న భయంతో ఈవిషయాన్ని కుటుంబసభ్యులకు ఎవరికీ చెప్ప లేదు. రోజురోజుకూ వేధింపులతోపాటు.. ఆ వీడియోను వైరల్ చేస్తామని వారి బెదిరింపులూ ఎక్కువయ్యాయి. నాకు జీవితం మీదే విరక్తి కలిగింది. శనివారం ఇంట్లో ఎవరూ లేరు.. ఆ సమయంలో కిరోసిన్ పోసుకుని... నిప్పంటించుకున్నాను..' అని ఆమె పోలీసులకు తెలిపింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా ఒకరిని పోలీసులు అరెస్టుచేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై నాన్ బెయిలబుల్ వారెంట్..

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు కపిల్ అగర్వాల్, ఉమేశ్ మాలిక్‌లపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించిన కేసులో విచారణకు హాజరు కాకపోకపోవడంతో స్థానిక కోర్టు ఈ చర్య తీసుకున్నది. ముజఫర్‌నగర్ నియోజవర్గానికి కపిల్ అగర్వాల్, బుధానా స్థానానికి ఉమేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2012, ఏప్రిల్ 3న ముజఫర్‌నగర్‌లో రైల్‌రోకో చేపట్టిన ఘటనలో కపిల్, ఉమేశ్‌తో సహా పలువురు బీజేపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసు విచారణకు హాజరు కాని ఎమ్మెల్యేలిద్దరిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిని సెప్టెంబర్ 30న కోర్టులో హాజరుపర్చాలని పోలీసులను చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు గోపాల్ తివారి ఆదేశించారు.

వరద బాధితుల్లో ఆగ్రహం

- సర్కారు గోడౌన్‌ల లూటీ



కోల్‌కతా : బెంగాల్లోని దినాజ్‌పూర్, మాల్డా పరిసరాల్లో వరద పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బెంగాల్ ఉత్తర ప్రాంతాల్లోని జిల్లాలు భారీ వర్షాలతో పల్లెలు పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. ఫుల్వార్, మహానంద నదులు పొంగి ప్రవహిస్తున్నయి. రెక్కాడితే కానీ డొక్క నిండని బడుగు జీవులు తినడానికి తిండిలేక, తలదాచుకునేందుకు సరైన గూడు లేక, కనీసం తాగడానికి మంచి నీరు లభించక నానా కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అంతంత మాత్రమే. చాలా చోట్ల రోడ్డు, రైలు రవాణా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. లక్షలాది మంది తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకున్నారు. వారికి ఆహారం, మంచినీటి సరఫరా జరగటం లేదు. ఇప్పటికే వారం రోజులుగా వరద బీభత్సంతో బిక్కుబిక్కుమంటున్న వరద బాధితులలో ఆగ్రహం కట్టలు తెగింది. కడగండ్లకు తోటు కండ్ల వచ్చే నీటిని అదుపు చేసుకుంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిరసనలు తెలియజేశారు.రెండు రోజుల క్రితం దినాజ్‌పూర్ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయంపై దాడిచేసి విధ్వంసం సృష్టించారు. శ్రీపూర్ ప్రాంతంలోని ప్రభుత్వ గోడౌన్‌పై దాడిచేసి సరుకులు కొల్లగొట్టారు. దినాజ్‌పూర్ దక్షిణ ప్రాంతంలో స్థానిక గ్రామ పంచాయతీ సభ్యులపై దాడి చేశారు. ఈ పరిస్థితిపై సమీక్షించేందుకు సీపీఐ(ఎం) ఎంపీ ఎండి సలీం హుటాహుటిన వరద ప్రాంతాలకు వెళ్లారు. ప్రకృతి విలయతాండవం చేసిన ఇలాంటి క్లిష్ట సమయాల్లో కూడా రాష్ట్రంలోని మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం దీనిని కనీసం విపత్తుగా కూడా గుర్తించినట్టు కనిపించదని ఆయన వ్యాఖ్యానించారు.

ఎన్‌డీఏలోకి నితీశ్

- నితీశ్ నివాసం వద్ద జేడీ(యూ) చీలిక వర్గాల మధ్య ఘర్షణ
- నితీశ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, నినాదాలు

పాట్నా : బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరడానికి జేడీయూ జాతీయ మండలి ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం బీహార్ సీఎం నితీశ్‌కుమార్ అధికారిక నివాసంలో జేడీయూ జాతీయ మండలి సభ్యులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే బీజేపీతో నితీశ్‌కుమార్ వర్గం చేతులు కలిపి బీహార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నితీశ్ నిర్ణయాన్ని ఆ పార్టీ సీనియర్ నేత శరద్‌యాదవ్ వర్గంగట్టిగా వ్యతిరేకి స్తున్నది. దాంతో, జేడీ(యూ) రెండుగా చీలిపోక తప్పని పరిస్థితి.

కేంద్ర మంత్రివర్గంలోనూ జేడీ(యూ)కు స్థానం కల్పించనున్నట్టు తెలుస్తోంది. నితీశ్ వర్గానికి లోక్‌సభలో ఇద్దరు, రాజ్యసభలో ఏడుగురు ఎంపీల బలమున్నది. కాగా, మరో ఇద్దరు రాజ్యసభ సభ్యుల బలం శరద్‌యాదవ్ వర్గానికున్నది. నితీశ్‌కుమార్‌కు ఎన్‌డీఏ కోకన్వీనర్ పదవి కూడా ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. జేడీ(యూ) జాతీయ మండలి సమావేశం సందర్భంగా జేడీ(యూ)లోని చీలిక వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. నితీశ్ నివాసంవైపు దూసుకువెళ్లేందుకు శరద్ వర్గీయులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శరద్ వర్గానికి చెందిన జేడీ(యూ) కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నితీశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే, తమతో ఘర్షణకు దిగిన కార్యకర్తలంతా ఆర్‌జేడీకి చెందినవారుగా నితీశ్ వర్గం ఆరోపించింది.



పోటీగా శరద్‌వర్గం భేటీ

నితీశ్ సమావేశానికి పోటీగా శరద్‌యాదవ్ తన మద్దతుదారులతో మరోచోట భేటీ అయ్యారు. అందు కోసం శనివారం ఉదయమే ఆయన పాట్నా చేరుకున్నారు. తనదే నిజమైన జేడీ(యూ) అని శరద్‌యాదవ్ ఇప్పటికే ప్రకటించారు. శరద్‌యాదవ్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి జేడీ(యూ) రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ హాజరయ్యారు. శరద్‌వర్గం భేటీ ప్రారంభంలో గోరఖ్‌పూర్‌లో మృతి చెందిన చిన్నారులతోపాటు ఇటీవలి బీహార్ వరదల్లో మృతి చెందినవారికి ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. తమ పార్టీలో చీలిక నేపథ్యంలో తాను దేశవ్యాప్తంగా పర్యటించనున్నట్టు శరద్‌యాదవ్ తెలిపారు.

విద్యార్థుల 'శోధన'పై ఓ కన్నేయండి..

- స్కూళ్లకు సీబీఎస్ఈ మార్గదర్శకాలు
- బ్లూవేల్ డెత్ గేమ్ ఎఫెక్ట్

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమ్ బ్లూవేల్ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న క్రమంలో.. విద్యార్థులపై ఈ ప్రభావం పడకుండా కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు(సీబీఎస్ఈ) చర్యలు చేపట్టింది. విద్యార్థుల ఇంటర్నెట్ వినియోగంపై నిఘా పెట్టాలని అన్ని స్కూళ్లను సీబీఎస్ఈ ఆదేశించింది. సైబర్ దాడుల నుంచి విద్యార్థులను రక్షించడం, అశ్లీల వెబ్‌సైట్లకు దూరంగా ఉంచే దిశగా కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. స్కూళ్లలో వాడే కంప్యూటర్లకు ఫైర్‌వాల్స్, ఫిల్టర్లు, మానిటరింగ్ సాఫ్ట్‌వేర్‌లను అమర్చుకోవాలని ఆదేశించింది. అంతేకాక.. అందరికి కనపడే విధంగా(ఓపెన్ ప్లేస్‌లో) విద్యార్థులు ఇంటర్నెట్‌ను వాడేలా చర్యలు చేపట్టాలని తెలిపింది. పిల్లల రోజువారీ శోధనా లిస్టును క్రమం తప్పకుండా స్కూలు యాజమాన్యాలు పరిశీలించాలని పేర్కొన్నది. 50 దశల్లో ఉండే బ్లూవేల్ గేమ్ ఇప్పుడు ప్రాణ సంకటంగా మారింది. ఈ ఆట ఆడుతూ దేశంలో ఇప్పటికే నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఆన్‌లైన్‌లో ఆట ఆడే వ్యక్తి 49 దశలు పూర్తి చేసిన తర్వాత చివరి టాస్క్‌లో భాగంగా ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుంది. బ్లూవేల్ గేమ్ లింకులను తొలగించాలని ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, యాహూ, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్‌లకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

విద్యుత్ సవరణ బిల్లును తిరస్కరించాలి

కంటెంట్-క్యారియర్ విధానం వల్ల ప్రజలపై ఆర్థిక భారాలు

- 'ఇఫీ' జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హబీబ్, చౌదరి



మాట్లాడుతున్న చౌదరి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్కరణల సవరణ బిల్లును పార్లమెంటు తిరస్కరించాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఫీ) డిమాండ్ చేసింది. 'ఈఫీ' 8వ జాతీయ మహాసభల రెండోరోజు సమావేశం శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో 'ఇఫీ' జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఓ హబీబ్, పిఎన్ చౌదరి మాట్లాడారు. 2014 విద్యుత్ సవరణల బిల్లును అప్పటి యూపీఏ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, దీనిపై కేంద్ర విద్యుత్ కార్మిక, ఉద్యోగ సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేసి, ఆందోళనలు నిర్వహించాయని తెలిపారు. ఫలితంగా అప్పట్లో ఆ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందలేదని చెప్పారు. ప్రస్తుతం ఇదే బిల్లును పాస్ చేయించుకొనేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని వివరించారు. ఈ బిల్లులోని కంటెంట్-క్యారియర్ విధానం వల్ల విద్యుత్ వినియోగదారులపై తీవ్రమైన ఆర్థిక భారాలు పడతాయని తెలిపారు. విద్యుత్‌లైన్లు ప్రభుత్వానివి ఉంటే...దానిలో ప్రవహించే కరెంటు ప్రయివేటుది ఉంటుందని, ఆ దిశగా సంస్కరణల్ని ప్రతిపాదించారని తెలిపారు. దీనివల్ల జవాబుదారీతనం లోపించి, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడతారని వివరించారు. దేశంలో మిగులు విద్యుత్ ఉందని, 97 శాతం గ్రామాలకు విద్యుత్ ఇచ్చేశామని కేంద్రప్రభుత్వం ప్రచారం చేసుకోవడాన్ని వారు తప్పుపట్టారు. గతవారంలో పార్లమెంటరీ స్థాయి సంఘం ఇచ్చిన నివేదికలో దేశంలో ఇంకా 30 కోట్ల గృహాలకు విద్యుత్ సౌకర్యం లేదని పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. సమాన పనికి సమాన వేతనంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత మహాసభల్లో ఈ అంశాలపై విస్తృతస్థాయి చర్చలు నిర్వహించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించుకుంటామన్నారు. ఈ ఉద్యమాల్లో కలిసి వచ్చే అన్ని కేంద్ర కార్మిక సంఘాలను భాగస్వాముల్ని చేస్తూ, మద్దతు కూడగడతామని చెప్పారు. 'ఇఫీ' జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు (కిరణ్) మాట్లాడుతూ తెలంగాణ 20,903 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని విలీనం చేసుకుంటామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, కోర్టు కేసుల పేరుతో వారికి అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవనే నెపంతో ట్రాన్స్‌ఫారం మరమ్మతు కార్మికులు, మీటర్ రీడర్లు వంటి మరో 10వేల మంది కార్మికులు ఉన్నారని, వీరిని కూడా విలీనంలో భాగస్వాముల్ని చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌లోకి మార్పు, పెన్షన్ సౌకర్యం వంటి డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఆహ్వాన సంఘం సమన్వయకర్త ఆర్ సుధాభాస్కర్ పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టులకు గుర్తింపు దక్కాలి

ఐజేయూ సెక్రెటరీ జనరల్ దేవులపల్లి అమర్


ఫొటో గ్యాలరీని వీక్షిస్తున్న అమర్, తదితరులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ 2017 ఉత్తమ వార్త ఛాయా చిత్రాల పోటీలు నిర్వహించింది. ఈ పోటీకి వచ్చిన ఫొటోల ప్రదర్శనను శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సీనియర్ జర్నలిస్టు, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ సెక్రెటరీ జనరల్ దేవులపల్లి అమర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్త ప్రపంచానికి ఆది నుంచి ఫొటో జర్నలిజం ప్రాణంలాంటిదని అన్నారు. అయినా ఫొటో జర్నలిజానికి దక్కాల్సిన ప్రాధాన్యత, గుర్తింపు దక్కడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్త ప్రపంచంలో వెయ్యి పదాలు చెప్పలేని అర్థాలను, భావాలను ఒక్క ఫొటో చెబుతుందన్నారు. మానవీయ, రాజకీయ, సామాజిక అన్ని కోణాల నుంచి తీసే ఒక్క ఫొటో రాసిందానికంటే కూడా చూపినదానికి నిర్ధారణ ఎక్కువగా ఉంటుందని అమర్ వివరించారు. మారిన ఫొటో ప్రపంచంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వార్త ప్రపంచంలో ఫొటోలు తీసే ఫొటో గ్రాఫర్లకు మరింత ప్రాధాన్యత, గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం ఇలాంటి పోటీలను నిర్వహించడం ద్వారా ఫొటో జర్నలిస్టులకు ప్రోత్సాహనివ్వడం అభినందనీమన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారికి తగిన గుర్తింపు పొందేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టు సంఘం అధ్యక్షులు ఎ.గంగాధర్ అధ్యక్షత వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పత్రికల్లో పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టులను మరింత ప్రోత్సహించాలన్న భావనతో సంఘం ఆధ్వర్యంలో ప్రతియేటా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కెఎన్.హరి మాట్లాడుతూ ఈ సారి 31 జిల్లాల నుంచి 101 ఎంట్రీలు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ సంఘం నాయకులు కె.అనీల్‌కుమార్, వి.రామూర్తి, వసంత్‌కుమార్, ఎం.శివకుమార్, హెచ్‌యుజే ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, సీనియర్ ఫొటో జర్నలిస్టు డీ.రవీందర్‌రెడ్డి, కె.రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న ఫొటోగ్రాఫర్లు

మొదటి బహుమతి ఎమ్.రమేశ్(ఈనాడు, హైదరాబాద్), రెండవ బహుమతి పి.శ్రీధర్(ఆంధ్రజ్యోతి, జగిత్యాల), మూడవ బహుమతి దశరథ్ రాజువ(సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం)లకు లభించాయి.

కన్సోలేషన్ బహుమతులు ఎ.యాదవ్(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), పి.శ్రీనివాస్(ఈనాడు, కరీంనగర్), సలీమ్(ఎఎఫ్‌పి, హైదరాబాద్), రాము(ఈనాడు, హైదరాబాద్), లవకుమార్(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), శ్రీనివాసప్రసాద్(ఆంధ్రప్రభ, నల్లగొండ), వేణు గోపాల్(సాక్షి, జనగాం), శ్రీనివాస్ (హన్స్‌ఇండియా), నాగమణి రాజు(ఆంధ్రజ్యోతి, జనగాం), దుర్గారావు (ఆంధ్రభూమి, హైదరాబాద్), శ్రీధర్(ఈనాడు, హైదరాబాద్), వెంకన్న(నమస్తే తెలంగాణ, వరంగల్), రామ్‌నాథ్(ఆంధ్రప్రభ, హైదరాబాద్), సురేందర్(డెక్కన్ క్రానికల్, హైదరాబాద్), రవి వర్మ(ఫ్రీలాన్స్, కరీంనగర్) ఉన్నారు.

ఢిల్లీ వేదికగా.. కేసీఆర్ నిర్వాకాన్ని ఎండగడతాం...

'ధర్నాచౌక్'పై రేపు జంతర్ మంతర్ వద్ద ధర్నా :

పరిరక్షణ కమిటీ నేతలు

- హాజరుకానున్న ఏచూరి, సురవరం, రాహుల్‌గాంధీ
- ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలని సీఎంకు హితవు
- కేంద్ర హోం మంత్రిని కలుస్తామని వెల్లడి



మాట్లాడుతున్న చెరుపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధర్నాచౌక్ పరిరక్షణ ఉద్యమం దేశ రాజధాని ఢిల్లీని తాకబోతున్నది. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం లో ప్రజాస్వామ్య హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛ కాల రాయబడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాకాన్ని ఢిల్లీ స్థాయిలో ఎండగడతామని ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ హెచ్చరించింది. ఇందులో భాగంగా సోమవారం అక్కడి జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తామని తెలిపింది. ఈ ఆందోళనా కార్యక్రమాల్లో సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీతోపాటు బీఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ తదితర పార్టీల నేతలు హాజరుకానున్నారని పరిరక్షణ కమిటీ కన్వీనర్ చాడ వెంకటరెడ్డి చెప్పారు. ధర్నా అనంతరం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని, రాష్ట్రంలోని పరిస్థితులను ఆయనకు వివరిస్తామని తెలిపారు. ఆ తర్వాత కూడా ముఖ్యమంత్రి తన వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో కమిటీ కో-కన్వీనర్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ (ఎం) శాసనమండలి మాజీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నలమాస కృష్ణ (టీపీఎఫ్), రమాదేవి (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), సజయ (సామాజిక కార్యకర్త), తేజ (ఎస్‌యుసీఐ-సీ), కె.గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), సత్యంగౌడ్ (టీజేఏసీ), హన్మేశ్ (న్యూడెమోక్రసీ), మల్లేపల్లి ఆదిరెడ్డి (సీపీఐ)తో కలిసి చాడ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్నాచౌక్ ఆక్రమణ (మే 11న నిర్వహించారు) తర్వాతైనా కేసీఆర్ వైఖరిలో మార్పు వస్తుందని తాము భావించామని అన్నారు. అయితే ఇప్పటికీ అదే నియంతృత్వ పోకడలతో ఆయన వ్యవహరిస్తున్నారని చెప్పారు. వివిధ కార్మిక, ప్రజా సంఘాలు, అసోషియేషన్లు, ఎన్జీవోలు ప్రదర్శనలు, ధర్నాల కోసం పోలీసు వారిని అనుమతి కోరితే.. తిరస్కరిస్తున్నారని తెలిపారు. నగర శివార్లలో ధర్నాలు చేసుకోండంటూ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అంటే ప్రజల గోస.. అరణ్య రోదనేనా..? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సోమవారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అత్యంత నియంతృత్వ పోకడలు... : చెరుపల్లి

టీఆర్ఎస్ సర్కారు అత్యంత నియంతృత్వ పోకడలు పోతున్నదని చెరుపల్లి విమర్శించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదని హితవు పలికారు. తక్షణం ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

జయప్రదం చేయాలి.. : కోదండరామ్

జంతర్ మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోదండరామ్ పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి పలు ప్రజా సంఘాల నేతలు, అభ్యుదయ, ప్రజాతంత్ర వాదులు, విద్యార్థులు, మేధావులు ఢిల్లీకి చేరుకున్నారని చెప్పారు. ఆదివారం కూడా వందలాది మంది ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారని తెలిపారు.

ఇంతటి దుర్మార్గం ఎక్కడా లేదు... : పిఎల్ విశ్వేశ్వరరావు

దేశంలో మరెక్కడా ఇంతటి దుర్మార్గం లేదని పీఎల్ విశ్వేశ్వరరావు చెప్పారు. ఇతర రాష్ట్రాలన్నింటికీ ఒక రాజ్యాంగం.. తెలంగాణాకు మరో రాజ్యాంగం ఉంటుందా? అని ప్రశ్నించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలన్నింటిలో ధర్నాచౌక్‌లు ఉన్నాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు మన రాష్ట్రంలో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు.

ఫొటోగ్రాఫర్లకు బతుకమ్మ పోటీలు

ఛాయాచిత్ర పోటీల బహుమతుల ప్రదానోత్సవంలో కవిత



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బతుకమ్మ పండుగ సందర్భంగా ఫొటోగ్రాఫర్లకు అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపి కవిత తెలిపారు. ప్రతీ గ్రామం నుండి బతుకమ్మ చాయాచిత్రాలను తీసిన ఫొటోగ్రాఫర్లు తమ ఎంట్రీలను పంపాలని కోరారు. తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్‌తో కలసి బతుకమ్మ పోటీలు నిర్వహిస్తామన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఏడు కేటగిరీల్లో నిర్వహించిన ఛాయాచిత్రాల పోటీల విజేతలకు కవిత బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ పర్యాటక శాఖ, భాషా, సాంస్కృతిక శాఖల సౌజన్యంతో ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించింది. ఛాయాచిత్ర ప్రదర్శనను కవిత తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టుల విధి రిపోర్టర్లకు భిన్నమైనదని తెలిపారు. పొలిటీషియన్స్, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు ఒక విషయంలో సిమిలారిటీ ఉంటుందని, ఎప్పుడూ అప్రమత్తతతో ఉండటమే ఈ రెండు ప్రొఫెషన్లలో కీలకమైనదని కవిత వివరించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టియుడబ్ల్యూజె ఉపాధ్యక్షులు పల్లె రవికుమార్, ఇస్మాయిల్, సూరజ్ కుమార్, యోగానంద, మారుతి సాగర్, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఈనెలాఖరు లోపు ఈఓడీబీ విధిగా అమలు చేయాలి

- అధికారులకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సంస్కరణలను ఈ నెల 30 వరకు అన్ని శాఖల్లో విధిగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఈఓడీబీపైన ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 372 సంస్కరణలకు గాను 315 సంస్కరణలు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రమోషనల్‌లో అమలవుతున్నాయని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని శాఖల్లోను పూర్తి స్థాయిలో సంస్కరణలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంపాదకీయం

ఆలోచన.. ఆచరణ

"అడుగుల్లాంటివే ప్రగతిశీలి ఆలోచనలు
అవరోధాలెదురైతే అవి ఆగిపోవు
పురోగమనమే వాటి
నిరంతర శీలం
ప్రలోభాలను కాళ్ల మునివేళ్లతో పక్కకు తోసి,
ముందుకు సాగే
నిశ్చల చిత్తవృత్తి అడుగులది..." అని చెబుతారు డాక్టర్ సినారె.

కాలంతోపాటు కొత్త ఆలోచనలు చిగురిస్తూనే ఉంటాయి. ఆ ఆలోచనలకు సరియైన ఆచరణ రూపమిస్తే ఆ దృశ్యం పొద్దున్నే విచ్చుకున్న ఎర్రని మందారంలా మనోహరంగా ఉంటుంది. పురోగమనానికి ఆచరణ కీలకం. ఆలోచనలు వేరు. ఊహలు వేరు. ఊహలు వాస్తవ దూరం. అవి కండ్లు తెరుచుకొని కనే కలల్లాంటివి. అటువంటి ఊహలకు అంతూ దరీ ఉండదు. అర్థం పర్థం ఉండదు. నీతీ నియమం రీతీ రివాజూ యివేవీ ఉండవు. ఎవరిష్టమొచ్చినట్టు వారు, ఎవరికి నచ్చినట్టు వారు ఊహల్లో తేలియాడుతుంటారు. ఈ ఊహాలోకంలో నుంచి బయటకు రాగానే తన చుట్టూ ఉన్న వాస్తవిక ప్రపంచాన్ని చూసి నీరస పడిపోతారు. నిరుత్సాహ పడతారు. అందుకే ఊహా ప్రపంచంలో విహారం వల్ల ప్రయోజనం శూన్యం. వాస్తవ జగత్తును అర్థం చేసుకోవాలి. అంతేకాదు, ఆశలూ.. కోరికలతోటే అనుకున్నవన్నీ సాధించలేం. అనుకున్నవి అనుకున్నట్టు సాధించడానికి కార్యాచరణ అత్యంత ముఖ్యం. చిన్నయినా, పెద్దయినా, జీవిత గమనంలో ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది.

మన చుట్టూ ఉన్న వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు వాస్తవానికి దగ్గరగా అనేక ఆలోచనలు కలుగుతాయి. వాటి ఆధారంగానే నిర్ణయాలూ ప్రణాళికలూ రూపొందించుకుంటాం.

ఓ చిత్రకారుడు ఓ బొమ్మను అందంగా చిత్రీకరించగలిగాడంటే అతని ఆలోచనలూ.. ఆచరణే కీలకం. అందుకని కేవలం ఆశలుంటే సరిపోదు. ఆచరణ సాధ్యమైన వాటి గురించి అన్వేషించాలి. అధ్యయనం చేయాలి. మనం చేసే పనిని ప్రేమించాలి. నవనవోన్మేషమైన ఆలోచనలతో చేస్తున్న పనిని సమర్థవంతంగా చేయడం పట్ల దృష్టి కేంద్రీకరించాలి. పరిపూర్ణత్వం కోసం ప్రయత్నించాలనే తపనా చోదకశక్తీ కావాలి. ఊహల్లో నుంచి వాస్తవ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. అది కుటుంబమయినా, సమాజమయినా, వ్యక్తిగత జీవితమయినా అంతే...!



నిజానికి మనుషులెప్పుడూ గెలుపునే కాంక్షిస్తారు. తాము పట్టిందల్లా బంగారం కావాలనుకుంటారు. అంటే తాము తలపెట్టిన ఏ కార్యమైనా ఫలించాలని ఆశిస్తారు. ఓటమిని తట్టుకోలేరు. ఊహించనూ లేరు. కొత్తదనం లేదంటారు. జీవితం చాలా రొటీన్‌గా ఉందంటారు. ఒకవైపు పాతను వదులుకోలేరు. ఇంకా ఇంకా ఏదో కావాలని జిజ్ఞాస. అదేమిటో తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఊహించినది తమకు లభ్యం కానప్పుడు ఆ మనిషి గుండెనిండా అసంతృప్తి నిండిపోతుంది. అది పెరిగి పెరిగి జ్వాలగా రగులుతుంది. కలగాపులగమైన యిటువంటి ఆలోచనలతో వాస్తవాన్ని మనిషి విస్మరిస్తాడు. అంటే, మనం అనుకున్నట్టే జరిగితే బావుండు.. అనేది ఊహ. ఈ ఊహకు ఫలానా అనే ప్రాతిపదికేదీ ఉండదు. దీనినే ఊహాజనితం అని అంటారు. కానీ, ఆలోచన భిన్నమైంది. ఆ ఆలోచన వ్యక్తిగతం కావొచ్చు. సమిష్టి కావొచ్చు. ఆ ఆలోచనను అమలులో పెట్టేదే ఆచరణ.

మన వ్యక్తిగత జీవితంలోనూ సవ్యమైన ఆలోచనలు అవసరం. పారదర్శకమైన సంబంధాలు అవసరం. ప్రతికూల మనస్తత్వం గలవారు మన పరిసరాల్లో ఉండి మాట్లాడుతుంటే వాటి ప్రభావం మన పనుల మీద, మన ఆలోచనల మీద, నిర్ణయాల మీద ఉంటుంది. నిజాల పునాదుల మీదనే మానవ సంబంధాలు నిలబడతాయి. పురోభివృద్ధి చెందుతాయి. 'మంచి మిత్రుడు తన స్నేహితుని ఆలోచనలకు మార్గం చూపుతాడు..' అన్నట్టు మన చుట్టూ ఉన్న వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు వాస్తవానికి దగ్గరగా అనేక ఆలోచనలు కలుగుతాయి. వాటి ఆధారంగానే నిర్ణయాలూ ప్రణాళికలూ రూపొందించుకుంటాం. మళ్లీ వాటిని అమలుచేసే క్రమంలో ఆ ఆలోచనలకు మరింతగా పదును పెట్టుకోగలుగుతాం. అప్పటివరకూ నిర్ధారించుకున్న విషయాలలో ఏది మంచో ఏది చెడో తేల్చుకోగలుగుతాం.

సమాజానికి సంబంధించినంత వరకూ మంచైనా చెడైనా కేవలం ఎవరో ఒక వ్యక్తికే పూర్తి బాధ్యత ఆపాదించలేము. అలాగే ఒక కుటుంబం కావొచ్చు. ఒక సంస్థ కావొచ్చు. అప్పుడు ఆయా రంగాలకు సంబంధించిన విషయాలు అత్యధికుల ఆలోచనలకు అనుగుణ్యమైనవే ఆచరించాలి. అమలు చేయాలి. భిన్న ఆలోచనలు ఉండొచ్చు. వాటిని వ్యక్తం చేయొచ్చు. మన కుటుంబ జీవితానికైనా యిదే ప్రాతిపదిక. ఆచరణ సాధ్యం కాని ఆలోచనలు ఉండకూడదు. ఆరోహణకైనా, అవరోహణకైనా వివేకం అవసరం కదా.. అందుకనీ.. ఆదాయానికి మించిన ఆలోచనలూ శక్తికి మించిన లక్ష్యాలూ ఈ కోవలోనివే.

'ధైర్యం లేకుంటే మనిషి ఏ రంగంలోనూ విజయం సాధించలేడు..' అని స్వామి వివేకానంద చెబుతారు. ఆలోచనలను అమలు చేయడం ఆచరణ అయితే, సరియైన ఆలోచనలు రూపొందడానికి కూడా ఆచరణే అవసరం. ఆచరణ లేని ఆలోచన వాసన లేని పూవులాంటిది. అందుకే అన్నిటికీ ఆచరణే గీటురాయి. మన ఆలోచనలూ ఆచరణా మేళవించాలి. ఆదిమానవుల నుంచి అత్యాధునిక మనుషుల వరకూ శ్రమించకుండా సమాజం ముందుకు సాగలేదు. అందుకని మనం చేయాలనుకున్న పని సమాజ హితమే.. అయినపుడు ఆలస్యం ఎందుకు.. సూటిగా ఆచరించడమే..!

పసిపిల్లలకు పశువులపాటి విలువలేదా...?



ఎస్. వినయకుమార్

గోరక్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో పెద్ద సంఖ్యలో సంభవించిన పిల్లల మరణాలకు కారణమేమిటి? ఆక్సిజన్ కొరత ఎంతవరకు కారణం? అపరిశుభ్రత ఎంతవరకు కారణం? ఇందుకు ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం బాధ్యత ఎంత? గత ప్రభుత్వాల బాధ్యత ఎంత? వంటి ప్రశ్నలు ముందుకొచ్చాయి. నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట ప్రజా సమూహంలో కన్పించే ఈ రకం మెదడువాపు వ్యాధిని యూపీ ఎందుకు సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతోంది. దోమకాటు వల్ల సంక్రమించే ఈ వ్యాధిని నివారించడానికి పరిశుభ్రత ముఖ్యం. మరి అపరిశుభ్రతకు ఎవరు కారణం..? ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగిని రెండు దశాబ్దాల నుండి లోక్‌సభకు పంపిస్తున్న గోరక్‌పూర్ అపరిశుభ్రతలో ఓలలాడుతోందన్నది నిజం. క్లీన్ సిటీల జాబితాలో ఇదొక అట్టడుగున ఉన్న పట్టణం. పట్టణ పరిశుభ్రత గురించి యోగి ఎప్పుడూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన పరిశుభ్రతపై దృష్టి సారించలేదు. బీఆర్‌డీ ఆస్పత్రి కూడా చెత్తాచెదారంతో కంపుకొట్టేదేనని మీడియా వార్తలు పేర్కొన్నాయి. ఇంత జరిగినా యోగితీరు విడ్డూరంగా ఉంది. పెద్ద సంఖ్యలో జరిగిన పిల్లల మరణాలపై దేశమంతా నివ్వెరపోయి, విషాదంలో మునిగిపోగా, ముఖ్యమంత్రి యోగి కృష్ణాష్టమి వేడుకల్లో మునిగిపోయారు. ప్రాణం కోసం విలవిలలాడుతున్న పసిపాపల్లో యోగికి బాలకృష్ణులు కన్పించలేదు. యోగి వ్యవహారశైలిలో, ఆలోచనా ధోరణిలో పొంచి ఉన్న ప్రమాదమే ఇది. యోగి సంరక్షణకు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నడుం బిగించడానికి ఈ ధోరణే కారణం.

చావులకు ఆక్సిజన్ కొరత కాదని ముఖ్యమంత్రి దబాయిస్తుండగా ఆక్సిజన్ కొరత కూడా అక్కడ ప్రాణాంతకంగా పరిణమించిందని దర్యాప్తు బృందాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి ఆ వాస్తవాన్ని పట్టించుకోవడం లేదు. యోగి చెప్పినట్టు అపరిశుభ్రత కూడా వ్యాధికి కారణమే. మరి పరిశుభ్రతను కాపాడాల్సిందెవరు? రాష్ట్రప్రభుత్వానికి ఆ బాధ్యత లేదా? పరిశుభ్రత ప్రజల బాధ్యత అన్నదే స్వచ్ఛ భారత్ కాన్సెప్ట్. యోగి మాటల్లోనూ అదే వ్యక్తమవుతోంది. స్వచ్ఛభారత్ పేర విధించడం వరకే తమ బాధ్యత అన్నట్టుగా ఉంది ప్రభుత్వ ధోరణి. చెత్తకుప్పలను, పశువుల మలమూత్రాలను ఎత్తేసి శుద్ధి చేయడం ఓ దీర్ఘకాలిక ప్రణాళిక కాదు గదా? మరి యోగి ప్రభుత్వంలో ఆ పని ఎందుకు జరగడం లేదు. పశు విసర్జితాల్లో పవిత్రమన్న అశాస్త్రీయ భావన కూడా అపరిశుభ్రతకు కారణమవుతోంది. మరుగుదొడ్లపై పెద్దఎత్తున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. మంచిదే... కానీ పశువుల వల్ల ఏర్పడే అశుభ్రతను కూడా తొలగించాలి కదా. ఆ పని ఎందుకు జరగడం లేదు. గోరక్‌పూర్‌లో ఆస్పత్రులు, తదితర చికిత్సా విభాగాల చుట్టూ పశువులు సంచరిస్తున్నాయి. ఆకలితో అవి ప్లాస్టిక్ కాగితాలతో సహా దొరికిందల్లా తింటున్నాయి. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత యోగి ప్రభుత్వానికీ గోరక్షక దళాలకు లేదా? పశుమాంస భక్షకులన్న ముద్రవేసి ముస్లింలు, దళితులపై దాడి చేయడమేనా గోరక్షక దళాల పని వంటి ప్రశ్నలకు కూడా బీజేపీ, యోగి సర్కార్ సమాధానం చెప్పాల్సి ఉంది.

బీఆర్‌డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ మండలి (ఐఎంఏ) బృందం పేర్కొంది. చాలా కాలం నుండి అక్కడ ఆక్సిజన్ కొరత నెలకొంది. ఆ ఆస్పత్రి ప్రమాణాల ప్రకారం 400 సిలిండర్లు ఎప్పుడూ నిలువ ఉండాలి. కాగా 60 సిలిండర్లకు మించి నిలువ ఉండటం లేదట. ఐదారు నెలల నుండి ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సరఫరాదారు 4రిమైండర్లు పంపినా ఫలితం లేకుండా పోయింది. నేరుగా సంబంధిత మంత్రికి లేఖ పంపినా స్పందన లేదు. అధికారులూ మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది నిధుల సమస్యా? అవినీతి జాఢ్యమా? తేల్చడానికి యోగి సిద్ధంగా లేరు. దీనివల్ల తన ప్రభుత్వ సమర్థతే ప్రశ్నార్థకమవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తున్నది.

బీఆర్‌డీ ఆస్పత్రిలో ప్రతిరోజూ ఏడుగురు పిల్లలు చనిపోతారట. అక్కడ చావులు మామూలే అని అమిత్‌షా చేసిన వాదనకు ఈ సంఖ్య మూలం. కాని ఆగస్టు 10వ తేది నాడు ఒక్కరోజే 23మంది పిల్లలు చనిపోయారు. ఆస్పత్రిలో పిల్లల చావులను రోజు వారిగా చూడాలా? ఏడాది సగటున చూడాలా? గత ఏడాదికంటే తక్కువగానే చనిపోయారు కదా అన్నది చిత్తశుద్ధిలేని వాదన. ఒక్కసారిగా పెద్దసంఖ్యలో పిల్లలు చనిపోయినా అది పెద్దగా పట్టించుకోనక్కర్లేదని షా మాటల సారాంశం. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల పిల్లలు కనుక షా ఇలా స్పందించారని సరిపెట్టుకోవాలేమో!

గత నాలుగు దశాబ్దాల్లో గోరక్‌పూర్ పరిసర ప్రాంతాల్లో 25వేల వరకు మెదడువాపు మరణాలు సంభవించాయని లెక్కలు చెబుతున్నాయి. నమోదు కాని చావులు కూడా లెక్కిస్తే ఈ సంఖ్య 50వేల వరకు ఉంటుందని ఒక అంచనా. దేశంలో మరికొన్ని చోట్ల కూడా మెదడువాపు మరణాలు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. వాటి సంఖ్య ఇప్పుడు తగ్గింది. యూపీలో కొనసాగుతోంది. రోగులను వెనువెంటనే ఆస్పత్రికి తరలించడానికి తగిన రోడ్లూ అవసరమైన రవాణా సౌకర్యాలూ లేకపోవడం, గోరక్‌పూర్ ఆస్పత్రికి చేరే సరికే పసి పిల్లలు కోలుకోలేని స్థితికి చేరడం కూడా చావులకు ఒక కారణమని నిపుణులు చెప్తున్నారు. గోరక్‌పూర్ ప్రాంతంలోని ప్రయివేట్ ఆస్పత్రుల క్లినిక్‌ల డాక్టర్లకూ సిబ్బందికీ మెదడువాపు వ్యాధిపై ప్రత్యేక శిక్షణ లేదు.

ఐదారు నెలల నుండి ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సరఫరాదారు 4రిమైండర్లు పంపినా ఫలితం లేకుండా పోయింది. నేరుగా సంబంధిత మంత్రికి లేఖ పంపినా స్పందన లేదు. అధికారులూ మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది నిధుల సమస్యా? అవినీతి జాఢ్యమా? తేల్చడానికి యోగి సిద్ధంగా లేరు. దీనివల్ల తన ప్రభుత్వ సమర్థతే ప్రశ్నార్థకమవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తున్నది.



ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల్లోనూ ఇదే స్థితి. రోగి తిరిగి కోలుకోలేని స్థితికి చేరుతున్నాడని నిర్ధారించుకొన్న అరగంటలోపు చికిత్స ఆరంభించగలిగితే రోగి ప్రాణాలను కాపాడొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ సూచనను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. యోగి ప్రభుత్వం పట్టించుకోలేదు. చావులకు సగటు లెక్కగట్టి బాధ్యత నుండి తప్పుకొంటోంది. ఒక మిత్రుడు చెప్పినట్టు పశువులే కనుక ఇంత సంఖ్యలో చనిపోయి ఉంటే ఉత్తరప్రదేశ్ అల్లకల్లోలమయి ఉండేది.

గోరక్‌పూర్ ఆస్పత్రి పరిశుభ్రతపై ఐఎంఏ బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎలుకలు, కుక్కలు ఆస్పత్రి వార్డుల్లో కన్పిస్తున్నాయని చెప్పింది. మరణాల వార్తలు పత్రికలకెక్కిన తర్వాత పరిస్థితి ఇది. అంతకు ముందు మరెంత ఘోరంగా ఉండిందో, ఎంపీగా యోగి ఎన్నిసార్లు ఆస్పత్రిని సందర్శించి ఉంటారు. బాగు కోసం ఏమేమి ప్రయత్నించారు..? అన్న విషయమూ తెలియాల్సి ఉంది. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో పిల్లల వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందీ లేరని కూడా కమిటీ చెప్పింది. ఎంపీగా యోగి ఈ అంశంపై ఎప్పుడయినా దృష్టి పెట్టారా? ఇప్పుడయినా పెడతారా? ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ రాజీవ్ మిశ్రా, డాక్టర్ కఫీల్‌ఖాన్‌లను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోగా తమ పరిశీలనలో వారి నిర్లక్ష్యమేమీ కన్పించలేదని ఐఎంఏ బృందం చెప్పింది. పరిపాలనా వైఫల్యం మాత్రం ఉందని పేర్కొంది. ఆ పరిపాలన వైఫల్యంలో ప్రజాప్రతినిధులు, మంత్రి, ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉంది. ఆస్పత్రిలోని సిబ్బంది తదితరులు తమతో మాట్లాడడానికి భయపడ్తున్నారని బృందం పేర్కొంది. ఆస్పత్రిలో ఎలాంటి కొరతలు ఉండరాదని ఒక వారానికి సరిపడా నిలువలుండాలని చెప్పింది. సరఫరాదారులకు ముందుగా గానీ ఎప్పటికప్పుడు గానీ చెల్లింపులు జరగాలని ఐఎంఏ బృందం చెప్తోందంటే అక్కడ ఎలాంటి స్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

తమిళనాడులోని వెల్లూరు ప్రాంతాల్లో ఈ రకం మెదడువాపు వ్యాధి కన్పించేది. అక్కడ డాక్టర్లకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అది ఫలితాన్నిచ్చింది. అలాంటి శిక్షణ గోరక్‌పూర్‌లో కూడా ఇవ్వాలని భారతీయ వైద్య పరిశోదనా సంస్థ సూచించింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో కూడా ఈ సమస్యను ఎదుర్కొనే ప్రాంతాలున్నాయి. కానీ ఈ మోతాదులో చావులు సంభవించలేదు. నేపాల్‌లో కూడా ఈ వ్యాధి ఒక ప్రాంతంలో కన్పించేదని, తమ సూచనలవల్ల అరగంట వ్యవధిలో చికిత్సను అందించే ఏర్పాట్లు అక్కడ చేయడం వల్ల మంచి ఫలితాలు కన్పించాయని నిపుణులు చెపుతున్నారు. అలాంటి చర్యలు గోరక్‌పూర్ ప్రాంతంలో చేపట్టలేదు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు కూడా.. టీకాలవల్ల పూర్తిగా అంతరించకపోయినా వ్యాధికి గురయ్యే వారి సంఖ్య తగ్గుతుందని గత అనుభవాలను బట్టి నిపుణులు చెప్తున్నారు. గోరక్‌పూర్ ప్రాంతంలో డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు కూడా పెరగాలని నిపుణులు చెప్తున్నారు. ఈ అంశాలపై యోగి ఏమి చేయనున్నారో గానీ గోరక్‌పూర్ శుద్ధి కార్యక్రమానికి ఆదివారం ప్రారంభోత్సవం చేయనున్నారు. పరిశుభ్రతలోనూ ప్రచార కండూతి ఆయనను వదల్లేదు. మోడీ తర్వాత బీజేపీలో అంతటివాడు యోగి మాత్రమే అని ఒక సర్వే తేల్చింది. అది మాత్రం అక్షరసత్యం. ■

రిపోర్టర్స్ డైరీ

అక్కడ స్వేచ్ఛ ఎక్కువే!

మా పార్టీలో స్వేచ్ఛ చాలా ఎక్కువే. మేమేదైనా మాట్లాడవచ్చు. ఏమైనా చేయవచ్చు. పార్టీకి లాయల్‌గా ఉంటే సరిపోతుంది. ఇలా కాంగ్రెస్ పార్టీ నేతలు స్వేచ్ఛ గురించి ఎంతో గొప్పగా చెబుతుంటారు. అది విని నిజమే కావొచ్చేమోనని ఆహా... ఎంత గొప్ప పార్టీ అని అనుకుంటాం. తమకు కలిగిన అభిప్రాయాలను పార్టీలో స్వేచ్ఛగా చెప్పుకునే హక్కు ఉంటుందేమోనని వారు చెప్పిన విషయాన్ని భావిస్తాం. కానీ కాంగ్రెస్ నేతలు చెప్పే స్వేచ్ఛ దీనికి రివర్స్‌గా ఉంటుంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ అంటారెందుకని ప్రశ్నిస్తే... సొంత పార్టీ నాయకుడిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం, ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకోవడం, ఒక గ్రూప్‌పై మరొక గ్రూప్ భౌతిక దాడులు చేసుకోవడం, సమావేశంలోనే చైర్లు విరగ్గొట్టడం, ఇంకా శృతిమించితే సొంత కార్యాలయమన్న విషయాన్ని కూడా మరచిపోయి దాడి చేసి అద్దాలు పగలకొట్టడం.. సర్వసాధారణం.. అని సమాధానం.. ఈ స్వేచ్ఛ ఏ పార్టీలో ఉంది చెప్పండీ అంటూ ఎదురు ప్రశ్నిస్తారు. ఇవన్నీ సర్దుకుని పార్టీ ముందుకు పోవడం, అధికారాన్ని కైవసం చేసుకోవడం కాంగ్రెస్ పార్టీ లక్షణమంటూ అక్కడ నుంచి జారుకున్నారు. కాంగ్రెస్‌లో తాజా పరిణా మాలు చూసి బెంబేలెత్తకండీ..! అంటూ సలహా పడేశారు సదరు నేత. – గుడిగ రఘు

ఇదేం సిత్రం

టీఆర్ఎస్ సర్కారు చేపట్టిన పథకాలు దేశంలో మరెక్కడా లేవని, మనదే నెంబరు వన్ రాష్ట్రమని సీఎం కేసీఆర్ పదే పదే తనకు తానే డబ్బా కొట్టుకోబట్టే రైతులకు పెట్టుబడి పథకం కూడా నెంబరు వన్ అని అంటున్నారు. అందుకే కాబోలు ఆయనకు భారత ఆహార వ్యవసాయ మండలి ప్రతిష్టాత్మక లీడర్‌షిప్ అవార్డు ప్రకటించింది అని సచివాలయంలో గుసగుసలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అవార్డు వచ్చిందని ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన వచ్చిన వెంటనే దానిపైనే చర్చ జరిగింది. రాష్ట్రం ఏర్పడిన మూడేండ్లలోనే అవార్డులు వస్తాయా, ఇదేం సిత్రం ఇలా విలేకరుల్లో చర్చ సాగింది. పథకాలకు బాగానే వస్తున్నాయి కానీ, అవి అమలు అవుతున్నాయో లేదో తెలుసుకుని కూడా అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది కదా! అనడంతో ఒకటే నవ్వులు. పేదల అభ్యున్నతి కోసం ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని మరీ చేపట్టిన తెలంగాణ పల్లె ప్రగతి పథకం మూలన పడింది. రూ.540 కోట్లకుగాను రూ. 8 కోట్లు మాత్రమే సర్కారు ఖర్చుపెట్టింది. ప్రపంచబ్యాంకోడు అసంతృప్తి వ్యక్తం చేసిండు. వాడిని ఎలా ఖుషీ చేస్తాడో ఏమో అని ఒక విలేకరి అనగా, ఎందుకు చేయడు, త్వరలో ప్రపంచబ్యాంకు నుండి కూడా అవార్డు వస్తుంది.. అని సమాధానం వచ్చింది మరో విలేకరి నుంచి. కొత్త పథకాల సంగతి ఎలా ఉన్నా, పాత పథకాల అమలు మాత్రం అస్తవ్యస్తంగా ఉందని అధికారులే సెలవిస్తున్నరు. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అనే తరహాలో సీఎం మాత్రం ప్రచారం చేసుకోబట్టే. అయితే రాజకీ పక్షాలు సైతం హవ్వా..! అని ముక్కుమీద వేలేసుకున్నాయ్..! – బి.బసవపున్నయ్య


పాడిందే... పాటరా..!

పాపం...రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి... ఆ సారు ఎక్కడ మీటింగ్‌కు వెళ్లినా...ఆయన చెప్పబోయే విషయాల్ని జనం ముందే వల్లెవేస్తున్నారట! ఒకవేళ ఆయన ఏదైనా విషయం మర్చిపోతే...సార్..మీరిది చెప్పలేదు...అని గుర్తుచేసి మరీ చెప్పించుకుంటున్నారట! గడచిన మూడేండ్లుగా సదరు మంత్రిగారు ఎక్కడ మీటింగ్ జరిగినా చెప్పే ఉపన్యాసం ఒక్కటేనట! 1200 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు...ఇదంతా సమైక్య పాలకుల పాపమే...రూ.1,400 కోట్లతో 1,350 కొత్త బస్సులు...ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం... రూ.60 కోట్లతో బస్టాండ్ల అభివృద్ధి... ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కిస్తాం...మూడేండ్లుగా మంత్రిగారు ఇదే రికార్డును అరగదీస్తున్నారట! దీంతో జనానికి ఆయనేం చెప్పబోతున్నారో ముందే తెలిసిపోయి...ఆఆఆ... ఆ తర్వాత? అంటూ సాగదీస్తున్నారట! ఇవే మాటలు ఇంకెన్నాళ్లు చెప్తారు సార్...ఆ నిధులు ఎప్పుడు ఖర్చు చేస్తారు...కొత్త బస్సులు ఎప్పుడు తెస్తారు...ఏంటో...వినేవాడికి చెప్పేవాడు లోకువంటే ఇదే కదా ...అని ఇటీవల ఓ బహిరంగ సభకు హాజరైన ఓ వ్యక్తి పక్కనే ఉన్న పాత్రికేయుడిని పట్టించుకోకుండా సణుక్కుంటూ వెళ్లడం కనిపించింది...మరి మంత్రిగారు ఇప్పటికైనా పాతబాణీ మారుస్తారో...మళ్ళీ బడ్జెట్ దాకా ఇదే ఉపన్యాసం వినిపిస్తారో వేచిచూడాలి!! –ఎస్ఎస్ఆర్ శాస్త్రి

పరమానందయ్య శిష్యుడు...

అనగనగా హైదరాబాద్ నగరం.. అందులో ఓ దిల్‌సుఖ్‌నగర్.. అక్కడో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్... అందులో మేడపైనున్న పెద్దహాల్‌లో రాజనీతి శాస్త్రం, కరెంటు అఫైర్స్ బోధించే ఫ్యాకల్టీ (లెక్చరర్) మైకు పట్టుకున్నాడు. ఎదురుగా నూటయాభైమంది విద్యార్థులు... ఆ మాస్టారు రాజ్యాంగం గురించి, లోక్‌సభ, శాసనసభల గురించి సమగ్రంగా వివరించారు. రాష్ట్రపతి నుంచి గ్రామ పంచాయతీ సర్పంచ్‌దాకా ఎన్నిక జరిగే తీరు తెన్నులను సోదాహరణలతో బోధించారు. ప్రజాస్వామ్యంలో శాసన, న్యాయ, పోలీసు, పత్రికా వ్యవస్థల పాత్ర గురించి సందర్భోచితంగా వివరించారు. ఈ విధంగా ఏకబిగిన రెండున్నర గంటలపాటు క్లాస్ బోధించిన ఆ లెక్చరర్.. చివర్లో ఎన్టీఆర్ లెవల్లో... 'ఎనీ డౌట్స్...' అంటూ విద్యార్థులను ప్రశ్నించారు. ఏ ఒక్కడూ చప్పుడు చెయ్యలే.. సరే.. డౌట్లు ఏమీ లేవుగాబట్టి క్లాస్ ముగిస్తున్నా.. అంటూ ఆ మాస్టారు బయటకు వెళ్లేందుకు ఉపక్రమించారు. ఈలోగా ఓ స్మార్ట్‌బోయ్.. ఒక్క నిమిషం సార్.. అని చెయ్యెత్తాడు... ఏంటి విషయం...? అని లెక్చరర్ అడగ్గా... 'ఏమీ లేదు సార్.. నాకో సందేహం.. మీరు రాష్ట్రపతి గురించి చెప్పారు కదా..? ఇంతకీ రాష్ట్రపతి అనే ఆయన రాష్ట్రంలోనే ఉంటారు కదా...?' అనేసరికి ఆ లెక్చరర్‌కి దిమ్మతిరిగి మైండ్ బ్లాకయింది. ఆహా.. ఏమి నాలెడ్జిర బయ్.. ఇంతకీ నువ్వు ఏం చదువుకున్నవ్..? అని మాస్టారు భయంతో కూడిన అయోమయపు స్వరంతో అడగ్గా.. 'ఎమ్‌టెక్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను సార్...' అని ఆ మేధావి సమాధానమిచ్చాడు. దీన్నిబట్టి మన చదువుల్లోని నాణ్యత, విద్యార్థుల అధ్యయనం, వారి విషయ పరిజ్ఞానం, సామాజికాంశాలపట్ల వాళ్లకున్న అవగాహన ఏపాటిదో తెలియకనే తెలుస్తున్నదని ఆ లెక్చరర్ ఆవేదన వ్యక్తం చేశారు. మన విద్యా విధానం.. విద్యార్థుల మెదడుకు పదును పెట్టే చదువులు కాకుండా కేవలం వాళ్లని ఉద్యోగాలకు పనికొచ్చే యంత్రాల్లాగా మార్చేస్తోందని ఆక్రోశం వెళ్లగక్కారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఆ బాధిత లెక్చరర్‌తో కొనసాగిన బాతాఖానీలో ఈ పరమానందయ్య శిష్యుడి కథ బయటికొచ్చింది... సో.. తల్లిదండ్రులారా...! బీ కేర్‌ఫుల్...! –బి.వి.యన్.పద్మరాజు

ఎవరు ముక్యమంత్రి



తెలిదేవర భానుమూర్తి


నడినాత్రి. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. చిమ్మెటలు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌ మంటున్నయి. సడక్ మీద ఆడొక లారి ఈడొక మోటర్ బోతున్నది. పోలీసోల్లు జీపుల గస్తి దిర్గుతున్నరు. కొందరు దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురు జూస్తున్నరు. గూర్కా గస్తి దిరుక్కుంట లాటితోని సడక్ మీద మోర్ గొడ్తున్నడు. అందరు పండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. గాయిన దినం పూట పంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.

బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. పొద్దుమీకి గానికి వొండుకో బుద్ది గాలేదు. గాడు హోటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. తిన్నంక సిగిలేటు దాక్కుకుంట ఇంటికి బోయిండు. టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంటనే గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. గని బేతాలుడు ఇంట్ల కెల్లి ఇవుతలకు రాలేదు. గీడు పన్నట్లు గొడ్తున్నది అని అనుకోని మూడు నాల్గు పార్లు విక్రమార్కుడు సైకిల్ గంటి బజాయించిండు. గంటి సప్పుడిని బేతాలుడు నిద్రలేసిండు. ఇంట్ల కెల్లి ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను గూసుండబెట్టుకోని గుంతలు, ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను. ఎవ్వలు బద్లాయించినా, ఎన్ని బద్లాయించినా కాంగ్రెస్ లీడర్లయితె బద్లాయించరు. ఎప్పటిలెక్కనే ఒగల్లనొకలు తిట్టుకుంట ఉంటరు. ఏమన్న అంటె మా పార్టిల డెమాక్రసి ఉన్నదని అంటరు. తెలంగానల కాంగ్రెస్ కొన పానంతోని ఉన్నది. దిగ్విజయ్ సింగ్‌తోని పాయిద లేదని తెలంగాన కాంగ్రెస్ ఇంచార్జిగ కుంతియాను బెట్టింద్రు. 2019 దాంక గిదే పిసిసి ఉంటది. గప్పటిదాంక ఉత్తమ్ కుమార్ రెడ్డి పిసిసి ప్రెసిడెంట్గ ఉంటడని కుంతియా అన్నడు.

"2019 దాంక టిపిసిసి ప్రెసిడెంట్గ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉంటడని జెప్పేటి అదికారం ఎఐసిసి సెక్రెటరి కుంతియాకు యాడున్నది? గాయినతోని పాయిదేం లేదు. నేను రాహుల్ గాందిని, సోనియగాందిని గలుస్త. గీ దాని మీద మాట్లాడ్త" అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నడు.



నల్లగొండల కొన్ని పద్కాలకు శంకుస్తాపన జేసినంక విలేకరులతోని గాయిన మాట్లాడిండు.

"యువకులు లీడర్లుగ ఉంటె బాగుంటది. గాల్ల లీడర్‌షిప్‌లనే కాంగ్రెస్ పార్టి మజ్బూత్ అయితది. ముసలోల్లందరు పక్కకు బోతె బాగుంటది. యువకులతోనే పార్టికి మంచి అయితది. కొంపమునిగిందని అనుకునే పని లేదు. యువకులు లీడర్లుగ ఉంటె పార్టి ముంగట్కి బోతది. యువనాయకత్వం అందరికి దగ్గర అయితది. అందరిని ఒక్క తాడు మీద నడిపిస్తది. కెసిఆర్ లచ్చ కొల్వులు ఇస్త అని జెప్పి కొల్వులు లేనోల్లను మోసం జేసిండు. రొండు నెలలల్ల లచ్చ కొల్వులు ఇయ్యాలె. రాస్ట్రంను ఆగమాగం జేసిన కెసిఆర్‌కు జెనం పాటం నేర్పిస్తరు. దలితులకు మూడెక్రాల బూమి ఇస్తమని జెప్పిన కెసిఆర్ మాటదప్పిండు. తెలంగాన వొస్తె దలితున్ని ముక్యమంత్రిని జేస్త అని జెప్పి గాయిన్నే ముక్యమంత్రి అయ్యిండు. మాట మీద నిలబడని కెసిఆర్‌ను జెనం నమ్మరు. ఎన్నటికైన నేను తెలంగానకు ముక్యమంత్రిని అయిత" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నడు

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బోన్గిరిల విలేకరులతోని మాట్లాడిండు.

"సిట్‌ను కంట్రోల్ల ఉంచుకోని నయీం సొమ్మును కెసిఆర్ దోస్కుండు. నయీం డెన్‌ల దొరికిన వెయ్యికోట్ల డంప్, ఇర్వైలే కోట్ల బినామి ఆస్తులు ఏమైనయి? పట్నంల ఉన్న కార్పొరేట్ దవకాన్ల కోసం బీబీనగర్‌ల ఉన్న నిమ్స్‌కు కెసిఆర్ ఏం జేస్తలేడు. యాదాద్రి, వేములవాడ గుడులకు వందల కోట్ల రూపాలు ఇస్తున్న ముక్యమంత్రి నిమ్స్‌కు ఎందుకు ఇస్తలేడు. సీమాంద్ర గుత్తెదార్లతోని కలిసి ప్రాజెక్టులు రీ డిజైన్ అనుకుంట వేల కోట్ల రూపాలు కెసిఆర్ దోస్కుంటున్నడు. టిఆర్ఎస్ సర్కార్‌తోని కొట్లాడే శక్తి రాస్ట్ర కాంగ్రెస్ పగ్గాలు బట్టుకొన్న లీడర్లకు లేదు." అని రాజగోపాల్‌రెడ్డి అన్నడు.

కోమటిరెడ్డి బ్రదర్స్ బిజెపిలకు దుంకుతరు. గందుకె గాల్లు గిట్ల మాట్లాడుతున్నరని కొందరు అనబట్టింద్రు. ఇగ కాంగ్రెస్ల బాహుబలి ఎవ్వరో గాదు. నేనే బాహుబలిని అని జానా రెడ్డి అన బట్టిండు. నేను సీనియర్ లీడర్‌ను. ఇంతకు ముందు ముక్యమంత్రి అయ్యేటి చాన్సు దొరికినా గాలేదు. గీపారి ఎట్లన్న కాంగ్రెస్ హుకూమత్లకు వొస్తది. నేను ముక్యమంత్రిని అయిత అని గాయన అన్నడు. జానారెడ్డికి గాదు ఇంతకు ముందు ముక్యమంత్రి అయ్యేటి చాన్సు నాకే వొచ్చింది. గాని నేను గాలేదు. గీపారి గిన కాంగ్రెస్ హుకూమత్లకు వొస్తె నేనే ముక్యమంత్రిని అయిత అని హన్మంతరావు అనబట్టిండు. కాంగ్రెస్ హుకూమత్లకు వొచ్చినప్పుడు ఎవ్వరు టిపిసిసి ప్రెసిడెంట్గ ఉంటె గాల్లే ముక్యమంత్రి అయితరు. నేనే టిపిసిసి ప్రెసిడెంట్గ ఉంట. నేనే ముక్యమంత్రిని అయిత అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అనబట్టిండు.

"ఒగాల్ల కాంగ్రెస్ హుకూమత్లకు వొస్తె ఎవరు ముక్యమంత్రి అయితరు. గీ సవాల్‌కు జవాబ్ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ బిరక్ ఫేలైతది" అని బేతాలుడు అన్నడు.

"సోనియగాంది ఎవ్వరి పేరు జెప్తె గాల్లే ముక్యమంత్రి అయితరు" అని విక్రమార్కుడు జెప్పంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు. సెల్:9959150491



జననం, గమనం, మరణం మనుషులందరికీ సమానం.
క్రామం, క్రోధం, హాస్యం మనుషులందరికీ సహజం.
కానీ ట్రాన్స్‌జెండర్స్‌కి మాత్రం విభిన్నం.
నిత్యం అవమానాలు, అవహేళనలు..
వెక్కిరింతలు, ఈసడింపులు!
సమాజంలోనే కాదు సినిమాల్లోనూ..
వాళ్లను ప్రతిబింబింపజేసేది వెకిలి నవ్వులకోసమే!
ఎన్నో ఏండ్ల పోరాటం తరువాత ఇప్పుడిప్పుడే మార్పు..
నవ్వులపాలు జేయకుండా.. గౌరవంగా నిలబెట్టే ప్రయత్నం..
అందుకు ఉదాహరణ 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాలో చంద్రముఖి మువ్వల పాత్ర!

అవమానాలనుంచి.. ఆన్‌స్క్రీన్‌దాకా..

ట్రాన్స్‌జెండర్స్ అనగానే సమాజం ఊహించే ఒక చిత్రం... అడుక్కునే వాళ్లు. లేదంటే సినిమాల్లో వెకిలి పాత్రలు మాత్రమే. వారూ ఆడ, మగలాగే మనుషులు అనే కనీస మానవత్వాన్ని చూపించలేని సమాజం. పాయింట్ ఫైవ్, చెక్కా... రకరకాల పేర్లతో వాళ్ల ఉనికినే అవమాన పరుస్తున్నది. పుట్టుకతో పురుషుడే అయినా... తనలో ఉన్న స్త్రీ లక్షణాలను, కాంక్షలను గుర్తించి మహిళలుగా మారుతున్నారు ట్రాన్స్ ఉమెన్. స్త్రీగా పుట్టినా... తనలో ఉన్న పురుష లక్షణాలను గుర్తించి పురుషులుగా మారుతున్నారు ట్రాన్స్‌మెన్. ఈ రెండు మాత్రమే కాదు... ఇంకా విభిన్నమైన లింగ భావనలు సమాజంలో ఉన్నాయి. కానీ ఇక్కడ ఎప్పుడూ మెజారిటీదే పైచేయి. మెజారిటీలో ఒకరుగా లేకపోతే వెక్కిరింత. కులం వల్ల చిన్నచూపు, మతం వల్ల వివక్ష, జెండర్‌వల్ల చులకనభావం.



మా టాలెంట్ నిరూపించుకోవాలి...

సినిమాలు, మీడియా ట్రాన్స్‌జెండర్ కొన్నిసార్లు భిన్నంగా ఉంటున్నవి. కానీ దాన్ని తప్పు పట్టడం కంటే మేమేంటో చెప్పడం, గౌరవంగా ఆత్మాభిమానంతో మమ్మల్ని మేం చూపించడం మేలు అనిపించింది. అందుకే యూట్యూబ్ ఛానల్ 'ట్రాన్స్‌విజన్' ప్రారంభించాం. నిజానికి ఇంటర్నెట్‌లో సైతం సరైన సమాచారం ఉండటం లేదు. అలాంటప్పుడు ఇలాంటి నెగెటివ్ రోల్స్, కామెడీ పాత్రలు మాత్రమే వస్తాయి. సినిమా ఏమీ సమాజం కంటే భిన్నంగా లేదు కాబట్టి... సమాజంలో ఉన్న అవలక్షణాలన్నీ సినిమాకు ఉంటాయి. అది పోవాలంటే చర్చలు జరగాలి. పోరాటాలు నడవాలి. వీటితో పాటు మాలో ఉన్న టాలెంట్ ఏంటో మేం సమాజానికి చెప్పాలి. అందుకు యూట్యూబ్ ఛానల్‌ను ఉపయోగించుకుంటున్నాం. ట్రాన్స్‌జెండర్స్ మీద జరుగుతున్న హింస ఏదీ బయటకు రావడం లేదు. చంద్రముఖిని పెట్టి క్రైమ్ సిరీస్ ప్రారంభించాలని అనుకుంటున్నాం. చంద్రముఖికి సినిమాలో ఓ పాత్ర రావడం సంతోషించదగ్గ విషయం.కానీ... అది చాలా చిన్న పాత్ర. అలా కాకుండా మెయిన్ సపోర్టింగ్ రోల్స్ రావాలి. హీరోయిన్‌గా ట్రాన్స్‌ఉమెన్‌కు అవకాశాలు ఇవ్వాలి. తేజగారి స్ఫూర్తితో ఇంకా వేరే దర్శకులు అవకాశాలు ఇస్తారేమో చూడాలి. అయితే ట్రాన్స్‌ఉమెన్ అయినందుకే అవకాశాలు కోరడం లేదు.. టాలెంట్ ఉంటేనే ఇవ్వమని అడుగుతున్నాం. ఇప్పుడు చంద్రముఖిని చాలా మంది సంప్రదిస్తున్నారు కూడా. కేవలం సినిమాల్లోనే కాదు... మీడియాలోనూ యాంకర్స్‌గా, న్యూస్‌రీడర్స్‌గా రాణించే నైపుణ్యం కలిగినవాళ్లు మాలో చాలామంది ఉన్నారు. కాకపోతే దానికి ప్రాపర్ ట్రైనింగ్ కావాలి. అది ఇవ్వడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. భవిష్యత్‌లో అది కూడా జరగాలని కోరుకుంటున్నా. కేరళలో ప్రభుత్వ పాలసీలే ట్రాన్స్‌జెండర్స్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఆ పరిస్థితి ఇక్కడా రావాలి.

- రచన ముద్రబోయిన, ట్రాన్స్ యాక్టివిస్ట్

సినిమాల్లో జాడ్యం...

బయటి సమాజానికి ఒక జెండర్‌గా కనిపించినా తనలోపల మరో జెండర్ దాగి ఉండటం, దానిని బయటికి చెప్పుకోవడం పెద్ద నేరం. ఆడంగి మాటలు, ఆడంగి వేషాలు, ఆడంగి చేష్టలు, మగరాయుడి లక్షణాలు... మనిషిని కేవలం మనిషిగా మాత్రమే కాకుండా జెండర్‌ను బట్టే మనుషులను గుర్తించడం ఎంతవరకు సబబు. వాళ్లేమీ వేషాలు వేసుకుని నటించడం లేదు. మనసులో ఎలా ఉందో అలాగే బయటికి ఉంటున్నారు. ఎదుటివాళ్లకు చూపించాలనో, దానిద్వారా ఇంకెదో సహానుభూతి పొందాలనో కాదు. తమ మనసు చెప్పిన మాటను వింటున్నారు. అలాంటి మనసులను పట్టించుకోకుండా... సినిమాల్లో హీరోల వెంట పడుతున్నట్టుగా, కనిపించగానే కామంతో రగిలిపోతూ మగాడిమీద పడిపోతున్నట్టుగా చిత్రీకరించడం సర్వసాధారణమైపోయింది. ఇది కేవలం తెలుగు సినిమాలకు పట్టిన జాఢ్యమే కాదు.. మొత్తం దక్షిణ చలనచిత్రరంగంలోనే ఉన్న రోత.

ట్రాన్స్‌పర్సన్స్‌కు అవకాశాలేవీ...

అయితే అక్కడ ఆ పాత్రల్లో నటించేది నిజమైన హిజ్రాలా? అంటే అదీ కాదు. పురుషులకు ఆ వేషాలు వేసి నటింపజేయడం. ఇది కేవలం తెలుగు సినిమాల్లోనే కాదు.. బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌దాకా విస్తరించిన సంస్కృతి. ఈ విష సంస్కృతి కేవలం సినిమాలకే పరిమితమైపోలేదు. ఇటీవలి కాలంలో టీవీ కార్యక్రమాలకు విస్తరించింది. మనుషులన్న కనీస గౌరవం లేకుండా డబుల్ మీనింగ్ డైలాగ్‌లు.



హక్కులను కాపాడుకోవాలి

సినిమాల్లో అంతా చెడ్డగా ఉంది అని చెప్పలేం. కానీ ఈ ఒక్కపాత్రతో ఏదో సాధించామని విర్రవీగలేం. ఇవి మొదటి అడుగులు మాత్రమే. నటించిన చంద్రముఖిని మెచ్చుకోవాలి. అవకాశం ఇచ్చినవాళ్లను అభినందించాలి. మాకు ప్రత్యేక ట్రీట్‌మెంట్ అవసరం లేదు. కేవలం సమాన అవకాశాలు ఇవ్వమంటున్నాం. ఈ మార్పున కొనసాగాలి. మామీద సినిమాలు తీస్తారు. కానీ ఓసారి జీవీకే మాల్‌లో సినిమాకు 'మీలాంటి ముఖాలు ఇక్కడికి రావద్దు' అంటూ అవమాన పరిచారు. మనుషులను కొన్ని ప్రాంతాలనుంచి వెలివేయడం ఏం మానవత్వం? అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులున్నాయి. మగాళ్లకు, ఆడవాళ్లకున్నట్టే ట్రాన్స్‌జెండర్స్‌కు, అగ్రవర్ణాలకు ఉన్నట్టే దళితులు, ఇతర కులాలు హక్కులున్నాయి. ఆ హక్కులను కాపాడుకోవడం మన ముందున్న బాధ్యత.

- వైజయంతి, ట్రాన్స్ యాక్టివిస్ట్

గౌరవ ప్రదంగా ఉంటేనే...



నాకు సినిమాలు చేయాలని ఎప్పటినుంచో ఉంది. అయితే ఓ రిపోర్టర్ తేజగారిని ఇంటర్వ్యూ చేసినప్పుడు.. 'ట్రాన్స్ జెండర్‌కి అవకాశం ఎందుకు ఇవ్వడం లేదు' అని అడిగారట. దాంతో ఆయన 'రియల్ ట్రాన్స్‌ఉమెన్ కోసం చూస్తున్నా' అని చెప్పారట. వెంటనే ఆ రిపోర్టర్ నాకు కాల్ చేశారు. నటన అంటే ఇష్టం. భరతనాట్యం కూడా వచ్చు. దాంతో ఆడిషన్స్‌లోనే తేజగారు 'నువ్వు చేయగలవు' అన్నారు. షూటింగ్ 20 రోజులు. ఎక్కడా వివక్ష చూపించలేదు. యూనిట్‌లో అందరూ నాతో బాగా మాట్లాడారు. పికప్, డ్రాపింగ్.. చాలా కేర్ తీసుకునేవారు. 'నిన్ను చూసి ఎవరన్నా నవ్వినా చెప్పు' అనేవారు. తేజగారు చాలా సెన్సిటివ్. మాస్టర్ పీస్ ఆయన. ఎలా కావాలో చెప్పి అలా చేయించారు. నా సీన్స్ అన్నీ ఎమోషనల్. ఒక పెద్ద సినిమాలో ట్రాన్స్‌జెండర్‌కి పాజిటివ్‌రోల్, గౌరవప్రదమైన ఎమ్మెల్యేగా అంటే... సాధారణం కాదు. మూవీ బాగుంది. స్టోరీ బాగుంది. చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాకు ముందు చాలా రోల్స్ వచ్చాయి. కామెడీ, ప్రాస్టిట్యూట్, అండర్‌వర్ల్డ్‌డాన్, అమ్మాయిలను కిడ్నాప్‌చేసే పాత్రలు చేయాలని అడిగారు. కానీ అణగారిన స్థాయిలో ఉన్నవారు అట్లాంటివి చేస్తే ఉన్న కాస్త గౌరవం పోతుంది. మనపై ఆ ముద్రే పడుతుంది. అందుకే ఒప్పుకోలేదు. ఇప్పుడు కూడా చాలా అవకాశాలు వస్తున్నాయి. గౌరవప్రదంగా ఉన్నవే చేస్తాను. నా ఈ ప్రయాణంలో నా కుటుంబం ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ వెన్నంటే ఉన్నది.

- చంద్రముఖి మువ్వల, నటి, ట్రాన్స్ యాక్టివిస్ట్

వెకిలి చేష్టలు. విపరీత పోకడలు. ఈ స్టీరియోటైప్‌ను కాస్త పక్కన పెట్టి వచ్చిన సినిమా కాంచన. వారికి జరుగుతున్న అన్యాయాన్ని, వాళ్ల ఎదుర్కొంటున్న చిన్నచూపును కళ్లకు కట్టిన సినిమా. అందులో ప్రధాన పాత్రను మళ్లీ పురుషుడే చేసినా... కూతురి పాత్రకు మాత్రం నిజమైన ట్రాన్స్‌ఉమెన్‌ను తీసుకున్నారు. ఇది ఇటీవల కాలంలో వచ్చిన మంచి మార్పు. దీనికి కొనసాగింపుగా వచ్చిందే 'నేనే రాజు నేనే మంత్రి'. అందులో హిజ్రా ఆ పాత్రను పోషించింది చంద్రముఖి మువ్వల. రోల్ చిన్నదే కావచ్చు. పిల్ల కాలువలు కలిస్తేనే కదా సముద్రం అయ్యేది. అందుకే కొంత సంతోషం.

యూట్యూబ్ ఛానలల్‌తో విజన్...

ఈ మాత్రం సాధించినదానితోనే సంతృప్తిపడలేం. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీపై ఇంకా ఎన్నో అపోహలు. మరెంతో అవగాహన రాహిత్యం. ఆ అపోహలు పోగొట్టడానికి, రాహిత్యాన్ని దూరం చూసి... ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీపై అవగాహనను పెంచేందుకు ఇటీవలే ఓ యూట్యూబ్ ఛానల్ 'ట్రాన్స్‌విజన్'ను ప్రారంభించారు ట్రాన్స్‌జెండర్ యాక్టివిస్టులు. ట్రాన్స్‌జెండర్స్ అంటే ఓ రోగం అని, జన్యులోపం అని, హార్మోన్ల అనుకునేవాళ్లున్నారు సమాజంలో. వారికి శాస్త్రీయ అవగాహన కల్పించడం దీని ప్రధాన ధ్యేయం. జాతీయంగా, అంతర్జాతీయంగా ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు ఎలాంటి చట్టాలున్నాయి? చారిత్రాత్మక ఘట్టాల్లో, పండుగల్లో హిజ్రాల పాత్ర ఏమిటి? నేషనల్, ఇంటర్నేషనల్ ఉన్న ట్రాన్స్‌జెండర్ సెలబ్రిటీస్, ట్రాన్స్‌జెండర్ సినిమాలు వంటివన్నీ యూట్యూబ్ ద్వారా చెబుతున్నాం. తెలుగు, కన్నడ, ఉర్దూలో ఇప్పటిదాకా ఆరు సిరీస్‌లు ప్రసారమయ్యాయి. ఒక్కో సిరీస్‌కు పది నుంచి పన్నెండు వేల ఖర్చయ్యింది. అన్నీ సొంత డబ్బుతోనే తీశారు. ప్రొడ్యూసర్ లేరు. అందుకే 45 రోజులు క్రౌడ్ ఫండింగ్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఆ తరువాత వరుసగా ఎపిసోడ్స్ తీసుకు వచ్చే ఆలోచనలో ఉన్నారు.

కట్ట కవిత

ఇవి తింటే చాలు...



జిడ్డు చర్మం ఉన్న వారు ఎన్నో రకాల క్రీములను, మాయిశ్చరైజర్‌లను, కండీషనర్‌లను, సబ్బులను వాడతారు. అయితే రసాయనాలు ఉండే వీటిని ఉపయోగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని చెబుతున్నారు నిపుణులు. ముఖం మీద ఉండే మొటిమలు, జిడ్డుతత్వాన్ని నివారించుకోవాలంటే కొన్ని రకాల పండ్లు, కూరగాయలు, గింజలు తింటే సరిపోతుంది.

- దోసకాయలో నీరు ఎక్కువ శాతం ఉంటుంది. ఇది మంచి యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేస్తుంది. దోసకాయ తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేట్ కావడంతో పాటు ఇతర చర్మ సమస్యలు తొలగిపోతాయి.
- చిరు ధాన్యాలు, గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్రమం తప్పకుండా రోజూ వారీ ఆహారంలో తీసుకుంటే జిడ్డు సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందుతారు.
- నారింజ పండులో విటమిన్ 'సి' సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో ఉండే మలీనాలను తొలగించి చర్మాన్ని కాంతివంతంగా, తాజాగా ఉంచుతుంది.
- ఆకుకూరల్లో నూనె పదార్థాలు, కొవ్వు పదార్థాలు అసలు ఉండవు. కాబట్టి జిడ్డు చర్మం ఉన్న వారు ఆకుకూరలను క్రమం తప్పకుండా తీసుకుంటే మంచిది. పైగా ఆకుకూరల్లో ఫైబర్ శాతం పుష్కలంగా ఉంటుంది.
- జిడ్డు చర్మం ఉన్న వారు ద్రాక్ష పండ్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇందులో విటమిన్ 'సి', నీరు శాతం అధికంగా ఉంటుంది. ఇవి శరీరంలో ఉండే టాక్సిన్లను బయటకు పంపిస్తాయి.
- ఓట్స్‌లో కూడా ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. ప్రతిరోజు ఉదయం టిఫిన్‌గా ఓట్స్‌ను తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడటంతో పాటు మొటిమలు, జిడ్డు తత్వం తొలగిపోతాయి.
- చర్మ సౌందర్యానికి నిమ్మకాయ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది చర్మ సమస్యలను దూరం చేయడంలో మంచి ఔషధం. నిమ్మకాయ రసాన్ని శరీరానికి పట్టించి స్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ప్రతిరోజు గ్లాసు నిమ్మరసం తాగితే చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
- అలాగే జిడ్డు చర్మం ఉన్న వారు అరటి పండు ను తప్పకుండా తినాలి. ఇందులో పోటాషియం, పాస్పరస్, విటమిన్ 'ఇ' సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి. రోజు ఒక అరటి పండు తినడం వల్ల జిడ్డు తత్వం దూరం అవుతుంది.

కుంకుడుకాయలతో...



అందమైన మెరిసే జుట్టు కోసం... ఆరోగ్యవంతమైన పట్టు లాంటి కురులు కోసం కుంకుడు కాయలతో తల స్నానం చేస్తే సరిపోతుంది. రసాయన భరితమైన షాంపూలు వాడటం వలన జుట్టు సహజత్వాన్ని కోల్పోతుంది. ప్రకృతి సిద్ధమైన ఔషధం లాంటి కుంకుడు కాయలు వాడితే జుట్టు కాంతివంతంగా తయారవుతుంది. పొడవైన, మృదువైన జుట్టు కావాలంటే కుంకుడు కాయల గురించి తెలుసుకోవాల్సిందే !

- కుంకుడులో విటమిన్ 'డి','ఎ', 'ఇ', 'కె' లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు పెరగటానికి, మెత్తదనానికి ఉపయోగపడతాయి.
- ముఖ్యంగా కుంకుడు కాయలు సూక్ష్మ జీవులను చంపే లక్షణాలను కలిగి ఉంటాయి. కాబట్టి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుకోవచ్చు.
- పేలను నివారించడంతో వీటి పాత్ర కీలకం. అలాగే చుండ్రు సమస్య రాకుండా కాపాడుతుంది. జుట్టు పొడిబారినట్లు ఉంటే కుంకుడు కాయల రసాన్ని పట్టిస్తే సరిపోతుంది. ఇవి వెంట్రుకలకు మంచి కండీషనర్‌గా పని చేస్తాయి.
- కుంకుడు కాయలు జుట్టు చిక్కులు పడకుండా మృదువుగా ఉండేటట్టు చేస్తాయి. వెంట్రుకల చివరలు పగలకుండా ఉంచడంతో పాటు జుట్టు రాలిపోవడాన్ని అరికడతాయి.

మీ చేతి వాటం చూపాల్సిందే...!

మహిళలను విలాసవస్తువులుగా చూపించే పురుషాధిక్య సమాజంలో మనం ఉన్నాం. మగవారు గీసుకునే గడ్డం నుంచి తిరిగే కారు వరకు అన్ని ప్రకటనల్లో ఆడవారే కనిపిస్తారు. సినిమాలు, సీరియల్స్ ఏదీ చూసినా ఆడవారిని వేధించడమే ఎక్కువగా కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఒంటరిగా కనిపిస్తే మగవాడు దాడులకు పాల్పడే ప్రయత్నం చేస్తాడు. అమాయకంగా కనిపించినా.. అబలగా భావించినా వారి ఆగడాలకు అంతు ఉండదు. మరి అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలంటే ఆత్మరక్షణ(సెల్ఫ్ డిఫెన్స్) టెక్నిక్స్ తెలుసుకోవాలి. ఒంటరిగా వెళ్తున్న మహిళలను హగ్ చేసుకునే ప్రయత్నం చేసిన వ్యక్తి నుంచి ఎలా తప్పించుకోవాలో ఈ వారం చూద్దాం..!

సెల్ఫ్ డిఫెన్స్



1

మహిళలను వేధించడానికి అనువైన సమయం కోసం ఎదురుచూస్తుంటారు ఆకతాయిలు. ఒంటరిగా కనిపిస్తే చాలు వెకిలిచేష్టలతో ఇబ్బంది పెడతారు. ఈ వ్యక్తి ఒంటరిగా కనిపించిన అమ్మాయిని కౌగిలించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.



2

తన దారిలో తాను వెళ్ళుతుంటే ఎవరో తెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి కౌగిలించుకునే ప్రయత్నం చేయగానే ఒకసారిగా భయపడిపోతారు. వదులు.. వదులు అంటూ పెనుగులాడుతారు. కానీ, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ తెలిసిన వారు వెంటనే అలర్ట్ అయిపోతారు. మీ రెండు చేతుల బొటనవేళ్లను ఎదుటివ్యక్తి కండ్లపై పెట్టిన రఫ్ చేయాలి.

సున్నితమైన కంటిపై ఒత్తిడి కలగగానే వెంటనే ఆ వ్యక్తి మిమ్మల్ని వదిలేసి మంటగా ఉన్న తన కండ్లను రక్షించుకునే ప్రయత్నం చేస్తూ కిందికి వంగుతాడు. ఈ కాస్త సమయం చాలు మీరు ఆ వ్యక్తి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి. అయితే ఆ వ్యక్తిని వదిలేయవద్దు. మరోసారి ఎవ్వరినీ వేధించకుండా గట్టిగా బుద్ధి చెప్పాలి.



3

కండ్లను దోసిలిలో దాచుకుంటూ కిందికి వంగిన ఆ వ్యక్తి జుట్టు పట్టుకుని మరింత కిందికి వంచాలి. మీ మోకాలితో అతని ముఖంపై నీఅటాక్ చేయాలి. ముక్కు పగిలి బాధతో గిలగిలలాడుతాడు.



4

ఒంటరిగా కనిపించే మహిళలను వేధించాలన్న ఆలోచన మరోసారి రాకుండా మీ చేతి వాటం చూపించాలి. అలాగే వదిలేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి. అప్పుడే మరోసారి ఇలాంటి దాడులకు పాల్పడకుండా తగిన బుద్ధి చెబుతారు.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170, 9949039049

పిప్పళ్ల వెంకటేశ్

డీఎస్పీపై ఈసీ వేటు


నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణ

కర్నూలు : కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నికలో అధికార టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నా రని డీఎస్పీ గోపాలక్రిష్ణపై ఎన్నికల కమిషన్ (ఈసి) కొరడా ఝుళిపించింది. వైసీపీ ఫిర్యాదు మేరకు నంద్యాల డీఎస్పీని శనివారం ఎన్నికల బాధ్యత నుంచి తొలగించింది. నంద్యాల ఓఎస్డీ రవిప్రకాశ్‌కు ఇన్‌చార్జ్ డీఎస్పీ బాధ్యతలను అప్పజెప్పింది. ఎన్నికలకు నాలుగు రోజుల ముందు ఈ బదిలీ జరగడంతో అధికార పార్టీకి పెద్ద షాక్ తగిలినట్లయింది. సీఎం చంద్రబాబుకు సంబంధించిన ఫ్యాట్నీ కారు (వంటవాహనం) వైసీపీ పట్టుకున్నప్పుడు డీఎస్పీ వ్యవహరించిన తీరు, డబ్బు పంపిణీలో అధికార పార్టీ టీడీపీకి వత్తాసు పలుకుతున్నాడని ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. వైసీపీ నాయకులపై అనవసరమైన కేసులు బనాయించారని, ఇళ్లలో సోదాలు చేయిస్తున్నాడని, బెదిరింపులకు పాల్పడుతున్నా రనే ఆధారాలతో వైసీపీ నాయకులు ఎన్నికల అధికారికి దృష్టికి తెచ్చారు. దీంతో 15 రోజులుగా ఎన్నికల అధికారి నిఘా పెట్టి గోపాలక్రిష్ణను బదిలీ చేశారు. ఈ ఏడాది జులై ఏడున ఆయన నంద్యాల డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కర్నూలులో పనిచేశారు.

పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు

- పోలవరం ముంపు మండలాల బంద్ విజయవంతం
- చింతూరులో భారీ వర్షంలోనూ ధర్నా
- హాజరైన ఒడిశా, చత్తీస్‌గఢ్ ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం : తమకు పూర్తి పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలుచేసిన తర్వాతే ప్రాజెక్టు నిర్మించాలని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు నినదించారు. తూర్పుగోదావరి జిల్లా ముంపు మండలాల్లో శనివారం జరిగిన బంద్ విజయవంతమైంది. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన చేపట్టిన బంద్ సందర్భంగా ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్‌పురం మండలాల్లో దుకాణాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు తిరగలేదు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్ లావాదేవీలు స్తంభించాయి. భారీగా పోలీసులు మోహరించారు. కూనవరం మండలంలో బంద్‌ను నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

భవిష్యత్ పోరాటలకు సిద్ధం కావాలి

చింతూరు జాతీయ రహదారిపై నిర్వాసితులు వర్షాన్నిసైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఒడిశాలోని మల్కన్‌గిరి ఎంఎల్ఎ మనీష్ మడకం (బీజేడీ) నిర్వాసితులనుద్దేశించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు ఎకరానికి రూ.28 లక్షలు ఇచ్చారని, పట్టిసీమ నిర్వాసితులకు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇచ్చారని చెప్పారు. అదే తరహా ప్యాకేజీని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ పోలవరం ముంపు మండలాల్లో రీ- సర్వే తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కారణంగా ఏయే గ్రామాలు ఎక్కడెక్కడ మునుగుతున్నాయో నిర్దిష్టంగా చెప్పాలన్నారు. సీపీఐ(ఎం) రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగి రాకుంటే భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని నిర్వాసితులను కోరారు. ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా బీజేపీ నాయకుడు తోయామూక మాట్లాడుతూ ముంపు గ్రామాల నిర్వాసితులందరికీ నష్టపరిహారం పూర్తిగా అందించాకే ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.


బంద్ కారణంగా నిలిచిపోయిన వాహనాలు

విశాఖలో ఉన్మాది ఘాతుకం

- పెట్రోలు పోసి ..నిప్పంటించి..ప్రియురాలి హత్య
- అక్కను రక్షించే యత్నంలో తమ్ముడు మరణం



విశాఖ : విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం టి.నగరపాలెంలో ఒక యువకుడు ప్రేమించిన అమ్మాయిపై పెట్రోలు పోసి, తగులబెట్టాడు. అనంతరం తానూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. టి.నగరపాలేనికి చెందిన పొట్నూరు రూప (20) స్థానిక బాసర కళాశాలలో బిఎస్సీ సెకెండ్ ఇయర్ చదువుతోంది. ఉపాధి కోసం ఏడాది క్రితం విజయనగరం నుంచి వచ్చిన పతివాడ హరి సంతోష్ (24), తండ్రి రమణతో కలిసి తగరపువలసలో నివసిస్తున్నాడు. హైవేకి ఆనుకొని ఉన్న పరుపులు, దిండులు కుట్టే దుకాణంలో పని చేస్తున్నాడు. కొద్దికాలం క్రితం అతడికి రూపతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. ఈ విషయం తెలిసి రూప కుటుంబీకులు హరిసంతోష్‌ను మందలించారు. దీంతో శనివారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో రూప ఇంటికి వెళ్లి, ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో చిక్కుకున్న రూప కేకలు వేయడంతో పక్క గదిలో ఉన్న తమ్ముడు ఉపేంద్ర ఆమెను రక్షించే ప్రయత్నంలో మంటల్లో చిక్కుకుని, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. రూప సంఘటనాస్థలిలోనే మృతి చెందింది. హంతకుడైన హరిసంతోష్‌ను అరెస్టు చేసేవరకూ మృతదేహాన్ని తరలించొద్దంటూ పట్టుబట్టారు. పరారైన హరి సంతోష్ విజయనగరం జిల్లా విటి అగ్రహారం వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

కేంద్రమంత్రులను రక్షించడానికే రూపన్‌వాలా కమిషన్


- వడ్డెర జేఏసీ కన్వీనర్ దండి వెంకట్

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్‌వేముల మరణంపై కేంద్రప్రభుత్వం నియమించిన అశోక్‌రూపన్‌వాలా కమిషన్ కేంద్ర మంత్రులను రక్షించేందుకే వేసినట్టు ఉందని తెలంగాణ వడ్డెర జేఏసీ కన్వీనర్ దండి వెంకట్ తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూపన్‌వాలా కమిషన్ 51 పేజీల నివేదిక తప్పులతడకగా ఉందని చెప్పారు. రోహిత్ ఎస్సీ కులం కాదనీ, వడ్డెర అని కేంద్రమంత్రులు, వర్సిటీ వీసీ గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. రూపన్‌వాలా కమిషన్‌కు సంబంధం లేకున్నా, రోహిత్ బీసీ అని పేర్కొనడం సరికాదని, కర్నాటకతో పాటు వివిధ రాష్ట్రాల్లో వడ్డెరలు ఎస్సీలనే విషయాన్ని కమిషన్ సభ్యులు మరిచిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. వడ్డెర కులమైతే చంపుతారా..? అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఈ రిపోర్టును రద్దు చేసి, పునర్విచారణ జరిపి కేంద్రమంత్రులు స్మృతిఇరానీ, దత్తాత్రేయ, వీసీ అప్పారావును శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ వడ్డెర సంఘం(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి అంతయ్య, జేఏసీ నాయకులు పల్లపు యాదయ్య, ఈ నాగరాజు, ద్యారంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం కోసం వికలాంగుడి ప్రచారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


మహేశ్‌ను అభినందిస్తున్న జోగు రామన్న

హరితహారంతోనే మానవ మనుగడ సాధ్యమనే నినాదంతో వికలాంగ యువకుడు మహేష్ ద్విచక్ర వాహనంపై రాష్ట్రమంతా తిరుగుతూ మొక్కలు నాటడంపై విస్తృత ప్రచారం చేపట్టారు. గత 37 రోజులుగా తెలంగాణలోని అన్ని జిల్లాలను చుట్టి శనివారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్నను హైదరాబాద్‌లోని బంజా రాహిల్స్ ఆయన నివాసంలో కలుసుకున్నారు. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం లింగాపూర్ తండాకు చెందిన మహేష్‌ను మంత్రి జోగు రామన్న అభినందించారు. రానున్న రోజుల్లో మహేష్‌ను తగిన రీతిన గౌరవిస్తామన్నారు. మొక్కలు నాటడం ద్వారా తెలంగాణలో 33 శాతం గ్రీనరీని సాధించడం వల్ల కలిగే మేలును మహేష్ ప్రచార సందర్భంగా వివరిస్తున్నారు. బైక్‌కు హరితహారం బ్యానర్, ముఖ్యమంత్రి ఫొటోను పెట్టుకుని గ్రామాల్లోకి వెళుతున్నారు.

నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జనసేన శిబిరాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఈనెల 23న ఉమ్మడి నిజామాబాద్, సెప్టెంబర్ 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో జనసేన శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారందరికీ ఈ మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా శిబిరం వివరాలు జనసేన ప్రతినిధులు తెలియచేయనున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారూ శిబిరం వేదిక వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ రెండు జిల్లాలు కలిపితే తెలంగాణలో ఈ ప్రక్రియ పూర్తి అయినట్టేనని చెప్పారు.

బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- కేటీఆర్‌తో కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గనుల శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్‌కు పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. కేంద్రం విభజన అంశాలను పరిష్కరించడం లేదని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు పెండింగ్ పనుల గురించి ఆయనకు వివరించారు. విభజన అంశాలను కేంద్రం పరిష్కరించడం లేదని, ఏపీకే అత్యధిక సాయం అందిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కేంద్రం నుంచి అత్యధిక నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం : గీతం ప్రో వీసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వృత్తి జీవితంలో ఒత్తిడి అనివార్యమని, దాన్ని అధిగమిస్తేనే విజయం వస్తుందని గీతం విశ్వవిద్యాలయం ప్రో వీసీ ఎన్ శివప్రసాద్ తెలిపారు. శనివారం గీతం విశ్వవిద్యాలయంలో వావ్ రెవల్యూషన్ పేరుతో కళాకృతి విద్యార్థి విభాగం ఏర్పాటు చేసిన మహిళా వెల్‌నెస్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒత్తిడిని అధిగమించడానికి విద్యార్థి దశనుంచే సన్నద్ధం కావాలని కోరారు. రోజూ సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. శారీరక వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. ఉప్పు ఎక్కువగా తినొద్దని తెలిపారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ వర్మ, శిక్షకురాలు పూర్ణిమ పాల్గొన్నారు.

'మీరు రాజీనామా చేయండి ..మేమూ చేస్తాం'


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'గెలిచే సత్తా ఉందనుకుంటే రాజీనామా చేయండి. మేమూ చేస్తాం. అందరం ఎన్నికలకు వెళ్దాం. 2019 ఎన్నికలకు ఫ్రీ ఫైనల్‌గా ఉంటుంది.' అని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేకు టీఆర్ఎస్ సవాల్ విసిరింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాల్‌రాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి చేసిన డిమాండ్‌ను ప్రస్తావిస్తూ పై విధంగా స్పందించారు.

వందేమాతరంపై ప్రశ్నించినందుకు బీజేపీ నేత రుసరుసలు

ఇండియాటుడే స్టూడియోలో ఆగ్రహంతో మైక్ విసిరేసిన ప్రేమ్‌శుక్లా

- ఔరంగాబాద్ కార్పొరేషన్‌లో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్ల సస్పెన్షన్‌పై చర్చ సందర్భంగా సంఘటన

న్యూఢిల్లీ: జాతీయ గేయం వందేమాతరం అర్థమేమిటో చెప్పగలరా అని జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు బీజేపీ నేత ప్రేమ్‌శుక్లా తెల్లమొహం వేశారు. ఆగ్రహంతో మైక్ విసిరేసి స్టూడియో నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటన ఇండియా టుడే స్టూడియోలో శనివారం జరిగింది. దేశభక్తి గురించి చెబుతూ జాతీయ గేయాన్ని ఆలపించాలని డిమాండ్ చేస్తున్న నేతలు తమ నియోజకవర్గ ప్రజల గురించి మాత్రం పట్టించుకోవడంలేదంటూ టుడే జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలతో ప్రేమ్‌శుక్లా కంగుతిన్నారు. శివసేన అధికారిక పత్రిక సామ్నా హిందీ విభాగానికి ప్రేమ్‌శుక్లా కార్యనిర్వాహక సంపాదకుడిగా పని చేశారు. ప్రేమ్‌శుక్లా గతేడాది శివసేనకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. వందేమాతరంపై ఇండియాటుడే చర్చ చేపట్టడానికి కారణం శనివారం మధ్యాహ్నం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో జరిగిన సంఘటన. ఈ కార్పొరేషన్‌లో శివసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉండగా, ఏఐఎంఐఎం ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్నది. సమావేశం ప్రారంభంలో వందేమాతరం ఆలపిస్తుండగా నిల్చోలేదని ఆరోపిస్తూ ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లను మేయర్ సస్పెండ్ చేశారు. దీనిపై ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగడంతో సమావేశంలో గందరగోళం నెలకొని రెండుసార్లు వాయిదా పడింది. తమకు ఔరంగాబాద్‌లో 25మంది కార్పొరేటర్లు ఉండగా, 24మంది లేచి నిల్చున్నారని, ఒక్కరు మాత్రం నిల్చోలేదని ఎంఐఎం ఎమ్మెల్యే ఇంతియాజ్ జలీల్ తెలిపారు. ఆ కార్పొరేటర్ నుంచి వివరణ కోరనున్నట్టు ఆయన తెలిపారు.

హస్తినకు కాంగ్రెస్ పంచాయితీ?

సోనియా అపాయింట్‌మెంట్ కోసం పైరవీలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో గుప్పుమన్న అంతర్గత విభేదాలు ఢిల్లీకి తాకనున్నాయి. వేర్వేరు గ్రూపులు హస్తినలో పంచాయితీ పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. మీడియాకెక్కి పార్టీ పరువు బజారుకీడ్చకుండా సోనియాగాంధీకి చెప్పేందుకు ఆ గ్రూపులు అంతర్గతంగా ప్లాన్ చేస్తున్నాయి. అందుకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఆమె వ్యక్తిగత కార్యదర్శికి, ఏఐసీసీ కార్యాలయానికి ఇప్పటికే గ్రూపులు వేర్వేరుగా లేఖలు పంపినట్టు తెలిసింది. అపాయింట్‌మెంట్ కోసం ఎవరికి తెలిసిన నేతలతో వారు ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ఈ విషయంలో భిన్నాభిప్రా యాలు వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు నాలుగైదు శిబిరాలుగా విడిపోయారు. ఎవరికి వారు వేర్వేరుగా సోనియాగాంధీ కలిసి తాజా పరిస్థితిని వివరించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర తర్వాత మాట్లాడుదామని సోనియాగాంధీ సంకేతాలు పంపినట్టు జానారెడ్డి శిబిరానికి చెందిన నేత ఒకరు చెప్పారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా తనదైన శైలిలో పైచేయి సాధించేందుకు చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వ్యతిరేక గ్రూపులు ఎగిరెగిరి పడ్డట్టు కాకుండా తాను వేచి చూసే ధోరణిలో ఉండాలని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. పార్టీలో గ్రూపులు చురుకుగా వ్యవహరిస్తుండటంతో ఆయన కూడా తన వర్గీయులతో సమావేశమైనట్టు తెలిసింది. ముఖ్యంగా ఉత్తమ్‌కు మద్దతు తెలుపుతున్న నేతలతోపాటు ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, సీనియర్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో కలిసి ఆయన హస్తనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. అధ్యక్షుడైన తర్వాత వివిధ ప్రజాసమస్యలపై పార్టీ చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలను అధిష్టానికి



చెప్పడంతోపాటు కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఫిర్యాదు చేయనున్నట్టు తెలిసింది. అధ్యక్షుడిగా తనకు ఇవ్వకపోయినా సరే...కోమటిరెడ్డి బ్రదర్స్‌కు మాత్రం అధ్యక్షపదవి ఇవ్వకూడదనే విషయాన్ని సోనియాగాంధీకి చెప్పడానికి ఉత్తమ్ గ్రౌండ్ ప్రిపరేషన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇప్పటి వరకు పార్టీకి వ్యతిరేకంగా ఏమేం మాట్లాడారో ఆధారాలతో సహా నిరూపించేందుకు ఉత్తమ్ శిబిరంలోని కొంత మంది నేతలు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల వరకు ఉత్తమ్ అధ్యక్షుడిగా ఉంటాడనే విషయాన్ని కుంతియా ఎలా చెబుతారన్న అంశంపై విషయాన్ని ఉత్తమ్ వ్యతిరేక గ్రూప్ అధిష్టానానికి చెప్పనుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ కూడా ఢిల్లీలో తమ వాణిని బలంగా వినిపించేందుకు సీనియర్ నేత ద్వారా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

ఈజీలోన్ పేరిట పది లక్షలు టోకరా

ఆన్‌లైన్ మోసగాడిని అరెస్ట్ చేసిన సీఐడీ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

ఈజీలోన్ పేరిట ఒక వ్యక్తికి పది లక్షల రూపాయలు టోకరా వేసిన ఆన్‌లైన్ మోసగాడిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. 2015 జనవరిలో హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి(బాధితుడు)కి ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి సులువుగా తాము లోన్‌లు ఇప్పిస్తామని, కోటి రూపాయల వరకు ఇప్పించగలమని నమ్మబలికాడు. అందుకోసం మొదట 20 వేల రూపాయలను తాను తెలిపిన బ్యాంక్ అక్కౌంట్‌లో వేయాలని కోరాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు చెప్పినట్టే డబ్బులు వేశాడు. తర్వాత ఫలానా ఛార్జీలంటు బాధితుడి నుంచి గత మూడేండ్లలో పది లక్షల రూపాయలను మోసగాడు దండుకున్నాడు. ఇందు కోసం మొత్తం 11 బ్యాంకు అక్కౌంట్లను మోసగాడు వాడుకున్నాడు. పది లక్షలు ముట్టాక ఇక రేపోమాపో కోటి రూపాయల లోన్ మంజూరు అవుతుందని బాధితుడు ఎదురు చూస్తుండగా మోసగాడు మాత్రం తన సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి మళ్లీ కాల్ చేయలేదు. ఇటు లోన్ రాక అటు మోసగాడి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో తాను మోసపోయినట్టు తెలుసుకున్న బాధితుడు హైదరాబాద్ నగర సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐటీ చట్టంతో పాటు సెక్షన్ 429,420 క్రింద కేసు నమోదు చేసిన అధికారులు ఈ కేసును తర్వాత సీఐడీ సైబర్‌క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు. రంగంలోకి దిగిన సైబర్‌క్రైమ్ అధికారులు మొత్తం మీద గురువారం మోసగాడు ఎం.హర్షవర్ధన్‌ను అరెస్టు చేశారు. చెన్నైలోని కెవికె హోటల్‌లో స్టోర్‌కీపర్‌గా పనిచేసే హర్షవర్ధన్ నెల్లూరు జిల్లా గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలోని కాలనీ నివాసి. గతంలో ఇలాంటి మోసాలపై అధ్యయనం చేసిన హర్షవర్ధన్ అదే దారిలో బాధితుడికి పది లక్షల రూపాయల కుచ్చుటోపి తొడిగాడని విచారణలో తేలింది. ఇతని నుంచి పది సెల్‌ఫోన్ సిమ్ కార్డులు, బ్యాంక్ అక్కౌంట్లు, ఇతర దస్తావేజులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు ఈ విభాగం అధిపతి గోవింద్‌సింగ్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయని, ఈ విధంగా లోన్‌లు ఇస్తామని, ఇతర సౌకర్యాలు కల్పిస్తామంటు వచ్చే ఫోన్‌కాల్స్‌ను విశ్వసించ వద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లవ్ జిహాద్‌లో హిందువుల్ని మినహాయించండి

- హైదరాబాద్ మినీ పాకిస్తాన్ : భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

లవ్‌జిహాద్‌లో హిందూ యువతీ యువకుల్ని మినహాయించాలని భజరంగ్‌దళ్ నేతలు పిలుపునిచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ గోరక్షణను ఆపేది లేదని, దీన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. భారతదేశాన్ని హిందూ దేశంగా ప్రకటించే బాధ్యతను భజరంగ్‌దళ్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. విశ్వహిందూపరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులు జి రాఘవరెడ్డి, భజరంగ్‌దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్రజైన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మసీదులకు అల్లా ఏ విధంగా యజమాని అవుతారని ప్రశ్నించారు. ఒవైసీ సోదరుల వల్లే హైదరాబాద్ మిని పాకిస్థాన్‌గా మారిందని ఆరోపించారు. కాశ్మీర్‌లో రాళ్లు వేసే వేర్పాటువాదులకు సహకరిస్తూ, అఫ్జల్‌గురు, యాకుబ్‌మెమెన్‌లకు అనుకూలంగా మాట్లాడే వారే రామమందిరాన్ని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ముస్లింలు మహిళలను గౌరవించాలని, ఆడపిల్లలను అమ్ముకోవద్దని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడులు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్తున్నదని విమర్శించారు. దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పోలీస్‌శాఖలో ముస్లింలు 60 శాతంగా ఉన్నారని, దీనివల్ల భవిష్యత్‌లో ప్రమాదకరమని చెప్పారు. హిందూ యువత పోలీసు శాఖలో ఎక్కువగా చేరాలని సూచించారు.

పోలీస్ కమిషనరేట్‌కు అనాధ పిల్లల బడి భూములా?

- అజయ్‌మిశ్రాకు వామపక్ష, ప్రజాసంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాచకొండ పోలీస్ కమిషనరేట్ కోసం వందేండ్ల పూర్వవైభవం కలిగిన విక్టోరియా రెసిడెన్షియల్ పాఠశాల (అనాథల బడి) పది ఎకరాల భూమిని కేటాయించడం సరికాదని వామపక్ష, ప్రజాసంఘాలు విమర్శించాయి. ఈ మేరకు శనివారం సచివాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌మిశ్రాను వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి (సీపీఐ), నలమాస కృష్ణ (టీపీఎఫ్), హన్మేష్ (న్యూడెమోక్రసీ), రవిచంద్ర (విద్యాపరిరక్షణ కమిటీ), సంధ్య (పీవోడబ్ల్యూ), అరవింద్ (విరసం), మద్దిలేటి (టీవీవీ), పరశురాం (పీడీఎస్‌యూ), పాండు (టీవైఎఫ్) కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అనాధ పిల్లల కోసం కేటాయించిన భూమిని తెలంగాణ ప్రభుత్వం ఆక్రమించుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఆ భూమిని పోలీసులకు అప్పగించడం దురదృష్టకరమని చెప్పారు.

కేసీఆర్ చెప్తున్న కేజీ టు పీజీ విద్య కోసం ఆ పది ఎకరాల భూమిలో భవనాలు నిర్మించి విద్యావ్యాప్తి చేయాలని కోరారు. జవహర్‌లాల్ నెహ్రూ లాంటి వారెందరో సందర్శించిన చరిత్ర ఆ భూమికి ఉందని తెలిపారు. ఆ భూమిని పోలీసు కమిషనరేట్‌కు అప్పగించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన 48 జీవోను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆ భూమిని పరిరక్షించాలని చెప్పారు.

ఎస్‌పీఎమ్ కాంట్రాక్టు కార్మికుల్ని రెగ్యులరైజ్ చేయాలి

సీఎంకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



విద్యుత్ ట్రాన్స్‌పార్మర్స్ రిపేరింగ్ సెంటర్లలో పనిచేస్తున్న ఎస్‌పీఎం కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు లేఖ రాసారు. ఇక్కడ పనిచేస్తున్న 20వేల మంది కార్మికులు 20-30 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, హెల్పర్లకు రూ.3,400, సీనియర్‌కు రూ.7,800 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి కనీసం ఇఎస్ఐ, పీఎఫ్, వారాంతపు సెలవులు వంటి కార్మిక హక్కులు ఏవీ వర్తింపచేయట్లేదని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తూ కనీస వేతనానికి కూడా వీరు నోచుకోకపోవడం శోచనీయమని ఆ లేఖలో స్పష్టంచేశారు. విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న 20,903 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని విలీనం చేసుకొనేందుకు అంగీకరించిన ప్రభుత్వం...వీరి విషయంలో నిర్దయగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. ఎస్‌పీఎమ్ కార్మికులు ఆగస్టు 1వ తేదీ నుంచి సమ్మెలో ఉన్నారని, వారి డిమాండ్‌ను తక్షణం ప్రభుత్వం ఆమోదించాలని కోరారు.

ఒక్క ఫొటోతో ఎంతో సమాచారం...

ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేజీలకు పేజీలు వార్తలు రాసినా దొరకని సమాచారం.. ఒక్క ఫొటోతో లభిస్తుందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ వ్యాఖ్యానించారు. ఫొటో జర్నలిస్టు వృత్తి కష్టమైనది, క్లిష్టమైనదని ఆయన చెప్పారు. శనివారం సమాచార, పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యాన హైదరాబాద్ మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అల్లం నారాయణతోపాటు ఐ అండ్ పీఆర్ కమిషనర్ నవీన్ మిట్టల్ కూడా పాల్గొన్నారు. నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. మిట్టల్ మాట్లాడుతూ ప్రతియేటా ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలకు మొత్తం 93 మంది ఫొటోగ్రాఫర్లు 820 ఫొటోలను పంపారని వివరించారు. వీటిని మూడు కేటగిరీలుగా విడగొట్టామన్నారు. బంగారు తెలంగాణ కేటగిరీలో 369 ఫొటోలు, తెలంగాణ పండగల కేటగిరీలో 236, వార్తా చిత్రాల కేటగిరీలో 195 ఫొటోలు పరిశీలనకు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

సీజీజీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పాపిరెడ్డికి ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో గందరగోళం సృష్టించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డిని సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, నాయకుడు గౌరి సతీష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. డిగ్రీ సీట్లు పొందేందుకు మరోసారి పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులందరికీ ప్రవేశం పొందేలా చూడాలని కోరారు. సీజీజీ నుంచి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియను తొలగించి విశ్వవిద్యాలయాలకు అప్పగించాలని సూచించారు. డిగ్రీలో వేలాది సీట్లు మిగిలి ఉండగా, విద్యార్థులకు సీట్లు కేటాయించకపోవడం విచారకరమని తెలిపారు. 2016-17 విద్యాసంవత్సరం విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల ప్రక్రియలో అవాంతరాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సుమారు 50 వేల మంది విద్యార్థుల వివరాలు సరిగ్గా పోలి ఉండనందున 2017-18లో విద్యకు దూరమయ్యే ప్రమాదముందని తెలిపారు.

సీసీఎల్‌ఏని నియమించండి : సీపీఐ

హైదరాబాద్ : భూములకు సంబంధించిన రికార్డులను, పత్రాలను నిర్వహించే సీసీఎల్ఏ పోస్టు ఖాళీగా ఉండడం సరైంది కాదని, తక్షణమే సీనియర్ ఐఎఎస్ అధికారిని సిసిఎల్ఏగా నియమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు.

ఎప్పుడో తొలగించాల్సింది..

బానన్ ప్రభావంతోనే ట్రంప్ కీలక నిర్ణయాలు

- బానన్ శ్వేతజాతి దురహంకారి : అమెరికా మీడియా
- అతన్ని అలా అనొద్దు, మంచోడు : ట్రంప్



ట్రంప్ స్టీఫెన్ బానన్

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ ముఖ్య వ్యూహకర్త, శ్వేతసౌధంలో కీలక సలహాదారు బానన్ రాజీనామాపై అమెరికా మీడియా అనేక ఆసక్తికరమైన కథనాల్ని ప్రచురించింది. జాత్యాంహకారం, ఇస్లామోఫోబియా కలిగిన వ్యక్తిగా, శ్వేతజాతి దురహంకారిగా...బానన్‌ను పేర్కొంటూ అమెరికాలోని ప్రధాన మీడియా అంతా అతని వ్యక్తిత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. నిజానికి శ్వేతసౌధం అధికార యంత్రాంగం నుంచి బానన్‌ను ఎప్పుడో తొలగించాల్సిందని, ఇప్పటికే ఆలస్యమైందని కూడా ఇండిపెండెంట్, బ్రీట్‌బార్ట్ న్యూస్, గార్డియన్, సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్...తదితర మీడియా సంస్థలు వార్తా కథనాల్ని రాశాయి.

శ్వేతజాతి దురహంకార వైఖరి కలిగిన బానన్ గురించి (వర్జీనియా ఘటన అనంతరం) మీడియా ట్రంప్‌ను ప్రశ్నిస్తే, 'లేదు తను (బానన్) అలాంటివాడు కాడు. నేనది స్పష్టంగా చెప్పగలను. అతను చాలా మంచివాడు. తను నాకు మంచి స్నేహితుడు.

వర్జీనియా ఘటన నేపథ్యంలో మీడియా బానన్ పట్ల చాలా అన్యాయంగా ప్రవర్తించింది" అని అన్నారు. మరి అంత మంచివాడు, మంచి స్నేహితుడ్ని శ్వేతసౌధం నుంచి ట్రంప్ ఎందుకు బయటకు పంపుతున్నాడు ? అన్న సందేహాన్ని అమెరికా మీడియా కథనాలు వ్యక్తం చేశాయి.

అమెరికా అధ్యక్షుడి అధికార నివాసం శ్వేతసౌధం. ఆయన కార్యక్షేత్రమంతా ఇక్కడే ఉంటుంది. ఆయనకు సంబంధించిన వ్యక్తులంతా ఇక్కడే ఉంటారు. ఇందులో అధ్యక్షుడి సలహాదారుల బృందం చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంటుంది. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులైన బానన్, కెల్లయాన్నే కాన్వే (ఈమె ట్రంప్‌నకు కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు)లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఆర్థిక, రాజకీయ, విదేశాంగ, మిలటరీ...ఇలా అన్ని విషయాల్లోనూ బానన్, కాన్వేల మాటనే ట్రంప్ బలంగా నమ్మటం శ్వేతసౌధం మిగతా అధికారులకు నచ్చలేదు. వీరిద్దరి తీరుపై అమెరికాలోని శక్తివంతమైన రాజకీయ నాయకులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు, మిలటరీ ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

చాలా కీలకమైన సమయంలో ట్రంప్ రాజకీయ ఎజెండాను రూపొందించిన వారిలో బానన్ ముఖ్యుడు. అతని వ్యవహారశైలిపై శ్వేతసౌధంలో జనరల్ కెల్లీ (చీఫ్ ఆఫ్ స్టాఫ్), మ్యాటిస్ (రక్షణమంత్రి), మెక్‌మాస్టర్ (ఆర్మీ ఆఫీసర్, జాతీయ భద్రతా సలహాదారు) తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దేశ అంతర్గత, వలస విధానాల్లో తనదైన స్వంత ఎజెండాను ట్రంప్‌పై బానన్ రుద్దారు(శ్వేతసౌధంలో అతని వ్యతిరేకుల వాదన).

- ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ లిక్ స్టెర్లింగ్

తన మాటలతో ట్రంప్ ఉ.కొరియా అంశాన్ని యుద్ధం దిశగా తీసుకెళ్లడానికి కారణం బానన్. వెనెజులా అంశంపై కూడా ట్రంప్ జోక్యం చేసుకోనున్నారని తన సన్నిహిత వర్గాలకు బానన్ తెలియజేశారట. సైనికజోక్యానికి కూడా వెనుకాడమని చెప్పటం వెనుక, సైనికపరంగా తాము సాహసోపేతంగా వెళుతున్నామని బానన్ చెప్పుకున్నాడు. ఇక్కడే మిలటరీ ఉన్నతాధికారులు, రక్షణమంత్రి బానన్ తీరుపై ట్రంప్‌ను హెచ్చరించారు. అలాగే చైనాపై వాణిజ్య యుద్ధానికి తెరలేపటం ద్వారా ఉ.కొరియాతో అణు యుద్ధానికి ముగింపు పలికామని బానన్ చెప్పుకోవటం శ్వేతసౌధం వర్గాల్లో ఆందోళన కలిగించింది.

ఆర్థిక, జాతీయవాద ప్రచారకర్తగా పేరొందిన స్టీఫెన్ బానన్ అమెరికా నౌకాదళ మాజీ అధికారి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా, హాలీవుడ్ సినీనిర్మాతగానూ వ్యవహరించారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ విజయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. వర్జీనియా చార్లోటెస్‌విల్లే హింసాత్మక ఘటనల నేపథ్యంలో వ్యూహకర్తపై వేటుపడినట్టు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితమే ట్రంప్ ఇద్దరు ఉన్నతస్థాయి వ్యక్తులను తొలగించారు. మరోవైపు కళలు, హ్యూమానిటీస్‌పై అధ్యక్షుడి కమిటీ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించింది. 17 మంది కమిటీ సభ్యుల్లో 16 మంది రాజీనామాపై సంతకాలు చేశారు.

రష్యాలో కత్తిదాడి

- దుండగుడిని మట్టుబెట్టిన పోలీసులు



మాస్కో: రష్యాలో సుర్గుత నగరంలో ఓ ఉన్మాది రెచ్చిపోయాడు. రోడ్డుపై నడిచివెళ్తున్నవారిపై కత్తితో విరుచుకుపడ్డాడు. విచక్షణా రహితంగా ఎనిమిది మందిని పౌరులను గాయ పరిచాడు. అడ్డుకోపోయిన పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. దీంతో పరిస్థితి అదుపు తప్పుతోందని భావించిన పోలీసులు దుండగుడిపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. దుండగుడి దాడిలో ఎనిమిదిమంది గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రష్యా కాలమానం ప్రకారం శనివారం ఉదయం 11.20 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అధికారులు తెలిపారు. దుండగుడి వివరాలు, దాడికి గల కారణాలు తెలియరాలేదు. ఘటన నేపథ్యంలో సర్గట్ నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. దుండగుడి వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు యత్నిస్తున్నట్టు అధికారులు చెప్పారు.

నగరంలో రద్దీగా ఉన్నవేళ ఉన్మాది రెచ్చిపోయాడు. ప్రయాణికులపై దాడులకు పాల్పడ్డాడు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రయత్నించిన వారిపై ఎదురుదాడికి దిగాడు. దీంతో పోలీసులు కాల్పులు జరిపినట్టు ఇన్వెస్టిగేషన్ కమిటీ ఉన్నాధికారులు తెలిపారు.

నిందితుడు దాడి చేసిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురి పరిస్థితి నిలకడగా ఉందని, ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సంఘటనపై ప్రభుత్వం స్పందిస్తూ శాంతియుత వాతావరణం కోసం కృషి చేయాలిని పిలుపునిచ్చింది, సాధారణ పరిస్థితులు ఏర్పడేంత వరకూ దేశ పౌరులు, మీడియా సహకరించాలని కోరింది.

అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడను!

- ఛార్లెట్స్‌విల్లే మృతురాలి తల్లి





వాషింగ్టన్: ఇటీవల వర్జీనియాలోని ఛార్లెట్స్‌విల్లేలో జరిగిన ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన యువతి కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు శ్వేతసౌధం వర్గాలు గత వారం నుంచి ప్రయత్నిస్తున్నాయి. అయితే.. అందుకు మృతురాలి తల్లి మాత్రం ఒప్పుకోవడం లేదు. ఛార్లెట్స్‌విల్లే ఘర్షణలో హీథర్ హేయర్ ప్రాణాలు కోల్పోయింది. ఆమె కుటుంబ సభ్యులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడనున్నట్టు గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే శ్వేతసౌధం నుంచి పలుమార్లు హేయర్ తల్లి సుషాన్‌బ్రోకు ఫోన్లు వస్తున్నాయి. కానీ ఆమె మాత్రం ట్రంప్‌తో మాట్లాడేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

'నేను ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడను. క్షమించండి.. అని అన్నారు. ఆందోళన జరిగే సమయంలో ఏం జరిగిందో దానికి సంబంధించిన క్లిప్‌ను చూశాను' అని ఆమె ఉద్వేగానికి లోనయ్యారు. గతవారం అమెరికాలో శ్వేత దురహంకారులకు, మరో గ్రూపునకు మధ్య జరిగిన ఘర్షణ హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఆందోళనకారులపైకి ఓ కారు వేగంగా దూసుకెళ్లడంతో ఓ మహిళ మృతి చెందగా.. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు.

నయా-నాజీలకు మద్దతు ఇచ్చారు

- ట్రంప్‌పై మండిపడ్డ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్



లాస్ ఏంజిల్స్: చార్లెట్స్‌విల్లేలో జరిగిన హింసపై కాలిఫోర్నియా మాజీ గవర్నర్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఘటనపై దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆర్నాల్డ్ ఖండించారు. నయా-నాజీలకు ట్రంప్ మద్దతు ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ బొమ్మను చేతిలో పట్టుకుని, ఆ బొమ్మకు జాతివివక్ష గురించి వివరిస్తూ ఆర్నాల్డ్ ఓ వీడియోను పోస్ట్ చేశారు. ద్వేషానికి రెండు తలలు ఉండవని, లక్షల మందిని చంపిన వ్యక్తుల వైపు నువ్వు నిలుచుంటే, దానికి రెండు దిక్కులు ఉండవని ఆర్నాల్డ్ అన్నారు. చార్లెట్స్‌విల్లే ఘటనపై మీడియా సమావేశంలో శ్వేతజాతి దురహంకారులను, మరో గ్రూప్ (రెండు వర్గాలను) తీరును ఖండించారు. ఇక్కడే ట్రంప్ ఎంచుకున్న విధానాన్ని ఆర్నాల్డ్ తప్పుబట్టారు. ద్వేషాన్ని జయించాలంటే, వాళ్లపై అంతకన్నా అధికంగా మన స్వరాన్ని వినిపించాలని ట్రంప్‌నకు సూచించారు.

అమెరికాలో పెరిగిన విద్వేష గ్రూపులు

న్యూయార్క్: అమెరికాలో విద్వేష గ్రూపుల సంఖ్య నానాటికి పెరుగుతూ వస్తున్నది. 2015 సంవత్సరంలో అమెరికాలో 892 విద్వేశ గ్రూపులు ఉండగా, వాటి సంఖ్య 2016 నాటికి 917కు చేరుకుందని సదరన్ పావర్టీ లా సెంటర్ (ఎస్‌పీఎల్‌సీ) పర్యవేక్షక సంస్థ వెల్లడించింది. ఇక 1999 సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ విద్వేష గ్రూపుల సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగాయి. ఈ గ్రుపుల్లో ఎక్కువగా ముస్లిం వ్యతిరేక, విదేశాల నుంచి వలసల వ్యతిరేక, ఎల్‌జీబీటీ వ్యతిరేక, శ్వేత జాతీయవాద, నయా నాజిజం, నయా కానిఫడరేట్ గ్రూపులు ఎక్కువగా ఉన్నాయి.

గతంతో పోలిస్తే కూ, క్లక్స్, క్లా (క్లాన్), ప్రభుత్వ వ్యతిరేక సాయుధ గ్రూపులు, వివిధ రాజకీయ గ్రూపుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ముస్లిం వ్యతిరేక గ్రూపుల సంఖ్య మునుపెన్ననడు లేనివిధంగా పెరిగింది. గతంతో 37 ముస్లిం వ్యతిరేక గ్రూపులు ఉండగా, వాటి సంఖ్య 101కి చేరుకుంది. ఒక్క ఏడాది కాలంలోనే వీటి సంఖ్య 197 శాతం పెరగడం గమనార్హం. 2014 సంవత్సరంతో పోలిస్తే 2015 సంవత్సరంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడుల సంఖ్య ఏకంగా 67 శాతం పెరిగిందని ఎఫ్‌బీఐ లెక్కలు తెలియజేస్తున్నాయి.

'రెవెన్యూ వ్యవస్థ రక్షణ కోసం పోరాటం'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల్లో విలీనంచేయాలని, వీఆర్ఏ, వీఆర్‌వోలు రైతు గ్రామ సమాఖ్యల కింద పనిచేయించాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమ్ముల బాలనర్సయ్య, ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు శనివారం పిలుపునిచ్చారు. రైతులకు ఏడాదికి రెండు పంటలకు ఎకరానికి రూ. 8 వేలు ఇవ్వడానికి గ్రామాల్లో గ్రామ కమిటీలు వేసి గ్రామ సమాఖ్యల ద్వారా పంపిణీ చేయాలని ఆలోచన చేస్తున్నదన్నారు. వ్యవసాయ శాఖలో గ్రామసమాఖ్య కింద వీఆర్ఏ, వీఆర్‌వోలు పనిచేయడం అంటే భూస్వాములు, పెత్తందార్లు పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుల గుప్పిట్లోకి నెట్టి వెట్టి చాకిరి చేయించడమే అవుతుందన్నారు. దశాబ్దాలుగా సాధించుకున్న హక్కులు, జీవోలు, అనేక సౌకర్యాలు రద్దవుతాయని వివరించారు. ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచనను ఉపసంహరించాలని, రెవెన్యూ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

పాత జిల్లాకేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించాలి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణలోని పాత జిల్లా కేంద్రాలన్నింటిలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూటీ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. శనివారం మంత్రి లక్ష్మారెడ్డిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అంజిరెడ్డి, ఎం చెన్నయ్య కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్‌ఎస్ కార్డులతో అన్ని కార్పొరేట్ ఆస్పత్రులు ద్వారా వైద్యసౌకర్యాలు అందిస్తున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని కేసుల్లో ప్రభుత్వమే గెలవాలి..

- కౌంటర్ అఫిడవిట్లను త్వరగా దాఖలు చేయాలి
- స్టేలు వెకేట్ చేయించాలి : సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ కేసులపై హరీశ్‌రావు ఆదేశం
- అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులతో సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టుల కోసం చేస్తున్న భూసేకరణ లో తలెత్తుతున్న న్యాయపరమైన వివాదాలను వెంటనే పరిష్కరించడానికి భూసేకరణ అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు కృషి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. అన్ని కేసుల్లో ప్రభుత్వమే గెలవాలని, ఈ మేరకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులపై స్థానిక జలసౌధలో శనివారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏండ్ల తరబడి కోర్టు కేసులు అపరిష్కృతంగా ఉన్నందువల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పడుతున్నదని, నిర్ణీత కాలవ్య వధిలో ప్రాజెక్టుల పనులు పూర్తి చేయలేక పోతున్నా మని మంత్రి అభిప్రాయపడ్డారు. నీటిపారుదల శాఖలో అధికారులు, ప్రభుత్వ న్యాయవాదుల సమన్వయ సమావేశం నిర్వహించడం ఇదే మొదటి సారని మంత్రి చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణానికి కేసులు అడ్డంకి కాకూడదన్నారు. కోర్టు తీర్పులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాకుండా ప్రభుత్వ న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించాలన్నారు.

వివిధ కేసుల్లో కౌంటర్ అఫిడవిట్లు సకాలంలో దాఖలు చేయకపోవడం, సమర్థవంతంగా వాదించక పోవడం వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో కోర్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇస్తున్నాయని మంత్రి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యం, రైతాంగ ప్రయోజనాల గురించి, వ్యవసాయ రంగంలో సంక్షోభానికి చరమగీతం పాడడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై కోర్టులో బలంగా వాదించాలని కోరారు. జిల్లాల్లోని వివిధ కోర్టు కేసుల్లో ప్రభుత్వ వాదన వినిపించడానికి హైదరాబాద్, ఢిల్లీ నగరాల నుంచి నిష్ణాతులైన న్యాయవాదులను నియమించాలని మంత్రి సూచించారు. కేసుల పరిష్కారం కోసం ఇరిగేషన్, రెవిన్యూ, న్యాయశాఖలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం చేస్తున్న భూసేకరణ సంద ర్భంగా దాఖలైన కేసులు వాటి పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రాజెక్టుల వారీగా మంత్రి సమీక్షించారు.

మిడ్‌మానేరు ప్రాజెక్టు వ్యయం రూ. 400 కోట్లు కాగా పరిహారం చెల్లింపుల కోసం రూ. 1,400 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. కోర్టులు స్టే ఇచ్చినందువల్ల ప్రాజెక్టులు, కాల్వల పనుల్లో జాప్యం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ న్యాయవాదుల, శాఖల మధ్య సమాచార లోపం లేకుండా జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల పరిష్కారానికి నీటిపారుదల శాఖలో ఒక లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాదులు, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేకంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, న్యాయశాఖ కార్యదర్వి నిరంజన్‌రావు, ఈఎన్‌సీలు మురళీధరరావు, నాగేందర్‌రావు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

'హక్కులు అమలుచేయకుండా హియరింగ్ ఎందుకు'


- ప్రతిఘటనకు పోరాట కమిటీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భూములు సేకరిస్తున్న 15 జిల్లాల్లో ఈనెల 22 నుంచి 26 వరకు పర్యావరణంపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం సరికాదని తెలంగాణ భూనిర్వాసితుల పోరాట కమిటీ అభిప్రాయపడింది. భూనిర్వాసితులకు చట్టబద్ధమైన పరిహారం, హక్కులు వచ్చేవరకు పబ్లిక్ హియరింగ్ నిర్వహించరాదని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. చట్టాలను అమలు జరపాల్సిన ప్రభుత్వాలే ధిక్కారానికి పాల్పడటం, తెలం గాణ అభివృద్ధి పేరుతో విధ్వంసం చేయడమేనని వ్యాఖ్యానించింది. ఈమే రకు పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్, కో-కన్వీనర్ టి.సాగర్, ధర్మానాయక్‌లు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సర్కారు మొండిగా పబ్లిక్ హియరింగ్‌కు వెళితే నిర్వాసితులు ప్రతిఘటి స్తారని చె ప్పారు.

సెప్టెంబర్ 1న పింఛన్ విద్రోహదినం

- వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన యూఎస్‌పీసీ నాయకులు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న 'పింఛన్ విద్రోహదినం' పాటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆరోజు ఉపాధ్యాయులంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని, జిల్లా కేంద్రాలలో సామూహిక ధర్నాలలో పాల్గొనాలని కోరారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 'పింఛన్ విద్రోహదినం'కు సంబంధించిన వాల్ పోస్టర్లను యూఎస్‌పీసీ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 8,9,10 తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేసి నిరసనలు తెలిపినట్టు చెప్పారు. త్రిపుర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఈ విధానం అమలు చేయడం లేదనీ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో సీపీఎస్ విధానం రద్దు చేసేందుకు కమిటీ వేసి అధ్యాయనం చేస్తున్నారని తెలిపారు. సీపీఎస్ విధానం అమలు విషయం లో రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి స్వేచ్ఛఉన్నా, తెలంగాణ ప్రభుత్వం స్పందించక పోవడం సరికాదని అన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎన్ కిష్టప్ప... తెలంగాణ ప్రభుత్వం ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ సర్కార్ అంటూనే, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి.కొండల్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సెప్టెంబర్1న సామూహికంగా సెలవులు పెట్టి, జిల్లా కేంద్రాల్లో అం దరూ పాల్గొనాలని కోరారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పోచయ్య మాట్లాడుతూ... సీపీ ఎస్ విధా నానికి వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమాలు, ర్యాలీల్లో సంఘాలతో సంబం ధం లేకుండా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. బీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము రమేశ్ మాట్లాడుతూ... సీపీఎస్ రద్దయ్యే వరకూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ...సీపీఎస్ విధానం అమలుతో రాష్ట్రంలో లక్షా ఇరవై వేలమంది ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల సామాజిక భద్రత అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి మనోహరరాజు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం రఘుశంకర్‌రెడ్డి, టీఎస్‌పీటీఏ రాష్ట్ర కార్యదర్శి కె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

మనోజ్ ఇండస్ట్రీకి దొరికిన వరం

- 'ఒక్కడు మిగిలాడు' ట్రైలర్ లాంచ్‌లో మంచు లక్ష్మీ



మంచు లక్ష్మీతో 'ఒక్కడు మిగిలాడు' చిత్రయూనిట్ సభ్యులు

మంచు మనోజ్, అనీషా ఆంబ్రోస్ జంటగా అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రై.లి పతాకంపై ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీకాంత్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన మంచులక్ష్మీ ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ట్రైలర్‌ను చాలా సార్లు చూశా. చాలా బాగుంది. దర్శకుడు అజయ్ ఇంటెన్స్ ఉన్న వ్యక్తి. నిజమైన కథను చెప్పాల్సి వచ్చినప్పుడు కష్టపడాల్సి ఉంటుంది. ఎంతో కష్టపడి దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. నటన పరంగా మనోజ్ నాకు ఇన్‌స్పిరేషన్. ఆర్టిస్టుగా తను ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా చేస్తుంటాడు. అలా ఎప్పుడెప్పుడు కొత్త పాత్ర చేస్తాడా అని ఎదురుచూస్తుంటాను. తను ఇండస్ట్రీకి దొరికిన ఓ వరంలా భావిస్తాను. యదార్థ సంఘటనలను తెరపైకి ఎక్కించాలంటే చాలా ధైర్యం కావాలి. అంత ధైర్యం చేసిన నిర్మాతలకు అభినందనలు' అని అన్నారు.

'నేను ఈ చిత్రంలో రెండు పాత్రలను చేయగలనని నమ్మిన దర్శకుడు అజయ్‌కు ధన్యవాదాలు. సినిమాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. సినిమా అద్భుతంగా వచ్చింది. ఆదరించాలని కోరుకుంటున్నా' అని మనోజ్ తెలిపారు. దర్శకుడు అజయ్ ఆండ్రూస్ చెబుతూ, 'ప్రపంచంలోనే ఇప్పటి వరకు 16లక్షల మంది శరణార్థులున్నారు. ఇది ఆస్ట్రేలియా జనాభా కంటే ఎక్కువ. 21వ శతాబ్దంలో కూడా చాలా మంది ఆకలితో, స్వేచ్ఛ కోసం, మనుగడ కోసం పోరాడుతున్నారు. అదే సమయంలో శరణార్థులూ పెరిగిపోతున్నారు. వాళ్ళు అణగతొక్కబడ్డ ప్రతిసారి ఓ నాయకుడు పుడతాడు. అతను ఏ మార్గం ఎంచుకుంటాడనేది పరిస్థితిని బట్టి ఉంటుంది. సరిగ్గా అలాంటి కథతోనే ఈ చిత్రాన్ని రూపొందించాం. ఓ నాయకుడు పోరాడుతున్నప్పుడు ఎలాంటి ఫలితాన్ని చూపుతాయనేదే ఈ సినిమా. శ్రీలంక ప్రాంతంలో ఎల్.టి.టి.ఈకి చెందిన ఓ నాయకుడు(శరణార్థి) తన వారికోసం, తన మనుగడ కోసం, తన కుటుంబం మనుగడ కోసం చేసిన పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం. సినిమా ప్రధానంగా రెండు సమయాల్లో జరుగుతుంది. 1990లో శ్రీలంకలో స్వేచ్ఛ కోసం ఒక నేత పోరాటం, 2017లో తన కాలేజ్‌లోని ఓ సమస్య కారణంగా మానవత్వం కోసం ఓ విద్యార్థి నాయకుడు చేసే పోరాటం నేపథ్యంలో సినిమా సాగుతుంది. ఎల్.టి.టి.ఈ నేతగా, విద్యార్థి నాయకుడిగా మంచు మనోజ్ అద్భుతంగా నటించాడు. ఆయన రియలిస్టిక్ నటనను ఈ చిత్రంలో చూడొచ్చు. సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. 20 కేజీలు పెరిగి, 10 కేజీలు తగ్గాడు. సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటి వరకు తెలుగులో రాని సబ్జెక్ట్ ఇది. కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. శివ నందిగామ మంచి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. అలాగే బాలీవుడ్ సినిమాలకు పనిచేసిన విక్రమ్ బిశ్వాస్ సౌండ్ డిజైనింగ్ ఆకట్టుకుంటుంది' అని అన్నారు.

'మొదటిసారి మనోజ్‌తో చేస్తున్న చిత్రమిది. 'ఆడుమగాడ్రా బుజ్జి' తర్వాత మా బ్యానర్‌లో చేస్తున్న చిత్రమిది. చాలా కొత్తగా, డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు సినిమాను బ్యూటిఫుల్‌గా తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ బిశ్వాస్, కాంతం, శివ నందిగామ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హేయ్ పిల్లగాడ టిపికల్ లవ్‌స్టోరీ



'హేయ్ పిల్లగాడ' చిత్ర పోస్టర్ లాంచ్ దృశ్యం

దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జంటగా సమీర్ తాహిర్ దర్శకత్వంలో మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించిన 'కలి' చిత్రాన్ని లక్ష్మీ చెన్నకేశవ ఫిల్మ్స్ పతాకంపై 'హేయ్ పిల్లగాడ' పేరుతో డిస్ట్రిబ్యూటర్ డి.వి.కృష్ణస్వామి తెలుగులో విడుదల చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర లోగోను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్రం మలయాళం, తమిళంలో విడుదలై పెద్ద విజయం సాధించింది. తెలుగులో కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఈ చిత్ర అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. సినిమా చాలా బాగా వచ్చింది. హేమచంద్ర హీరో వాయిస్‌కు డబ్బింగ్ చెప్పారు. ఈ సినిమాలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని రచయిత భాషా శ్రీ తెలిపారు. నిర్మాత డి.వి.కృష్ణస్వామి చెబుతూ, "ఒకే బంగారం'తో ఆకట్టుకున్న దుల్కర్ సల్మాన్, 'ఫిదా'తో మంత్రముగ్ధుల్ని చేసిన సాయి పల్లవి కలిసి నటించిన ఈ చిత్రం టిపికల్ లవ్‌స్టోరీతో తెరకెక్కింది. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ 8న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సినిమాను 'ఫిదా' లాగానే పెద్ద హిట్ చేస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. 'సినిమాలో మంచి మెలోడీ పాటలు రాశాను. పాటలు, సినిమా ప్రేక్షకులను తప్పకుండా మెప్పిస్తాయి. రొమాంటిక్ లవ్‌స్టోరీతో తెరకెక్కిన ఈ చిత్రంలోని యాక్షన్ కూడా ప్రేక్షకులను అలరిస్తుంది' అని పాటల రచయిత సురేంద్రకృష్ణ చెప్పారు.

అన్ని భాషల్లోనూ నటిస్తా..



రాధికా మెహరోత్రా

'తెలుగులో నేను నాగార్జునకు పెద్ద అభిమానిని. నటిగా నాకు కాజల్ స్ఫూర్తి' అని అంటోంది హీరోయిన్ రాధికా మెహరోత్రా. చంద్రకాంత్, రాధికా మెహరోత్రా జంటగా గోవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. ఈ చిత్రం సెప్టెంబర్‌లో విడుదల కానున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో రాధికా మీడియాతో ముచ్చటించింది.

'నేను పుట్టి పెరిగింది రాజస్థాన్‌లోని జైపూర్‌లో. ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ చేస్తున్న సమయంలో థియేటర్ ఆర్టిస్టుగా అనేక నాటకాల్లో నటించాను. న్యూయార్క్‌లో మూడేండ్ల పాటు యాక్టింగ్ స్టడీ చేశాను. నాటకాల్లో పనిచేస్తున్నప్పుడు ఈ చిత్ర హీరో చంద్రకాంత్ పరిచయమయ్యారు. ఆయనకు ముందుగా ఈ చిత్రంలో ఛాన్స్ వచ్చింది. హీరోయిన్ కోసం నా పేరును ఆయన సజెస్ట్ చేశారు. అలా ఈ చిత్రంలో భాగమయ్యాను. ఇదొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్. ఇందులో నేను మైథిలి అనే అమ్మాయి పాత్రలో నటించాను. ఇందులో నేను చాలా డెడికేటెడ్, హార్డ్‌వర్కర్‌ని. ఎన్ని సమస్యలొచ్చినా ముందుకు సాగే తత్వం నాది. ఈ క్రమంలో హీరోతో పరిచయం తర్వాత నా లైఫ్, సినిమా కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది సినిమా. హర్రర్‌తోపాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి. దర్శకుడు గోవర్ధన్ చాలా టాలెంటెడ్, క్రియేటివ్ పర్సన్. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. భాష విషయంలో కొంచెం ఇబ్బంది పడ్డాను. నెల రోజుల పాటు వర్క్‌షాప్ చేయడంతో డైలాగ్స్ అర్థం చేసుకోవడం కొంత ఈజీ అయ్యింది. చంద్రకాంత్ మంచి కో స్టార్. అతనితో ముందే పరిచయం ఉండటంతో మా మధ్య వచ్చే సన్నివేశాలను బాగా చేయగలిగాం. సినిమాల్లో లాంగ్వేజ్ బ్యారియర్ కాదు. నటిగా నేను ఒకటి రెండు భాషలకే పరిమితం అవ్వాలనుకోవడం లేదు. అన్ని భాషల్లోనూ మంచి సినిమాలు చేయాలనేదే నా లక్ష్యం. అలాగే మంచి పాత్రలు, మంచి కథ వస్తే గ్లామర్ రోల్స్ చేయడం గురించి కూడా ఆలోచిస్తాను' అని తెలిపింది.

ఇష్టమైన అభిరామ్ పాత్ర..



'ఉన్నది ఒకటే జిందగీ' చిత్రంలో రామ్

'నేను శైలజ' వంటి విజయాన్ని అందించిన కిశోర్ తిరుమల దర్శకత్వంలో రామ్ మరోసారి నటిస్తున్న చిత్రం 'ఉన్నది ఒకటే జిందగీ'. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు హీరో రామ్. ఈ చిత్రంలో తన పాత్రను తెలిపే ఓ ఫొటోను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. 'ఇందులో నేను అభిరామ్ అనే పాత్రలో కనిపించబోతున్నాను. ఇది నాకిష్టమైన పాత్ర. ఇదొక మోస్ట్ బ్యూటిఫుల్ పాత్ర అవుతుంది. అభిరామ్‌ను కలవడానికి మీరందరూ వెయిట్ చేయలేకపోతున్నారని తెలుసు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ఫొటోలో రామ్ మ్యూజిక్ షోలో గిటార్ వాయిస్తూ ఉన్నారు. దీన్ని బట్టి ఇందులో ఆయన రాక్‌స్టార్‌గా కనిపిస్తారని తెలుస్తోంది. ఈ చిత్రంలో రామ్ సరసన అనుపమ పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

మహిళలకు ప్రాధాన్యం పెరిగింది..



'ఇటీవల వస్తున్న బాలీవుడ్ సినిమాల్లో మహిళలను ప్రగతిశీల పద్ధతిలో చూపిస్తున్నారు. ఇది మహిళా సాధికారతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు' అని అంటోంది కరీనా కపూర్. ఇటీవల ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు దూరంగా ఉన్న కరీనా తిరిగి సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో వస్తున్న మార్పులు ముఖ్యంగా మహిళల గురించి కరీనా మాట్లాడుతూ, 'మహిళలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల బాలీవుడ్ దర్శక,నిర్మాతలు పాత్రలు రాస్తున్నారు. సినిమాల్లో మహిళలకు మంచి ప్రాధాన్యత ఉంటోంది. మహిళా ప్రగతిశీల పద్ధతికి ఇవి దోహదపడేవిగా ఉన్నాయి. ఈ మార్పుకు కారణం కొత్తగా వస్తున్న రచయితలు, దర్శకులే. వాళ్ళు హీరోయిన్లను దృష్టిలో పెట్టుకుని శక్తివంతమైన పాత్రలను రాస్తున్నారు. వాటిని దర్శకులు కూడా అంతే స్ట్రాంగ్‌గా తెరపైన ఆవిష్కరిస్తున్నారు. మహిళల కష్టాన్ని, వారి సక్సెస్‌ను, వ్యక్తిగతంగా వారిలోని బలాలను వెండితెరపై అద్భుతంగా చూపిస్తున్నారు. ఇది హిందీ చిత్ర పరిశ్రమలో వచ్చిన అతి పెద్ద మార్పుగా భావిస్తున్నాను. ఇది ఆహ్వానించదగ్గ, సంతోషించదగిన మార్పు' అని అన్నారు.

కరీనా కపూర్

ప్రేక్షకుల్ని మెప్పించే సరసుడు



శింబు, నయనతార

శింబు, నయనతార, ఆండ్రియా, ఆదాశర్మ హీరో,హీరోయిన్లుగా పాండిరాజ్ దర్శకత్వంలో టి.రాజేందర్ సమర్పణలో శింబు సినీ ఆర్ట్స్ అండ్ జేసన్‌రాజ్ ఫిలింస్ బేనర్స్‌పై తమిళ్, తెలుగు భాషల్లో టి.రాజేందర్ నిర్మించిన చిత్రం 'సరసుడు'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి హీరో శింబు మాట్లాడుతూ, 'నేను నటించిన 'మన్మథ', 'వల్లభ' చిత్రాలు తెలుగులో రిలీజై సూపర్‌హిట్ అయిన విషయం తెలిసిందే. కొంత గ్యాప్ తర్వాత ఈ చిత్రంతో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నాను. తమిళంలో విడుదలై నా కెరీర్‌లోనే ఈ చిత్రం బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. తెలుగులో కూడా 'మన్మథ', 'వల్లభ' చిత్రాల కంటే బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. మా లవ్ బ్రేకప్ అయిన తర్వాత నయనతార, నేను కలిసి నటించిన ఈ చిత్రం యూత్‌కి, ఫ్యామిలీస్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. అద్భుతమైన లవ్‌స్టోరీతో దర్శకుడు పాండిరాజ్ సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. నయనతార, ఆండ్రియా, ఆదాశర్మ ఎక్స్‌లెంట్‌గా పెర్‌ఫార్మ్ చేశారు. నా సోదరుడు కురళ్ అరసన్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సూపర్. ఈ చిత్రం రిలీజ్‌కి ముందే తనకి మంచి మంచి ఆఫర్స్ వస్తుండటం నాకు చాలా హ్యాపీగా ఉంది' అన్నారు. 'శింబు సినీ ఆర్ట్స్ బేనర్‌లో 'కుర్రాడొచ్చాడు' చిత్రంతో శింబుని హీరోగా లాంచ్ చేశాం. మళ్ళీ అదే బేనర్‌లో 'సరసుడు' చిత్రాన్ని తెలుగు, తమిళంలో బైలింగ్వల్ నిర్మించాం. తమిళంలో 'ఇదు నమ్మ ఆళు' పేరుతో రిలీజై 27కోట్ల రూపాయల్ని వసూలు చేసింది. డీమానిటైజేషన్ కారణంగా తెలుగులో రిలీజ్ లేట్ అయ్యింది. ఇప్పుడు మంచి డేట్ చూసుకుని మా చిత్రాన్ని సెప్టెంబర్ 8న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ చేస్తున్నాం. సాఫ్ట్‌వేర్ బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేవిధంగా ఉంటుంది. సినిమాను తెలుగు ప్రేక్షకులు ఆదరించి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నా' అని నిర్మాత టి.రాజేందర్ చెప్పారు.

బాలయ్యతోనే కాదు..అఖిల్‌తో కూడా..

'దర్శకుడు తేజతో ఉన్న అనుబంధం కారణంగా అయన స్టయిల్, అభిరుచి ఏంటో బాగా తెలుసు. అందుకే 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రానికి సంగీతం సమకూర్చడం చాలా ఈజీ అయ్యింది' అని అంటున్నారు సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్. రానా, కాజల్, కేథరిన్ హీరోహీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో రూపొందిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం గత వారం విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ శనివారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..



అనూప్ రూబెన్స్

నాకిది ఫస్ట్ టైమ్..

'నేనే రాజు నేనే మంత్రి' ఒక పొలిటికల్ థ్రిల్లర్ చిత్రం. ఇలాంటి సినిమా చేయడం నాకు ఫస్ట్‌టైమ్. స్టోరీ విన్నప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఈ సినిమాకు డిఫరెంట్‌గా మ్యూజిక్ చేయాలని రకరకాల ట్యూన్స్ కంపోజ్ చేశాం. చివరికి కథకు ఏది అవసరమో అవే పెట్టడం జరిగింది. తేజతో చాలా రోజుల క్రితమే 'సావిత్రి' అనే సినిమా చేయాల్సింది. అది వర్కౌట్ కాలేదు. ఆ సినిమా కోసం చేసిన ఆరు పాటల్లో నుంచి రెండు పాటలను ఈ చిత్ర కథకు సరిపోవడంతో ఇందులో వాడుకున్నాం. 'జోగేంద్ర..', 'దేవుడితో..' అనే పాటలు అలా తీసుకున్నవే. తేజతో కొన్నేండ్లుగా ట్రావెల్ అవుతున్నా. దీంతో ఈ చిత్రానికి మ్యూజిక్ కంపోజ్ చేయడం ఈజీ అయ్యింది.

కథలో భాగంగానే..

ఈ చిత్రంలో కథ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. కథలో భాగంగానే పాటలుంటాయి. దానికి తగ్గట్టుగానే మ్యూజిక్ చేశాను. బ్యాక్‌గ్రౌడ్ స్కోర్‌కు ఎక్కువ స్కోప్ ఉన్న చిత్రమిది. సినిమాలో మొత్తం ఏడు పాటలుంటాయి. కానీ సినిమా చూస్తున్నప్పుడు అన్ని పాటలున్నాయనే ఫీలింగ్ కలగదు. సినిమాకది బాగా కుదిరింది. సినిమా చూశాక చాలా మంది బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గురించి ప్రశంసించారు. కోలీవుడ్ నుంచి కూడా చాలా మంది ఫోన్లు చేసి అభినందించారు. ఇలాంటి పాటలు చేయడం ఛాలెంజింగ్‌గా ఉంటుంది. కథతోపాటు సాగే పాటలు చేయడం నాకిష్టం.

చాలా నేర్చుకున్నా..

తేజగారు చాలా టాలెంటెడ్. ఆయన్నుంచి ఇప్పటి వరకు చాలా నేర్చుకున్నాను. ప్రతి సినిమాకు ఆయన్నుంచి ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటూనే ఉన్నాను. అలాగే రానాతో పనిచేయడం నాకిది ఫస్ట్ టైమ్. ఆయన డౌన్‌టు ఎర్త్ పర్సన్. హీరో అనే ఫీలింగ్ ఆయనలో ఒక్క శాతం కూడా కనిపించదు. ఈ సినిమాకు పనిచేయడం వల్ల రానా నుంచి కూడా చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. ప్రస్తుతం బాలకృష్ణతో 'పైసా వసూల్' చిత్రం చేస్తున్నా. ఈ చిత్రంలో బాలయ్యతో ఓ పాట కూడా పాడించడం జరిగింది. ఆయన చాలా బాగా పాడారు. బాలయ్యతో పాట పాడించాలనే ఐడియా పూరీ, నేను కలిసి అనుకున్నదే. బేసిక్‌గా బాలయ్యకు సంగీతమంటే ఇష్టం. దీంతోపాటు అఖిల్ సినిమాకు సంగీతం అందిస్తున్నా. ఇందులో అఖిల్‌తో కూడా ఓ పాట పాడించాను. దాన్ని త్వరలోనే విడుదల చేస్తాం.

కొత్త ఆలోచనలతో వస్తున్నారు..

కొత్త దర్శకుడితో పనిచేసినా, సీనియర్ దర్శకుడితో పనిచేసినా సంగీతం అనేది ఛాలెంజింగ్‌గానే ఉంటుంది. అయితే ప్రతి ఒక్కరిలోనూ కొత్తదనం ఉంటుంది. ప్రతి దర్శకుడికీ ఓ స్టయిల్ ఉంటుంది. ఆ స్టయిల్‌లో ట్యూన్స్ చేయడం ఓ సంగీత దర్శకుడిగా ఛాలెంజింగ్‌గానే ఉంటుంది. ఇప్పుడొస్తున్న వారంతా న్యూ థాట్స్‌తో వస్తున్నారు. కొత్తదనం కోరుకుంటున్నారు. దీని వల్ల మేం కూడా నవ్యమైన సంగీతం అందించడానికి అవకాశం ఉంది. మాలో కూడా కొత్తదనం వస్తుంది. అందుకే నేను అప్‌కమింగ్ డైరెక్టర్స్‌తో పనిచేయడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తాను. కీబోర్డ్, పియానో వాయించడంలో నాకు మంచి పట్టుంది. దీంతోపాటు ఇతర సంగీత పరికరాల విషయంలోనే కాకుండా సంగీత పరంగానూ అప్‌డేట్ అవుతుంటాను. అప్పుడే మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా రాణించగలం.



తాగుబోతు రమేష్, మహి, తాప్సీ, దిల్‌రాజు, విజయ్, రాజీవ్‌కనకాల

ఆనందో బ్రహ్మ స్ఫూర్తినిచ్చింది

- సక్సెస్‌మీట్‌లో దిల్‌రాజు

'కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు ఆడినప్పుడు 'ఆనందో బ్రహ్మ' లాంటి మంచి సినిమాలొస్తాయి. జోనర్ మారిస్తేనే కొత్త చిత్రాలు వస్తాయి' అని అన్నారు నిర్మాత దిల్‌రాజు. తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన పాత్రధారులుగా మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్, శశిరెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. ఈ చిత్రం శుక్రవారం విడుదలైన నేపథ్యంలో శనివారం చిత్రయూనిట్ సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న దిల్‌రాజు మాట్లాడుతూ, 'ఈ చిత్ర టీమ్ అందరికీ కంగ్రాట్స్. విడుదలైన మార్నింగ్‌షో నుంచే సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. కలెక్షన్లు బాగున్నాయి. నిర్మాత విజయ్‌కిది రెండవ చిత్రం. ఈ చిత్రం కూడా బాగా ఆడటం హ్యాపీగా ఉంది. చిన్న సినిమాలు ఈ రోజుల్లో ఆడటం ఎంత కష్టమో తెలిసిందే. కానీ ఓవర్సీస్, హైదరాబాద్, వైజాగ్‌లో ఈ చిత్రానికి మంచి కలెక్షన్లు వస్తున్నాయి. శుక్రవారం కంటే శనివారం కలెక్షన్లు పెరిగాయి. మనుషులను చూసి దెయ్యాలు బయపడటమనే కాన్సెప్ట్ కొత్తగా ఉంది. హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది. సెకండాఫ్‌లో 40 నిమిషాలపాటు ప్రేక్షకులు బాగా నవ్వుకుంటున్నారు. దర్శకుడు మహి ఇలాంటి కాన్సెప్ట్‌లతో నన్ను కలిశాడు. కానీ ఈ చిత్రాన్ని చాలా బాగా చేశాడు. తాప్సీ ఈ సినిమాకు హీరో అని చెప్పొచ్చు. ఆమెకిది గ్రేట్ ఎచీవ్‌మెంట్. ఈ సినిమా నాకు ఇన్‌స్పిరేషన్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. 'రెస్పాన్స్ చాలా బాగుంది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని దర్శకుడు మహి తెలిపారు. తాప్సీ మాట్లాడుతూ, 'ముందు నుంచి ఇది డిఫరెంట్ చిత్రమవుతుందని చెప్పాను. ఇప్పుడదే నిజమైంది. విమర్శకులు కూడా పాజిటివ్‌గా స్పందించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. 'ఓవర్సీస్‌లో ఈ చిత్రాన్ని 85 థియేటర్స్‌లో విడుదల చేస్తున్నామంటే చాలా మంది ఫోన్ చేసి ఎందుకన్నారు. కానీ నమ్మకంతో విడుదల చేశాం. అక్కడ మంచి కలెక్షన్లు వస్తున్నాయి. సెకండాఫ్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సౌండ్ విషయంలో కూడా ఇదొక కొత్త ఎక్స్‌పీరియన్స్. సినిమాకు సపోర్ట్ చేసిన దిల్‌రాజుకు థ్యాంక్స్' అని నిర్మాత విజయ్ తెలిపారు.


ప్రతీకార నేపథ్యంలో దేవి



నదియా

నదియా ప్రధాన పాత్రధారిణిగా డి.తులసిదాస్ దర్శకత్వంలో తమిళంలో రూపొంది విశేష ప్రేక్షకాదరణ పొందిన 'తిరుక్కువరాధకాది' చిత్రాన్ని వైనవి సమర్పణలో సువర్ణ పిక్చర్స్ పతాకంపై నిర్మాత సువర్ణ 'దేవి' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత సువర్ణ మాట్లాడుతూ, 'పగ, ప్రతీకారాల నేపథ్యంలో హర్రర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రమిది. తమిళంలో విడుదలై 15కోట్లు వసూలు చేసింది. 'దృశ్యం' తర్వాత నదియా ఈ చిత్రంలో పోలీస్ పాత్రలో నటించారు. సినిమాలో ఆమె పాత్ర అద్భుతంగా ఉంటుంది. దర్శకులు తులసీదాస్ సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు. ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. కోవై సరళ, ఇనియా, ఆర్తి, సంగీత, అర్చన తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం.జి.శ్రీకుమార్, ఎడిటింగ్: కె.శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: సంజీవ్ శంకర్.

మాటల్లోనే హై'టెక్'



నివేదికలు మొత్తుకున్నా మోడీ సర్కారు కప్పిపుచ్చే ప్రయత్నం

- దేశంలో ఐటీ భవితను కుండబద్దలు కొట్టిన అసోచాం సెక్రెటరీ జనరల్
- అయినా, భేషుగ్గా ఉన్నదని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అబద్ధాలతో మోసపుచ్చే యత్నం
- జాబ్ పోర్టళ్ళకు పోటెత్తుతున్న నిరుద్యోగ దరఖాస్తులు

- కడవేర్గు

"దేశీయ ఐటీ రంగంలో ఉద్యోగ భద్రత లేదు. నాపై ఆధారపడ్డ నా కుటుంబ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే భయమేస్తోంది, అందుకు చాలా బాధపడుతున్నాను" అంటూ సూసైడ్ నోట్ రాసి పెట్టి క ష్ణా జిల్లాకు చెందిన గోపిక ష్ణా దుర్గాప్రసాద్ అనే టెకీ పూణే నగరంలో నెల రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఘటన అప్పట్లో కలకలం రేపింది. నిజమే, దేశంలో ఐటీ రంగం భవిత ఏమవబోతోందోనన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. తెల్లారితే ఉద్యోగం ఉంటుందో లేదో, ఏ నిమిషం హెచ్ ఆర్ నుంచి ఏ వార్త వినాల్సి వస్తుందోనని అయోమయ పరిస్థితి.ఇలా అభద్రతలో లక్షలాది సాఫ్ట్ వేర్ ఉద్యోగులు బతుకీడుస్తున్నారు.

ఎజెండా మరిచారు.. అందుకే ఏడేండ్ల కనిష్టం:

2014 లో అధికారంలోకి వచ్చే ముందు.. అర్హత కలిగిన భారత పౌరులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన మోడీ వర్గం ఆచరణలో మాత్రం చతికిలపడిపోయింది. భారతదేశంలోనే అతిపెద్ద ప్రయివేట్ ఉద్యోగ కల్పన రంగమైన ఐటీ సెక్టారునే తీసుకుంటే, ఈ రంగం ప్రతీ సంవత్సరం సుమారు 15,400 కోట్ల డాలర్ల రెవెన్యూ నమోదు చేస్తోంది. కాగా, తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా ఆరు లక్షల ఉద్యోగాలు ఐటీ సెక్టార్ లో సృష్టించబడ్డాయని, ఇంకా మరెన్నో అవకాశాలు రానున్నాయని కేంద్ర ఐటీశాఖ వెల్లడించిన వివరాలు వాస్తవ దూరంగా ఉన్నాయని నాస్కామ్, హెడ్ హంటర్స్ ఇండియా నిర్వహించిన అధ్యయనాలు చూస్తే తెలుస్తోంది. రానున్న కాలంలో ఐటీ కంపెనీల్లో నియామకాలు మరింత మందగించే అవకాశం ఉన్నట్టు నాస్కామ్ సర్వే తెలిపింది. 2020 వరకు ఐటీ రంగంలో యేటా ఎంతలేదన్నా సుమారు 1,75,000 -- 2,00,000 ఉద్యోగాలు కోతకు గురవనున్నట్టు హెడ్ హంటర్స్ ఇండియా సర్వే కుండబద్దలు కొట్టింది. అంతేనా, వచ్చే మూడు నాలుగు సంవత్సరాల్లో దేశంలో కోటి మంది ఉద్యోగులు రోడ్డున పడే ప్రమాదం ఉన్నదని అసోచాం సెక్రెటరీ జనరల్ డిఎస్ రావత్ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఓ సదస్సులో స్వయంగా పేర్కొనడం గమనార్హం. తాజాగా.. గత ఏడేండ్ల కాలంలో ఎదుర్కోని క్లిష్ట పరిస్థితిని.. భారత ఐటీ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్నదని అంతర్జాతీయ మీడియా సంస్థలు సైతం వ్యాఖ్యానాలతో.. కార్పొరేట్ వర్గాల్లో అలజడి మొదలైంది. ఆటోమేషన్, ఏఐ వంటి అత్యాధునిక సాంకేతికతలు భారత ఉద్యోగులపై ప్రభావం చూపడం, ఉద్యోగ ఆశావహులకు కొత్త తరహా నైపుణ్యాలను కల్పించడంలో స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా పథకాలు వెనుకబడిపోవడం, యూఎస్, బ్రెగ్జిట్, ఆస్ట్రేలియా వంటి దేశాల నిబంధనలు ఐటీ రంగం, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సర్కారు పెద్దలు నిద్రమత్తులోనే జోగుతూ సకాలంలో పరిస్థితిని అదుపులో పెట్టే చర్యలకు ఉపక్రమించకపోవడం వంటి కారణాలతో.. ఈ పరిస్థితి దాపురించిందని ఐటీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

నో జాబ్ ఇండియా

బీజేపీ పాలనలో నిరుద్యోగం మరింత ప్రబలుతుందనడానికి ఉద్యోగ పోర్టళ్ళలో రిజిస్టర్ చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా పెరగడాన్ని చూస్తే తెలుస్తోంది. ఉద్యోగార్థులకు, కంపెనీలకు మధ్య వారధిగా ఉంటూ ఉద్యోగ కల్పనకు బాటలు వేసే పేరున్న జాబ్ పోర్టళ్ళు నౌకరీ, మాన్ స్టర్ ,ఐఐఎం జాబ్స్, కెరీర్ బిల్డర్, పీపుల్ స్ట్రాంగ్, టీం లీజ్ వంటి పేరెన్నిక గల సైట్ లకు ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో వచ్చిన బయో డేటా అప్లికేషన్లు అంతకు ముందటి ఏడాదితో పోల్చి చూస్తే సగటున పాతిక శాతం పెరిగాయని సమాచారం. అంటే, భవిష్యత్ ఉద్యోగ భారతావని బీజేపీ పాలనలో నిరుద్యోగం వైపు వడివడిగా అడుగులేస్తూ.. ఉద్యోగ భారత్ కాస్తా 'నిరుద్యోగ భారత్'గా మారుతున్నట్టు స్పష్టమవుతున్నది.

రానున్న కాలంలో ఉద్యోగ నియామకాల్లో సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీ పెను సవాళ్ళను ఎదుర్కొనున్నదని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. వీటి సారాంశాలను, నిపుణుల సూచనలను పాటిస్తూ తగిన చర్యలను తీసుకోవాల్సిన బాధ్యత సర్కారుపై ఉన్నది. ఆ బాధ్యతను విస్మరించిన నాడు ప్రజలే పాలకులకు తగిన గుణపాఠాన్ని చెబుతారన్నది వాస్తవం.

భారత ఐటీ పరిశ్రమ - ఆసక్తికర అంశాలు

- సగటున 8 శాతం వృద్ధిని నమోదు చేసే భారత ఐటీ పరిశ్రమ.. ఈ యేడు కేవలం 5.3 శాతం మాత్రమే నమోదు.
- ఈ యేడు ఫిబ్రవరి -- మే మధ్య కాలంలో దేశీయ టాప్-5 ఐటీ కంపెనీల నుంచి సుమారు 56 వేల మంది ఉద్యోగులు ఉద్వాసన.
- దేశంలో యేటా సుమారు లక్ష కోట్ల ఆదాయానికి మూల వనరుగా నిలుస్తున్న ఐటీ పరిశ్రమ .

సాగుపై సోయేదీ!

(మొదటిపేజీ తరువాయి)

అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో)లతోపాటు 112 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)లు పని చేస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వం భర్తీ చేయబోయే 1000 మంది ఏఈవో లను కలుపుకుంటే మొత్తం 2112 మంది అవుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న ప్రతి ఐదు వేల ఎకరాలు (2వేల హెక్టార్లు)లకు ఒక ఏఈవో ప్రకారం పని చేసినా కోటీ 5 లక్షల 60వేల ఎకరాలకే సరిపోతారు. మన రాష్ట్రంలో కోటి 63 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే ప్రస్తుతం కోటి 33 లక్షల ఎకరాలు సాగుకు యోగ్యంగా ఉంది. 30లక్షల ఎకరాలు బీడు భూమిగా ఉంది. సాగవుతున్న భూమికి సరిపడే విధంగా ఏఈవోలను విస్తరించాలంటే ఇప్పుడున్న ఏఈవోలను రెండింతలకు పెంచాల్సి ఉంటుంది. అంటే 4వేల మందికిపైగా అధికారులు కావాలి. ఉన్న అధికారులూ గ్రామాల్లోకి వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. రైతులకు ఏ పంటకు ఏ మందు, ఎంత మోతాదులో వేయాలి? ఎప్పుడెప్పుడు వేయాలి అనే సమాచారం ఇచ్చే నాధుడే లేకుండా పోయారు. వ్యవసాయ శాఖలో జాతీయ వ్యవసాయ విస్తరణ, సాంకేతిక మిషన్‌తోపాటు మొత్తం ఐదు పథకాలు అమల్లో ఉన్నాయి. జాతీయ ఆహార భద్రత కమిషన్, జాతీయ నూనె గింజలు, ఆయిల్‌పామ్ మిషన్, జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) అనే పథకాలున్నాయి. ఇందులో ప్రధానంగా జాతీయ వ్యవసాయ విస్తరణ, సాంకేతిక మిషన్ అనే పథకం పూర్తిగా కుంటు పడింది. విత్తనాల పరిశోధన అనేది ఈ రోజు వరకు కూడా బౌహుళజాతి సంస్థల చేతుల్లోనే ఉంది. దీంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందకపోవడం వల్ల ఏటా 5 లక్షల ఎకరాల్లో పంట దిగుబడులు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు విత్తనాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.ఆయిల్‌పామ్ మిషన్ పథకం రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మాత్రమే పని చేస్తుంది. ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలేమీ లేవు. తెలుస్తోంది. మొత్తం 31 జిల్లాలకు గాను 10 జిల్లాల్లో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ) అధికారులే లేరు. అటెండరు నుంచి అధికారి వరకు 1800 పోస్టులు ఖాళీలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశీలించినట్టయితే 2015-16లో 110 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ఉత్పత్తి అయింది కేవలం 48.62లక్షల టన్నులే. అదే విధంగా 2016-17లోనూ 110 లక్షల టన్నులు ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుని సాధించింది 92 లక్షల టన్నుల మాత్రమే. వీటితోపాటు నూనెగింజలు, చిరుధాన్యాలు కూడా దెబ్బతిన్నాయి. బడ్జెట్ ప్రకారంగా పరిశీలించినా, ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ నుంచి మొదలుకొని జయతీఘోష్ కమిషన్ వరకు చేసిన సిఫారసుల మేరకు 2500 ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)ను నియమించాలని చెప్పాయి. ఈ సిఫారసులను ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు టీడీపీ కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కానీ, తెలంగాణలో ప్రస్తుతం ఉన్న టీఆర్ఎస్ కానీ అమలు చేయడం లేదని స్పష్టమవుతుంది. విలేజ్ లెవల్ వర్కర్ (వీఎల్‌డబ్ల్యూ), విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (వీడీఓ) అనే వ్యవస్థ ఉండేది. టీడీపీ హయాంలో ఈ వ్యవస్థను రద్దు చేసి మండల పరిషత్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీఈవో)లను ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవస్థను రద్దు చేసి ఆదర్శ రైతులను ప్రవేశపెట్టింది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదర్శ రైతులను తొలగించి ఏఈవోలను భర్తీ చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వాలు మారినప్పుడలా పథకాలను మార్చడం వల్ల పాలకులకు ప్రయోజం కలుగుతుందేమో కానీ రైతులకు ఒరిగేదేమీ లేకపోగా నష్టాల పాలవుతున్నారని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు.

రైతు దృష్టి మళ్లించేందుకే...భూసర్వే : జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు సమస్యలను దృష్టి మళ్లించడానికే ప్రభుత్వం సమగ్ర భూసర్వే చేపడుతోందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి విమర్శించారు. భూసర్వే సమగ్ర కుటుంబ సర్వేలాంటిదని చెప్పారు. మండలానికి ఒక సర్వేయర్ కూడా లేడని, భూసర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. ఈ ఖరీఫ్ నుండి రైతులకు నాలుగువేలు ఇస్తామని ప్రకటించి, ఇప్పటికి చెల్లించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. బ్యాంకర్ల సమావేశం నిర్వహించకుండా రైతులకు రుణాలు ఎలా అందుతాయో సీఎం చెప్పాలన్నారు. పెట్టుబడి రాయితీ కాదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాలేదని, రైతులపై వడ్డీ భారం పడుతుందని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ ఇచ్చిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు ఉత్తమ రైతు అవార్డు

- ముఖ్యమంత్రికి అగ్రికల్చర్ లీడర్ షిప్ -2017 అవార్డు
- ఎంపిక చేసిన స్వామినాథన్ ఆధ్వర్యంలోని కమిటీ
- సీఎం కార్యాలయ ప్రకటనలో వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అరుదైన పురస్కారం లభించింది. భారత ఆహార వ్యవసాయ సలహా మండలి ప్రతిష్టాత్మక అగ్రికల్చర్ లీడర్‌షిప్-2017 అవార్డుకు కేసీ ఆర్ పేరును ప్రతిపాదించింది. పాలసీ లీడర్‌షిప్ కేటగిరి కింద కేసీఆర్‌కు ఈ అవార్డు వరించింది. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆధ్వర్యంలోని కమి టీ కేసీ ఆర్‌ను ఎంపిక చేసింది. ఈ అవార్డును సెప్టెంబర్ ఐదున రాత్రి 7.30 గంట లకు న్యూఢిల్లీలోని తాజ్‌ప్యాలెస్‌లో భారత ఆహార, వ్యవసాయ మండలి కేసీఆర్‌కు అంద జే యనుంది. లక్షలాది మంది వ్యవసాయదారుల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తు న్న ందుకు ఈ అవార్డును ఇస్తున్నట్టు భారత ఆహార, వ్యవసాయ మండలి తెలిపిం ది. 2008 నుంచి ఈ అవార్డులను అందజేస్తున్నామని పేర్కొంది. దీనికి సంబంధించి శనివారం సాయంత్రం ఈ ప్రకటనను ముఖ్యమంత్రి మీడియా కార్యాలయం విడుదల చేసింది.

కేసీఆర్‌కు పలువురి అభినందనలు

భారత ఆహార వ్యవసాయ మండలి నుంచి అరుదైన గౌరవం లభించిం దినం దుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన కషికి, కష్టానికి లభించిన గుర్తింపుగా కీర్తించారు. భూమి పుత్రుడికి లభించిన అవార్డుగా భావించాలని అన్నారు. ఇది తెలంగాణా రాష్ట్రానికి ఎంతో గర్వ కారణ మన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాఠశాల కోసం ఘెరావ్

బడి తెరిచేవరకు కదలనివ్వబోమన్న విద్యార్థులు

- రేపటి నుంచి ఉపాధ్యాయులను పంపిస్తాం.. : డీఈవో
- న్యాయవిజ్ఞాన సదస్సు కేంద్రంగా సమస్య కొలిక్కి



నవతెలంగాణ - పెద్దపల్లి రూరల్

"ఎలా మూసేస్తారు.. మా బడి మాగ్గావాలే.. బడి తెరిచేవరకూ అధికారులకు ఇక్కడి నుంచి కదలనిచ్చేది లేదు" అంటూ భీష్మించిన పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లి విద్యార్థుల సంకల్పం నెరవేరింది. పెద్దపల్లి న్యాయవిజ్ఞాన సదస్సు కేంద్రంగా సమస్య పరిష్కారమైంది. నెలరోజులపాటు విద్యార్థులు, నాయకులు, గ్రామస్తులు తలపెట్టిన నిరసన కార్యక్రమాలు శనివారంతో ఫలించాయి.

పెద్దపల్లిలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా పెద్దపల్లి మున్సిఫ్ కోర్టు జడ్జి పట్టాభిరామయ్య హాజరయ్యారు. పెద్దపల్లి ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్. ప్రభాకర్‌రావు, అధికారులు సమావేశానికి ఏర్పాట్లు చేయగా.. గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు 'మా బడిని తెరిపించాలే' అంటూ నిరసన చేపట్టారు. డీఈవో వాహనాన్ని రెండు గంటలపాటు అడ్డుకున్నారు. ఈ క్రమంలో డీఈవోకు విద్యార్థి నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంఈవోను సస్పెండ్ చేసి పాఠశాల తెరిపించాలని డిమాండ్ చేయగా.. బ్రాహ్మణపల్లి పాఠశాలను మూసేసి అర్బన్ పాఠశాలగా మారుస్తామని డీఈవో తెలిపారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల తెరిపించే వరకూ ఇక్కడి నుంచి ఒక్క అధికారిని కూడా వెళ్లనివ్వబోమని విద్యార్థులు భీష్మించుకూర్చున్నారు. సీనియర్ సివిల్ జడ్జి పట్టాభిరామారావు నచ్చజెప్పాలని చూసినా వారు వినలేదు. గ్రామస్తులతో సుమారు రెండు గంటలపాటు జిల్లా విద్యాధికారి చర్చలు జరిపారు. అయినా, పాఠశాలను తక్షణమే ప్రారంభించకపోతే అధికారులను కదలనిచ్చేది లేదని హెచ్చరించారు. దాంతో డీఈవో కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. చివరకు డీఈవో మాట్లాడుతూ.. రేపటి నుంచి ప్రధానోపాధ్యాయుడిని పంపిస్తానని హామీ ఇచ్చారు. మిగతా టీచర్లను త్వరలోనే డిప్యూటేషన్‌పై రప్పిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్, కార్యదర్శి బత్తిని సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ బాలసాని లెనిన్, రాజశేఖర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో స్వేచ్ఛ కరువు

(మొదటిపేజీ తరువాయి)

వెళుతుంటే అడ్డుకుంటూ హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో 'సభలు, సమావేశాలు జరుపుకునే హక్కు-ప్రభుత్వ ఆంక్షలు' పేరిట రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా భారతదేశ స్వాతంత్ర్య అనంతరం ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగానికి లోబడి తెలంగాణ బతుకుతుండటం చాలా సిగ్గుచేటుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అప్రజాస్వామ్యిక ధోరణి కొనసాగడం బాధగా ఉందన్నారు. జేఏసీ నేతలం నిజామాబాద్‌కు వెళు తుంటే ఓ బందిపోటు దొంగను బంధించడానికి వచ్చినట్టుగా పోలీసులు తమను చుట్టుముట్టి ప్రజాస్వామ్య హక్కులను ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య దేశంలో హక్కులను కాలరాస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని సంఘాల ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సెక్షన్ 30, 4,151ల ఆంక్షలను తెలియకుండా పోలీసులు ప్రవర్తిస్తుండటం సిగ్గుచేటన్నారు. సెక్షన్ 144లో ప్రజలకు అన్ని హక్కులు ఉంటాయని తెలియని, ప్రభుత్వ పిలుపు మేరకు పోలీసులు ప్రజా సంఘాల నాయకులను కట్టడి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అప్రజాస్వామిక ధోరణికి వ్యతిరేకంగా ఎలాగైతే ధర్నాచౌక్ పరిరక్షణకు అన్ని సంఘాలు సంఘటిత మ్యాయో ప్రభుత్వం చేపడుతున్న సెక్షన్ల దుర్వి నియోగానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు న్యాయపరంగా పోరాటాన్ని దేశవ్యాప్తం చేస్తూ రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రధానంశంగా తీసుకుని ప్రశ్నించాలని ఆయన ప్రజా ప్రతినిధులను కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి అనుగుణంగా ప్రవర్తించడం అమానుశమని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీ నేతలకు ఓ విధంగా, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలకు ఇంకో విధంగా ద్వంద వైఖరిని ప్రవర్తిస్తుం డం ఏమిటని ప్రశ్నించారు.ఈ సమావేశంలో కాం గ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, టీజేఏసీ సమన్వ యకర్త ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ విశ్వేశ్వ ర్‌రావు, న్యాయవాదలు రచనారెడ్డి, న్యూడెమోక్రసి నేత గోవర్ధన్‌తో పాటు పలు పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాఖల వారీగా వివరాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేశారు..? ఎప్పుడు భర్తీ చేశారనే విషయాలపై సదరు యాజమాన్యానికే సమాచారం లేకపోవటాన్నిబట్టి సీఎం మాటల్లోని డొల్లతనం బట్టబయలైందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీకోసం నిరంతరం పోరాడే కార్మికసంఘాలు, నిరుద్యోగులకు కూడా సీఎం మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయని తెలిపారు. దీన్నిబట్టి ముఖ్యమంత్రి లెక్కలు తప్పుల తడకలనే విషయం తేలిందని పేర్కొన్నారు. మరోవైపు ఉద్యోగాల భర్తీకోసం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు కూడా అనేక న్యాయ వివాదాల్లో చిక్కుకోవటంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వం యువతలో భ్రమలు కల్పిస్తున్నదనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయని వివరించారు. ఉద్యోగ నియామకాల క్యాలెండర్‌ను ప్రభుత్వం ప్రకటించకపోవడంతో కోచింగ్ సెంటర్లు వ్యాపార కేంద్రాలు గా మారి నిరుద్యోగులను దోచుకుంటున్నాయని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి న్యాయ వివాదాలకు అవకాశం లేకుండా శాఖల వారీగా ఉన్న ఖాళీలు, భర్తీకి సంబంధించిన వివరాలతో కూడిన ఉద్యోగుల క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాశ్మీర్ సమస్యపై మోడీకి చిత్తశుద్ధి లేదు

(మొదటిపేజీ తరువాయి)

దశల వారీగా చేపట్టనున్న చర్యలను హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆ సంద ర్భంగా ప్రకటిం చారని..అయితే, వాటిని అమలు చేయ డంలో విఫలమయ్యారని ఏచూరి గుర్తు చేశారు. కాశ్మీర్ ప్రజల్లో విశ్వాసం పాదు గొలిపే చర్యలు చేపట్టనున్నట్టు కేంద్రం హామీ ఇచ్చిందని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిందని ఏచూరి అన్నారు. ఏమీ చేయకుండా ప్రకటనలు ఇస్తే సరిపోదని ఏచూరి విమర్శించారు.

ఆదాయ పన్ను చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఏచూరి డిమాండ్ చేశారు. జీఎస్టీని అమలులోకి తెచ్చిన తర్వాత కొత్తగా ఆదాయం పన్ను రిటర్న్‌ 56 లక్షల వరకూ వచ్చాయని ప్రధాని చెప్పగా, ఆర్థికమంత్రి ఆ సంఖ్యను 91 లక్షలుగా పేర్కొన్నారని ఏచూరి గుర్తు చేశారు. మరోవైపు అధికారిక ప్రకటనలో ఆ సంఖ్య 31 లక్షలుగా, ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు 5 లక్షలుగా చెప్పారని ఏచూరి తెలిపారు. ఈ అయోమయాన్ని తొలగించేందుకు కేంద్రం స్పష్టత ఇవ్వాలని ఏచూరి అన్నారు.

జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ప్రజల బాధలు మరింత పెరిగాయని ఏచూరి అన్నారు. చౌక దుకాణాల్లో లబ్దిదారులకు చక్కెర, కిరోసిన్ అందటంలేదని ఆయన తెలిపారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు తాము ప్రకటించిన విధంగా రుణాలు మాఫీ చేయకపోవడంతో ఆ రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఏచూరి తెలిపారు. పంటల ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర ఇస్తామంటూ ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు పరచాలని ఏచూరి డిమాండ్ చేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత జమైన మొత్తం ఎంతో రిజర్వ్‌బ్యాంక్ చెప్పలేకపోతోందని ఏచూరి అన్నారు. నోట్లరద్దు సమయంలో నల్లడబ్బు అంతా తెలుపు చేసుకున్నట్టు అర్థమవుతున్నదని ఏచూరి అన్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల నిధులపై నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలు పార్టీలకు ఇచ్చిన మొత్తం రూ.900 కోట్లలో అధిక భాగం బీజేపీకే(రూ.705 కోట్లు) దక్కిందని, రెండో స్థానంలో కాంగ్రెస్(రూ.198 కోట్లు) ఉన్నట్టు వెల్లడైన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. సీపీఐ, సీపీఐ(ఎం)కు కార్పొరేట్ల నుంచి అందింది కేవలం రూ.2 కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. కార్పొరేట్ సామాజిక నిధి(సీఎస్‌ఆర్) కోసం చట్టం తేవాలని ఏచూరి డిమాండ్ చేశారు. ఆ నిధిని ప్రజాస్వామ్య నిధిగా భావించాలని ఆయన సూచించారు.

ఎన్నికల కమిషన్ ద్వారా పార్టీలకు ఎన్నికల ఖర్చులు ఇవ్వాలని ఆయన అన్నారు. కొన్ని పార్టీలు ఎన్నికల్లో పెద్దమొత్తంలో ఖర్చు చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను నీరుగారుస్తున్నాయని ఏచూరి విమర్శించారు. కార్పొరేట్ సంస్థలు తాము కోరుకున్న పార్టీని అధికారంలోకి తేవడానికి పెట్టుబడులు పెడ్తూ, ఆ తర్వాత వాటిని రాబట్టుకుంటున్నాయని ఏచూరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, విదేశాంగ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 15 రోజులపాటు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఏచూరి తెలిపారు.

సూరత్ నుంచి బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-సిరిసిల్ల

సిరిసిల్లలో పూర్తిస్థాయిలో బతుకమ్మ చీరల ఉత్పత్తి లేనందున మిగతా వాటిని సూరత్ నుంచి తెప్పిస్తున్నామని చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ చెప్పారు. మరమగ్గాల పారిశ్రామికులు ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాలిస్టర్ భవన్‌లో చేనేత జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు అశోక్ రావు అధ్యక్షతన శనివారం వస్త్ర పారిశ్రామికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌వీఎం, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చినట్టు తెలిపారు. పనిలో మెరుగైన ఫలితా లున్నాయని, బతుకమ్మ చీరల ఆర్డర్ సకాలంలో పూర్తిచే యాలని సూచించారు. పెండింగ్ బిల్లులు సకాలంలో అందేలా చూస్తామని పలువురు పారిశ్రామికులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పా రు. బతుకమ్మ చీరలకు సంబంధించి సిరిసిల్లలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి లేనందున సూరత్ నుంచి మిగిలిన వాటిని తెప్పిస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మరిన్ని ఆర్డర్లు అందిస్తుందని చెప్పారు. అనంతరం టెస్కో ఎమ్‌డి యాదగిరి మా ట్లాడుతూ.. వస్త్ర ఉత్పత్తిదారులు కేవలం ప్రభుత్వం అందించే ఆర్డర్లపైనే ఆధారపడకుండా ప్రస్తుత పోటీ ప్రపంచంలో నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తూ మార్కెటింగ్ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. టెస్కో ద్వారా ఎప్పటికప్పుడూ అవసరమైన సహాయం అందిస్తామని చెప్పారు. సమావేశంలో జేఈ పూర్ణచందర్‌రావు, ఆర్‌డీడీ నారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జిందం చక్రపాణి, పాలిస్టర్ యజమానుల సంఘం నాయకులు గోవింద్ రవి, బొద్దుల సుదర్శన్, మండల సత్యం, బూట్ల నవీన్, అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన ఉత్కల్

(మొదటిపేజీ తరువాయి)

మంది మృతి చెందారు. మరో 72 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ముజఫర్‌నగర్‌లోని ఖతౌలి వద్ద శనివారం సాయంత్రం 5.50 గంటలకు రైలులోని 14 బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదంలో బోగీలు ఒకదానిపై ఒకటి పడడంతో పాటు పక్కనే ఉన్న ఇండ్ల మీదికి దూసుకెళ్లాయి. దీంతో కొందరు స్థానికులకు కూడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రైల్వే, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. కాగా పలు రైళ్లను దారి మళ్లించారు.

పలువురు దిగ్భ్రాంతి

ప్రమాదంపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్.. అధికారులను ఆదేశించారు. మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. రైలు ప్రమాద ఘటన దురదృష్టకరమని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విచారణకు ఆదేశించిన రైల్వే మంత్రి

రైలు దుర్ఘటనపై రైల్వేశాఖ మంత్రి సురేశ్ ప్రభు.. విచారణకు ఆదేశించారు. ఘటనా ప్రాంతానికి రైల్వే శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హాను పంపిస్తున్నట్టు చెప్పారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని రైల్వే బోర్డు చైర్మెన్‌కు ఆదే శాలిచ్చినట్టు వివరించారు. మృతుల కుటుంబాలకు రూ.3.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు, స్వల్ప గాయాలైన వారికి రూ.25 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా అందించనున్నట్టు ఒడిషా సీఎం నవీన్ పట్నాయక్ వెల్లడించారు.

'ఉగ్ర' కుట్రేనా?

రైలు దుర్ఘటన వెనుక ఉగ్రవాద కుట్ర దాగి ఉన్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాద స్థలంలో రైల్వే ట్రాక్ విరిగి ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) బృందం ఘటనా స్థలికి చేరుకొని పరిశీలన చేపట్టింది. గతేడాది నవంబర్ 20న యూపీలోని కాన్పూర్‌లో ఇండోర్-పాట్నా రైలు 14 బోగీలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో దాదాపు 150 మంది చనిపోయారు.

విస్తారంగా వర్షాలు... పొంగుతున్న వాగులు

(మొదటిపేజీ తరువాయి)



తాలిపేరు, వైరా, కిన్నెరసాని, తదితర ప్రాజెక్టుల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతున్నది.

ఖమ్మం జిల్లాలో మూడురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షానికి వాగులు వంకలు పొంగుతున్నాయి. మధిర నియోజకవర్గంలోని జాలిముడి ప్రాజెక్టుకు ఎన్నడూ లేని విధంగా భారీగా వరద నీరు వస్తోంది. వైరా, కట్లేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మున్నేరు గోదావరిని తలపించేలా పరవళ్లు తొక్కుతున్నది. పాలేరు రిజర్వాయర్‌లోకి 2260 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వచ్చిచేరుతోంది.

భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి 11 గేట్లు ఎత్తి 42 వేల క్యూసెక్కుల నీటిని, కిన్నెరసాని ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ములకలపల్లి మూక మామిడి ప్రాజెక్టుకు భారీగా నీరు వచ్చి చేరుతున్నది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం, మణు గూరు, ఇల్లందు ప్రాంతాల్లోని ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గోదావరికి గంటగంటకూ వరదనీరు పెరుగుతోంది. 18 అడుగుల మేర ప్రవహిస్తున్నది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోవిం దరావుపేట మండలం పస్రా పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై సలొర్రె ఉధృతంగా ప్రవహిస్తున్నది. దయ్యాల వాగు బ్రిడ్జి నిర్మాణ పనులతో తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో తాడ్వాయి, గంగారం, ఏటూరునాగారం, కన్నాయి గూడెం, వాజేడు, వెంకటాపురం, మంగపేట, భద్రాచలం వెళ్లాల్సిన ప్రయాణికులు అనేక ఇబ్బం దులు పడ్డారు. ములుగు మండలంలోని రాయినిగూడెం, దుబ్బగూడెం మధ్యలో గల ప్రధాన రహదారి కల్వర్టు తెగిపోయింది. రాయినిగూడెం వద్ద కానిస్టేబుల్ వాగు మధ్యలో చిక్కుకుపోయాడు. జంగవోని వాగు మధ్యలో రైతు కూలీలు చిక్కుకుపోయారు. వీరు స్థానికుల సహాయంతో క్షేమంగా బయటపడ్డారు. బొగ్గుల వాగు రోడ్డుపై ఆరడుగుల ఎత్తులో ప్రవహిస్తుండటంతో పంట పొలాలు దెబ్బతినడమే కాకుండా పలు గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. జగ్గన్నపేట వాగు పొంగిపొర్లుతున్నది. ములుగు మండలంలో పానేస వద్ద వరద ఉధృతి పెరిగి కల్వర్టుపై నాలుగు అడు గుల ఎత్తులో వరద ప్రవహించడంతో ఒక ద్విచ క్రవాహనం కొట్టుకుపోయింది. మహబూ బాబాద్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలైన ధర్మన్నపేట, రామ న్నపేట కాలనీలను కలెక్టర్ ప్రీతిమీనా సంద ర్శిం చారు. ధర్మన్నపేటలోని కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీచేశారు. అప్రమత్తంగా ఉం డాలని సిబ్బందికి సూచించారు. బయ్యారం పెద్ద చెరువు మళ్లీ అలుగు పోస్తోంది. గార్ల చెరువు నిండింది.

కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి చెరువులను తలపించాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. మండలంలోని హస్నాపూర్ సమీపంలో గల చాందూరి వాగుతోపాటు నాగాపూర్, బీర్సాయిపేట్, నర్సాపూర్, దంతన్‌పల్లి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి.

జనం ఇండ్లకే పరిమితమయ్యారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్,జండా చౌరస్తా, అమర్‌నగర్, అయ్యప్ప టెంపుల్, ఉదయ్ నగర్ తదితర కాలనీల్లో మురుగు నీరు మోకాలులోతు వరకు ప్రవహించింది.

జగిత్యాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల సంబంధిత వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారమందించాలంటూ అధికారులు ఆదేశించారు. నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల్లో కూడా వర్షం కురిసింది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ముసురు పడుతున్నది.

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
▼271 31,525	▼67 9,837	64.14	రూ. 29,689	రూ. 42,200

శుక్రవారం మార్కెట్లు ముగింపునాటికి





కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



ఎస్‌బీఐకి 'కనీసం' 235 కోట్ల ఆదాయం

ఇండోర్: కనీస నగదు నిల్వల నిబంధనలు పాటించని వారి ఖాతాల నుంచి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీ మొత్తంలో జరిమానాను వసూలు చేసింది. నెలవారీ కనీస నిల్వల నిబంధనను పాటించని ఖాతాలపై విధించిన చార్జీలతో ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) రూ.235.06 కోట్ల ఆదాయాన్ని జరిమానా పేరుతో రాబట్టింది. దాదాపు 388.74 లక్షల అకౌంట్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేసినట్టు ఎస్‌బీఐ పేర్కొంది. సమాచార హక్కు చట్టం ద్వారా నీముచ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌడ్ దాఖలు చేసిన దరఖాస్తుకు, ఎస్‌బీఐ ఈ మేరకు సమాధానమిచ్చింది. ముంబైకు చెందిన బ్యాంకు ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఈ సమాచారాన్ని అందించారని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

మొరాయించిన జీఎస్టీ నెట్‌వర్క్!

రిటర్నుల దాఖలునకు గడువు పెంచిన సర్కారు



న్యూఢిల్లీ: వర్తకులకు ప్రభుత్వం కాస్త వెసులుబాటును కల్పించింది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఫైలింగ్‌లో వర్తకులు సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ-ఫైలింగ్ గడువును మరో అయిదు రోజుల పాటు పొడిగిస్తున్నట్టుగా ప్రకటించింది.ముందుగా ప్రకటించినట్టుగా ఆఖరి తేదీ నేటితో (ఆగస్టు 20తో) ముగియనుంది. దీనిని తాజాగా ఆగస్టు 25 వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. పన్ను చెల్లింపులకు కూడా చివరి తేదీ ఆగస్టు 25 అని సర్కారు పేర్కొంది. రిటర్నులకు చివరి తేది దగ్గర పడుతున్న నేపథ్యంలో జీఎస్టీ ఫైలింగ్ వెబ్‌సైట్ శనివారం మొరాయించింది. కొంత సమయం పనిచేయడం ఆగిపోయింది. దీంతో వర్తకులు ఆందోళనకు గురయ్యారు. వారి ఆందోళనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం జీఎస్టీ రిటర్నుల గడువులను పెంచుతున్నట్టుగా ప్రకటిచడం విశేషం.

అదనపు మూలధనంతో ఆదుకోవాలి




ముంబయి: బ్యాంకింగ్ రంగంలో అంతకంతకు పెరుగుతున్న మొండి బాకీల విషయమై భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఎన్‌పీలను ఎదుర్కొంటూ నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరింత మూలధనం అందించాల్సిన అవసరముందని ఉర్జిత్ అభిప్రాయపడ్డారు. శనివారం ముంబయిలో సీఐఐ ఏర్పాటు చేసిన 'ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ' జాతీయ సదస్సులో ఉర్జిత్ పాల్గొని ప్రసంగించారు. మొండి బాకీల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకులు మార్కెట్ నుంచి నిధులను సమీకరించడం, ప్రభుత్వం బ్యాంకుల్లో తమ వాటాను తగ్గించడంతో పాటు.. పలు రంగాల్లో అదనపు మూలధనాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బాకీలు 9.6 శాతానికి చేరడం ఆమోదయోగ్యం కాదన్నారు. గత కొన్ని ఏండ్లుగా మొండి బాకీలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. దాదాపుగా చాలా ప్రభుత్వ రంగ బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు ఆరోగ్యకరంగా లేవన్నారు.

ఇన్ఫోసిస్ బైబ్యాక్‌కు ఆమోదం

రూ.13,000 కోట్ల విలువైన షేర్లు వెనక్కి..

- 25 శాతం ప్రీమియంతో కొనుగోలు
- షేరు ఒక్కింటికి రూ.1,150 చెల్లింపునకు 'సై'
- ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చిన బోర్డు బంపర్ ఆఫర్



బెంగళూరు: విశాల్ సిక్కా రాజీనామాతో భారీగా నష్టపోయిన మదుపరులకు 24 గంటలు కూడా గడవక ముందే బోర్డు తీపి కబురును అందించింది. సంస్థలో అనిశ్చిత పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ షేర్ల బైబ్యాక్ విషయంలో ముందుకే సాగాలని నిర్ణయించింది. శనివారం జరిగిన సమావేశంలో ఇన్ఫోసిస్ బోర్డు రూ.13,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ఆఫర్‌కు పచ్చజెండా ఊపింది. షేరు ఒక్కింటికి రూ.1,150 చొప్పున ధర చెల్లించి బైబ్యాక్ చేపట్టనున్నట్టుగా కంపెనీ తెలిపింది. సిక్కా రాజీనామా నేపథ్యంలో ఇన్ఫీ షేరు ధర శుక్రవారం రూ.932 వద్ద ముగిసింది. ముగింపు ధరతో పోలిస్తే ఇప్పుడు సంస్థ ప్రకటించిన బైబ్యాక్ ధరను పోలిస్తే దాదాపు 25శాతం ప్రీమియంతో షేర్లను తిరిగి కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నట్టుగా కంపెనీ తెలిపింది. సీఈవో, ఎండీ పదవులకు విశాల్ సిక్కా రాజీనామా చేసిన మరుసటి రోజే ఈ నిర్ణయం తీసుకోవడాన్ని బట్టి ఆ సంస్థలో ఆర్థిక క్రమశిక్షణ ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రతిపాదిత బైబ్యాక్ ఆఫర్ ద్వారా ఇన్ఫోసిస్ 11.3 కోట్ల షేర్లను (4.92 శాతం ఈక్విటీ షేర్లను) తిరిగి కొనుగోలు చేయనుంది. షేరు రూ.1,150వద్ద టెండర్ మార్గంలో 11,30,43,478 కోట్ల షేర్లను కొనుగోలు చేస్తామని ఇన్ఫోసిస్ బీఎస్‌ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. ఇందుకుగాను బోర్డు ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

36 ఏండ్ల చరిత్రలో తొలిసారిగా...

36 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇన్ఫోసిస్ తన చరిత్రలోనే తొలిసారిగా బైబ్యాక్ ఆఫర్‌కు రానుంది. సంస్థ వద్ద అధికంగా నిధులు ఉండటంతో డివిడెండ్ లేదా బైబ్యాక్ చేయాలని కంపెనీ వ్యవస్థాపకులు, మాజీ ఎగ్జిక్యూటివ్ అధికారులు తీవ్ర ఒత్తిడిని తీసుకురావడంతో కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏప్రిల్‌లోనే ఈ బైబ్యాక్ ఆఫర్ ప్రతిపాదన తెర పైకి వచ్చింది. బైబ్యాక్ వల్ల మదుపర్ల షేరు వారి ఆర్జన పెరగనుంది. అదే విధంగా వాటాదార్లకు కంపెనీ వద్ద ఉన్న అదనపు నగదు ఇవ్వడానికి వీలువుతుంది. 2017 జూన్ 30 నాటికి ఇన్ఫోసిస్ వద్ద రూ.39,335 కోట్ల విలువ చేసే నగదు, నగదు సమానమైన ఇతర పెట్టుబడులు ఉన్నాయి. ఇన్ఫీ కంటే ముందే టీసీఎస్ రూ.16వేల కోట్ల మెగా బైబ్యాక్‌ను చేపట్టింది. విప్రో రూ.2500 కోట్లతో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ.3,500కోట్లతో బైబ్యాక్‌ను చేపట్టి మార్కెట్లో మంచి విలువను పెంచుకున్నాయి.

తాజా పరిణామాలపై ఎల్ఐసీ ఆందోళన

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్‌లో లుకలుకపై ఆ సంస్థలో అతిపెద్ద దేశీయ సంస్థాగత మదుపరి (డీఐఐ) భారతీయ జీవిత బీమా విస్మయం వ్యక్తం చేసింది. సంస్థలోని పరిణామాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. శుక్రవారం జరిగిన పరిణామానికి మదుపర్లు రూ.30,000 కోట్ల మేర నష్టపోయిన విషయం తెలిసిందే. ఇందులో ఎల్ఐసీ భారీగా నష్టపోయింది. దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఎల్ఐసీకి 7.03 శాతం వాటా ఉంది. అయినా బైబ్యాక్ టెండర్‌లో అన్ని షేర్లను వెనక్కి తీసుకునే ఉద్దేశ్యం లేదని పేర్కొంది. పాక్షికంగా కొన్ని షేర్లను వెనక్కి తీసుకునే అవకాశం ఉందని ఎల్ఐసీ ఉన్నతాధికారి ఒక్కరు తెలిపారు.

సిక్కా స్థానానికి రేసులో నలుగురు..



ప్రవీణ్ రావు | రంగనాథ్ | రవి కుమార్ | మోహిత్ జోషి

ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ పదవి నుంచి విశాల్ సిక్కా అనుహ్యంగా వైదొలగడంతో పోస్టుకు సంస్థలోని పలువురు సీనియర్ల పేర్లు వినబడుతున్నాయి. ఐటిలో ప్రస్తుతం నెలకొన్న సవాళ్ల నేపథ్యంలో ఇన్ఫీకి అత్యంత సమర్థుడైన సీఈవో, ఎండీ అవసరం చాలా ఉంది. ఈ పోస్టుకు ఎవరు సమర్థులు అనే దానిపై ఆ కంపెనీ వ్యవస్థాపకులు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తర్జన భర్జన పడుతున్నారు. కాగా ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లోనే పని చేస్తున్న నలుగురు పేర్లు పరిశీలనకు వస్తున్నాయని తెలుస్తోంది. ఈ నలుగురులోంచే ఒక్కరు ఇన్ఫీ పగ్గాలు చేపట్టొచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పోటీలో ప్రస్తుత తాత్కాలిక సీఈవో ప్రవీణ్ రావు, సీఎఫ్‌వో రంగనాథ్ డి మవినకెరె, ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ సీవోవో రవి కుమార్ ఎస్, బీఎఫ్ఎస్ఐ అధినేత మోహిత్ జోషి ఉన్నారు.


ఎవరి ప్రత్యేకత వారిదే...

సీఈవో రేసులో ఉన్న నలుగురిలో ఎవరికి వారే ప్రత్యేక విశిష్టత, ప్రతిభ, నైపుణ్యం కలిగి ఉన్నారు. కొన్ని ఏళ్లుగా ఇన్ఫోసిస్‌లో కీలక బాధ్యతల్లో పని చేస్తూ కంపెనీని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో వారి పాత్ర కీలంగా ఉంది. తాత్కాలిక సీఈవోగా వ్యవహరిస్తోన్న ప్రవీణ్ రావు 30 సంవత్సరాల నుంచి ఇన్ఫోసిస్‌లో సేవలు అందిస్తున్నారు. 1986లో ఈ కంపెనీలో చేరిన ఆయన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ హెడ్ వంటి కీలక బాధ్యతలను పోశించిన విశేష అనుభవం ఉంది. సీఎఫ్‌వో గా ఉన్న రంగనాథ్ 15 సంవత్సరాల నుంచి ఇన్ఫీలో పని చేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఫైనాన్స్, విలీనాలు, కొనుగోళ్లు, కార్పొరేట్ ప్లానింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను నెరవేర్చుతున్నారు. డిప్యూటీ సీవోవో గా ఉన్న రవి కుమార్ కూడా ప్రపంచ మార్కెట్లో ఇన్ఫోసిస్ విస్తరణలో అత్యంత బాధ్యతయుతంగా పని చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. బీఎఫ్ఎస్ఐ హెడ్ జోషి కంపెనీ విక్రయ కార్యకలాపాల బాధ్యతలు చూస్తున్నారు. పరిశ్రమలో నెలకొన్న ప్రస్తుత పరిణామాలు, వీసాల విషయంలో ఇతర దేశాలు తీసుకొస్తున్న కఠినతరమైన నిబంధనలు నూతన సారథికి అతిపెద్ద సవాళ్లుగా నిలువబోతున్నాయి. బయట వ్యక్తిని మాత్రం ఇన్ఫీ సీఈవోగా తీసుకురారని కూడా తెలుస్తోంది.

దావాకు సిద్ధమవుతున్నాం..!

- వాటాదారుల నష్టాల్ని క్లయిమ్ చేస్తాం : అమెరికా న్యాయ సంస్థల హెచ్చరికలు

న్యూఢిల్లీ: భారత ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌కు మరిన్ని చిక్కులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంస్థ చైర్మెన్ పదవి నుంచి విశాల్ సిక్కా శుక్రవారం హఠాత్తుగా వైదొలగడంతో న్యాయ సమస్యలు ఆ సంస్థను చుట్టుముట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిక్కా ఆకస్మిక నిర్ణయంతో ఇన్ఫీ స్టాక్ శుక్రవారం భారీగా పతనమైంది. దీంతో సంస్థలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులు భారీగా నష్ట పోయారు. దేశీయంగానే కాకుండా అమెరికాలోని మార్కెట్లలోనూ ఇన్ఫీ సంస్థ నమోదై ఉండడంతో అక్కడి మదుపరులకు సిక్కా చర్య సెగ తగిలింది. స్టాక్ విలువ పడిపోయింది. ఈ క్రమంలో కొందరికి భారీగానే చేతి చమురు వదిలింది. ఇన్ఫోసిస్ నుంచి ఊహించని విధంగా ఎదురైన ఈ కుదపునకు అమెరికాలోని న్యాయ సంస్థలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. అమెరికాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బ్రోన్‌స్టెయిన్, జివెర్ట్జ్ అండ్ గ్రాస్మాన్, రోసెన్ న్యాయ సంస్థ, పోమెరాంట్జ్ న్యాయ సంస్థ, గోల్డ్ బర్గ్ లా పీసీలు ఇన్ఫోసిస్ కలకలం విషయంలో ఎవైనా అంతర్గత మోసాలుగానీ.. ఫెడరల్ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘన గానీ జరిగిందా అన్న కోణంలో ఈ సంస్థలు పరిశీలన జరుపుతున్నాయి. సంస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఇన్ఫోసిస్ మదుపరుల తరుపున పోరాడుతామని రోసెన్ పేర్కొంది. ఇందుకోసం పొటెన్షియల్ సెక్యూరిటీ క్లయిమ్స్‌పై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. ప్రజలు పెట్టుబడులు పెట్టడానికి భౌతికంగా తప్పుదోవ పట్టించే వ్యాపార సమాచారాన్ని ఆ సంస్థ జారీచేసినట్టు ఆరోపణలు వస్తున్నట్టుగా పేర్కొంది. తాజా కుదుపుతో ఇన్వెస్టర్లు పోగొట్టుకున్న మొత్తాన్ని రికవరీ చేయడానికి కంపెనీ క్లాస్ యాక్షన్ దావాకు కూడా సిద్ధమై ఉండాలని హెచ్చరించింది. ఇన్ఫీ లేదా కొందరు ఆఫీసర్లు, డైరెక్టర్లు ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలకు అనుగుణంగా పనిచేశారా లేదా అన్నది



విచారిస్తున్నామని బ్రోన్‌స్టెయిన్ పేర్కొంది. సెక్యూరిటీస్ మోసానికి లేదా చట్టవిరుద్ధమైన వ్యాపార విధానాలకు వారు పాల్పడారా? లేదా? అన్నది విచారణలో తేల్చుతామని పోమెరాంట్జ్ ఇన్ఫోసిస్‌కు హెచ్చరికలను జారీ చేసింది.

అరబ్ షేక్‌ల నుంచి బాలికలను కాపాడాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి : ఆశాలత



నవతెలంగాణ-ధూల్‌పేట్

అరబ్ షేక్‌ల నుంచి పాతబస్తీ అమ్మాయిలను కాపాడాలని, సురక్షితంగా నగరానికి తీసుకురావాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. హైదరాబాద్ పాతబస్తీలోని ఫలక్‌నుమా, బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో రుక్సార్, ఊమేరాబేగంలను అరబ్‌షేక్‌ల నుంచి రక్షించాలని కోరారు. రుక్సార్ తల్లిదండ్రులు సయ్యదున్నీసా, అప్సర్‌ను ఫలక్‌నుమా ఐద్వా నాయకులు శనివారం పోలీస్ స్టేషన్‌లో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫలక్‌నుమా ఏసీపీ మహ్మద్ తాజుద్దీన్‌ను కలిసి నిందుతులపై చర్యలు తీసుకుని, బాలికలను నగరానికి సురక్షితంగా రప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ.. పాతబస్తీలో షేక్‌లు, బ్రోకర్లు అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని బాలికలకు చిన్న తనంలోనే పెండ్లీలు చేసి వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారన్నారు. నగరానికి వచ్చే అరబ్ షేక్‌లపై పాతబస్తీ పోలీసులు గట్టి నిఘా పెట్టాలన్నారు. దొంగ సర్టిఫికెట్ సృష్టించి అక్రమంగా పెండ్లీలు చేస్తున్న బ్రోకర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వివాహాలు చేసుకుని తీసుకెళ్లిన అమ్మాయిలను నగరానికి రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు. ఆశాలత వెంట ఐద్వా నాయకులు ఎండీ మీనా, శశికళ, లక్ష్మమ్మ, స్థానిక నాయకులు ఉన్నారు.

గందరగోళంలో సమాచారశాఖ

- సీఎం ప్రగతి భవన్‌లో..సచివాలయం నుంచి ప్రకటనలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ సచివాలయానికి రావడం దాదాపు మానేశారు. ప్రగతిభవన్ నుండే కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యమంత్రి పేషీ అధికారులు కూడా ప్రగతిభవన్‌లోనే ఉంటున్నారు. శాఖల సమీక్షలన్నీ అక్కడ నుండే జరుగుతున్నాయి. దీంతోపాటు సమీక్షలకు సంబంధించిన ప్రకటనలు ప్రగతిభవన్ నుండి సచివాలయానికి చేరుకుని అక్కడ నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియానికి చేరుతున్నాయి. ఈ సమయంలో అప్పుడప్పుడు ఆ రోజు తేదీతో పాత ప్రకటనలు, ఫొటోలు మీడియా కార్యాలయాలకు చేరుతున్నాయి. ప్రకటనలను గుర్తిస్తున్నా, ఫొటోలను తెలుసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. దీంతో పాత ఫొటోలు ఆ రోజే సీఎం కేసీఆర్‌ను పలువురు మంత్రులు, టిఆర్ఎస్‌నేతలు, అధికారులు కలిసినట్టుగా ఉంటున్నాయి. దీనికి సంబంధించి శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీ సెక్రటరీ రాజాసదారాం కలసినట్టుగా ఫొటోలు మెయిల్‌లో వచ్చాయి. తన పదవీకాలాన్ని పొడిగించినందుకు సీఎంకు ఆయన ధన్యవాదాలు చెప్పినట్టుగా ఆ ఫొటోలు ఉన్నాయి. వాస్తవానికి ఆగస్టుతో ఆయన పదవీకాలం పూర్తికానుంది. ఇప్పటికే రిటైర్ అయినా మూడు సార్లు సదారాం పదవీకాలాన్ని పొడిగించడం అయింది. మళ్లీ పొడిగించారని వార్తలు రావడంతో ఆయా రాజకీయ పక్షాలు, కొంతమంది అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు సిద్ధమయ్యారు. చివరికి ఆ ఫొటోలు తప్పు అని, పాత ఫొటోలని ముఖ్యమంత్రి కార్యాలయం సిబ్బంది చెప్పడం, అధికారులు కూడా అలాంటి ఉత్తర్వులు ఇవ్వడం లేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సమీక్షలు ఒకచోట, ప్రకటనలు మరోచోట నుండి పంపించడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని కార్యాలయం సిబ్బంది చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించాలి

ప్రజలపై పోలీసు ప్రయోగం ప్రమాదకరం

- కోర్టులు ప్రశ్నించేస్థాయిలో అసమర్థ సర్కారు
- ఇక ఐక్య వేదికగా ఉద్యమాలు.. హక్కుల సాధనకు పోరాటాలు
- టీమాస్ ఫోరం కరీంనగర్ జిల్లా ఆవిర్భావ సభలో వక్తలు



సభలో అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుపై ప్రజలు చర్చించాలని, ఇక నుంచి సామాజిక, సమగ్రాభివృద్ధి కోసం ఐక్య పోరాటాలు చేపట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. హక్కుల సాధన, హామీల అమలు కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) జిల్లా ఆవిర్భావ సభ శనివారం జరిగింది. ఇందులో 150 సంఘాలు పాల్గొన్నాయి. ఈ సభలో తెలంగాణ మేధావుల ఫోరం చైర్మెన్ ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా పాలన సాగుతోందని, ప్రత్యామ్నాయంగా టీమాస్ ఫోరం రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఏర్పాటుకు రోడ్డెక్కి ఉద్యమాలు చేసిన యువతను ఈ ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ వ్యవస్థ దళారుల చేతుల్లోకి వెళ్లిందని, గిట్టుబాటు ధర కల్పించే విధంగా రైతుల చేతుల్లోకి రావాలని ఆకాంక్షించారు. రైతులు ధర కోసం ప్రశ్నించినప్పుడు బేడీలు వేసి జైలుకు పంపడం దారుణమన్నారు. గ్రామపంచాయతీలపై పర్యవేక్షణకు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలను వేసి అధికారాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర సర్కారు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల కోర్టులు ప్రశ్నించే పరిస్థితి ఎదురవుతోందన్నారు. యువత తుపాకుల జోలికి వెళ్లకుండా ప్రజాస్వామ్యంగా ఏలికలను ఎదుర్కొనేందుకు టీ-మాస్ ఫోరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ సుదర్శన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రను వక్రీకరించి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష ఉద్యోగాల్లో ఒక శాతం మాత్రమే పూర్తి చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 98 శాతం హామీలు అమలు అయినట్టు సీఎం చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. మరో సభ్యులు జి. నాగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పరువు హత్యలు, దళితులు, ముస్లింలపై దాడులు పెరిగాయని, ఆ ఘటనల్లో నిందితుల వైపే సర్కారు నిలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలతోనే నేరెళ్ల, జిల్లెల్లకు చెందిన 8 మందిని చిత్రహింసలకు గురిచేసి ఇసుక మాఫియా ఆగడాలకు మద్దతు తెలిపిందన్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికి టీమాస్ వేదికగా ఉద్యమాలు ఉధృతం చేయాలని కోరారు. సభలో టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, పూల జనార్ధన్, శ్రీరాంనాయక్, నిర్వహణ కమిటీ సభ్యులు సుంకరి సంపత్, గుడికందుల సత్యం, జి. భీమాసాహెబ్, వరాల రవికుమార్, తిప్పారపు సంపత్, మైనార్టీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు వసీం అహ్మద్, జిల్లా నాయకులు గీట్ల ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ+ కాదు.. ఏ గ్రేడే కష్టతరం

- ఓయూలో ముగిసిన న్యాక్ బృందం పర్యటన
- చర్యలు తీసుకోకుంటే .. భవిష్యత్ అసాధ్యం
- ప్రస్తుతం చెప్పుకోదగ్గ అభివృద్ధి లేదు
- నివేదికలో తేల్చి చెప్పిన న్యాక్ సభ్యులు



ఆర్ట్స్ కళాశాలలో పర్యటిస్తున్న ఏకే సింగ్

నవతెలంగాణ - ఉస్మానియా యూనివర్సిటీ

వందేండ్ల సుధీర్ఘ చరిత్ర కలిగిన ఓయూలో పరిశోధన, బోధనల్లో మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు తీసుకోకుంటే గత చరిత్రే తప్ప వర్తమానంలో రాణించటం అసాధ్యమని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్(న్యాక్) బృందం చైర్మన్ ఆచార్య ఎస్‌కేసింగ్ తన నివేదికలో సూచించారు. శనివారం మధ్యాహ్నం బృందం తమ మూడ్రోజుల పర్యటన రిపోర్టుతో ఓయూ పరిపాలనా భవనంలోని సెనెట్‌హాల్లో ఓయూ వీసీ, రిజిస్ట్రార్, ఐక్యూఏసీ అధికారులతో పాటు ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్‌తో సమావేశమైంది. దానిలో భాగంగా ఎస్‌కే సింగ్ కేవలం 40 నిమిషాల్లోనే మూడు రోజుల పర్యటన, ఓయూ ఉన్నతి, వైఫల్యాలపై వివరించారు. ప్రధానంగా సైన్స్ కళాశాలలో 12 విభాగాల్లో పరిశోధన బోధనా విధానం లోపించిందని చెప్పారు. అయితే, ఇక్కడ ఉన్న మౌలిక వసతులు మరెక్కడా లేవని, వాటిని వినియోగించుకోవడంలో లోపం ఉందని చెప్పినట్టు సమాచారం. వందేండ్ల చరిత్రతోపాటు చుట్టుప్రక్కల పలు జాతీయ పరిశోధన సంస్థలు ఉండడం ఓయూకు కలిసొచ్చిన అంశంగా అభివర్ణించారు. అయితే, పరిశోధనల్లో నాణ్యత లోపించిందని, ల్యాబ్‌ల్లో పనిచేసేవారు లేరని ఎత్తి చూపారు. మొత్తంగా వర్సిటీల్లో బోధన మరింత మెరుగుపడాలని బృందం సభ్యులు సూచించారు. ఓయూలో ప్రస్తుతం ఆశించినంత అభివృద్ధి లేదని చెప్పారు. పరిశోధనల స్థాయి పెరగాలని, మనం చెప్పే పాఠాలు విద్యార్థికి లాభం చేకూరుస్తుందా? లేదా? అనే కోణంలో ఆలోచించడం కరువైందని అన్నారు. ఓయూలో విశాల ఆట స్థలాలు ఉన్నా వసతులు శూన్యమన్నారు. పలు సౌకర్యాలు ఉన్నా అవి మారుతున్న పరిస్థితుల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా లేవన్నారు. మధ్య స్థాయి (అసోసియేట్) ప్రొఫెసర్స్ లేక నాయకత్వం కరువైందన్నారు. మరో మూడేండ్లలో సీనియర్ ఆచార్యులు రిటైర్డ్ అయితే బోధన పడిపోతుందని తెలిపారు. పలు విభాగాల్లో అసలు బోధనే లేదన్నారు. అయితే, టీమ్ వర్క్ బాగుందని, గ్రంథాలయాల పని తీరును అభినందించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, ప్రవేశ పరీక్షల ద్వారా అధికారులు తీసుకునే నిర్ణయాలను స్వాగతించారు. బోధన, బోధనేతర రిక్రూట్‌మెంట్ అవసరమని చెప్పారు. న్యాక్ బృందం విశ్లేషణ అత్యంత లోతుగా జరిగిందని ఆచార్యులు చెప్పుకోవడం విశేషం.

అలా సాధ్యం కాదు..

ప్రస్తుత పరిస్థితుల్లో ఓయూ అధికారుల కలలు కలగానే మిగలనున్నాయి. వారు ఎ+ గ్రేడ్ వస్తుందని ఆశించారు. కానీ 'ఎ' రావడమే ఎక్కువని న్యాక్ బృందం భావిస్తోంది. న్యాక్ రిపోర్టు ప్రకారం.. యూనివర్సిటీలో మెరుగైన బోధన, వనరుల వినియోగంపై తక్షణం దృష్టి సారించకపోతే ఓయూ మనుగడ ప్రశ్నార్థకమేనని తేలింది. మరోవైపు ఎ+ కోసం ఓయూ అధికారులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్రీరాములు శ్రీనివాస్‌ను విడుదల చేయాలి

- టీ మాస్ ఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీసులు కిడ్నాప్ చేసిన టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు శ్రీరాములు శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కీసరలో తన ఇంటిలో నిద్రిస్తున్న ఆయన్ను పోలీసులు చెప్పా పెట్టకుండా, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పట్టుకుని పోయారని తెలిపారు. ఆయనపై ఏమైనా కేసులుంటే కోర్టుకు అప్పజెప్పాలి తప్ప ఇలా రౌడీల్లా కిడ్నాప్ చేయటం సరికాదని పేర్కొన్నారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా హెల్ప్‌లైన్ 181ను ప్రారంభించిన తుమ్మల

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ, భద్రత కోసం పనిచేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సచివాలయంలో మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్‌లైన్ 181ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం తాము ఉన్నామంటూ ప్రభుత్వం తరపున రూపొందించిన హెల్ప్‌లైన్ ఇది అని అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళా కూడా కన్నీరు పెట్టకూడదని, మహిళలకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఎక్కడనుంచైనా దీనికి ఫోన్ చేయవచ్చున్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా 24 గంటలు 365 రోజులు సలహా, కౌన్సిలింగ్, రక్షణ కోసం అవసరమైన సహాయ సహకారాలందిస్తుందన్నారు. అవసరాన్ని బట్టి వారికి సఖీ సెంటర్లు, వైద్య, అంబులెన్స్, పోలీసు సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఆపద సమయాల్లో తాత్కాలిక వసతి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ 181 హెల్ప్‌లైన్‌ను ప్రతి శాఖకు అనుసంధానం చేశామన్నారు.



నయాపైసా ఖర్చు లేకుండా...

ఫిట్‌నెస్ కోసం చాలామంది జిమ్‌కి వెళ్తుంటారు. వ్యాయామానికి వేలాది రూపాలు ఖర్చు చేస్తుంటారు. అయితే... ఎలాంటి ఖర్చు లేకుండా ఇంట్లోనే ఎక్సర్‌సైజ్ చేయొచ్చని అంటు న్నారు నిపుణులు. ఎలాంటి పరికరాలు లేకుండానే వ్యాయామం చేయవచ్చంటున్నారు.



వాకింగ్
వాతావరణం అనుకూలంగా ఉంటే ఇంటి సమీపంలోనే రోడ్డుపై వాకింగ్‌కి వెళ్లొచ్చు. అయితే.. వర్షం కురుస్తున్నా, వాతావరణం అనుకూలించకున్నా అది సాధ్యం కాదు. అలాంటప్పుడు ఇంట్లోనే టెర్రస్ పైకెక్కి ఓ పది రౌండ్లు కొడితే చాలు. శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. దీనివల్ల 3.0 కేలరీల శక్తి బర్న్ అవుతుంది.

లెగ్ లిఫ్ట్ : టెర్రస్‌పై లేదా హాలులో కింద పడుకొని కాళ్లను పైకెత్తి వ్యాయామం చేయడం చాలా మంచి వ్యాయమం. దీని వల్ల కాళ్లతో పాటు నడుము కండరాలు బలోపేతమవుతాయి.



జంపింగ్ : ఇంట్లోనే జంపింగ్‌లు చేయండి. తాడు సాయంతో స్కిప్పింగ్ చేయండి. ఆహ్లాదంతోపాటు సంతోషం మీ సొంతమవుతుంది. ఇలా జంపింగ్ ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.

పుష్‌అప్స్ : పుష్‌అప్స్ చేయడం చాలామందికి ఇష్టం ఉండదు. ఈ వ్యాయామం వల్ల శరీరంలోని మజిల్స్ చురుకుగా మారుతాయనే విషయం మరచిపోవద్దు. మీ ఇంటి గోడ వద్ద ఒక స్తంభాన్ని పట్టుకొని పుష్‌అప్స్ చేయండి చాలు. చేసేటపుడు కాళ్లను నిటారుగా మాత్రం ఉంచాలి.

జాగింగ్ ఇన్ ప్లేస్ : జాగింగ్ మీ గుండె రక్షణకు గొప్ప వ్యాయామం. ఇంట్లోనే హాలులో టీవీ చూస్తూ లేదా టెర్రస్‌పై మ్యూజిక్ వింటూ జాగింగ్ చేయొచ్చు.



కూర్చోవటం, నిలబడటం : మీరు రోజూ కూర్చొనే కుర్చీలో కూర్చోవడం, లేవటం ఇలా కొన్ని సార్లు చేయడం కూడా కాళ్లు, నడుముకు మంచి వ్యాయామం అవుతుంది. మొదట్లో కొంచెం కష్టమనిపించినా రోజూ చేయడం వల్ల అలవాటు పడుతుంది.

లైట్ వెయిట్ లిఫ్టింగ్ : ఈ వ్యాయామం చేయడానికి డంబుల్స్ కొనాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఉన్న మిల్క్ జగ్ లేదా వాటర్ జగ్ లేదా ఏదైనా లైట్‌వెయిట్ ఉన్న వస్తువును పైకెత్తి కిందకు దింపుతుండటం కూడా మంచి వ్యాయామం అవుతుంది.

డ్యాన్సింగ్ : మీకు ఇష్టమైన పాటకు లయబద్ధంగా నృత్యం చేయడం కూడా గొప్ప వ్యాయామమే. డ్యాన్స్ చేయడం మీ గుండె పదిలంగా ఉండేందుకు ఉపకరి స్తుంది. నృత్యం చేయడం వల్ల మీకున్న అలసట తగ్గి ఆహ్లాదాన్ని పొందొచ్చు.

స్టెప్ ఎక్స్‌ర్‌సైజ్ : మీ ఇంట్లోని మెట్లను ఎక్కి, దిగుతుండటం కూడా మంచి ఎక్స్‌ర్‌సైజ్. మెట్లు ఎక్కి, దిగుతున్నపుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలంటున్నారు నిపుణులు.


సేకరణ : ఎంహెచ్ఎం

ప్రేమించండిలా...



- ప్రేమికుల్లో భిన్న మనస్తత్వాలు కలిగి ఉండటం సహజం. విభిన్న అభిప్రాయాలు కలిగి ఉండటం సర్వసాధారణం. అంత మాత్రానా చీటికి మాటికి వాదులాడుకోవడం మంచిది కాదు. అభిప్రాయాలను పంచుకోవాలి కానీ.. పరస్పరంగా వాదులాడుకోవద్దు. ఇద్దరి మధ్య ఇది అంతరాన్ని పెంచుతుంది. వాగ్వాదం సరదాగానో, సమస్యకు పరిష్కారంగానో ఉండాలి గానీ విడిపోవడానికి దారి తీయొద్దు. ఇంకో విషయమే మిటంటే.. తమ వాదన ఇద్దరు విడిపోవడానికి కారణమవుతుందని అనిపించగానే దాన్ని అక్కడికే ఆపేయడం శ్రేయస్కరం. అలాంటి సందర్భాల్లో రాజీ మార్గాన్ని అనుసరించండి.
- ప్రేమను వ్యక్తపర్చడానికి ఏదో సినిమా డైలాగులే చెప్పాల్సిన అవసరం లేదు. మీ మనసులో ఉన్న భావాలను ఉన్నది ఉన్నట్టుగా వ్యక్తపరి స్తే చాలు.
- ప్రేమించిన వ్యక్తితో సంతోషాన్ని పంచుకోవడానికి అవకాశాలను వెదుకుతూ ఉండండి. చిన్నపాటి అకేషన్ అయినా బాగా సెలబ్రేట్ చేసుకునేలా ప్లాన్ చేయండి.
- ప్రేమించిన వ్యక్తిని చులకన చేస్తూ మూడో వ్యక్తి ఎదుట మాట్లాడటం మంచిదికాదు. ఏదైనా అభిప్రాయ బేధాలు వచ్చినప్పుడు మూడో వ్యక్తి ఎదుట వాదులాడుకోవడం సరికాదు. దీంతో మీ ప్రేమ విలువను మీరే తగ్గించుకున్నట్టవుతుంది.
- ప్రేమించిన వ్యక్తి పట్ల సానుకూలంగా వ్యవహరించండి. ప్రేమ పదిలంగా ఉండాలంటే దీనికన్నా మంచి మార్గమేమీ లేదు.

మజాక్



ఖాతరు

'నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?' అమ్మాయిని అడిగాడు అబ్బాయి.
'ఎస్..' చెప్పింది అమ్మాయి.
'మరీ.. నువ్వు నన్నెందుకు ఖాతరు చేయడం లేదు?' ఆవేదన వ్యక్తం చేశాడు అబ్బాయి.
'ప్రేమించినప్పుడు ఎవర్నీ ఖాతరు చేయొద్దని నువ్వేగా అన్నావూ..!' సమాధానమిచ్చింది అమ్మాయి.

స్థాయి



ట్రైన్‌లో అడుక్కుంటున్న బిచ్చగాడితో అన్నాడు యువకుడు..
'ఈ రోజుల్లో కూడా ఒక్కొక్క రూపాయి మాత్రమే అడుగుతున్నావ్. ఇలాగైతే నువ్వు బాగుపడటం కష్టమే..' అన్నాడు హేళనగా.
బిచ్చగాడికి ఒళ్లు మండింది.
'మీ దగ్గర మాత్రమే రూపాయి అడుగుతున్నా. ఇక్కడున్న మిగతా వారందర్నీ ఐదు రూపాయలు అడిగా..' అన్నాడు.
'అదేమిటి.. నన్ను మాత్రమే రూపాయి ఎందుకు అడుగున్నావ్?' ఆశ్చర్యం వ్యక్తం చేశాడు యువకుడు.
'మనిషి స్థాయిని చూసే అడుక్కోవాలి కాబట్టి' టక్కున అనేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు బిచ్చగాడు.

కరాఖండిగా చెప్పేయండి...

ఫలానా పనిచేసి పెడతానని మీరెవరికైనా మాట ఇస్తున్నారా? అయితే.. జర జాగ్రత్త. వాగ్దానం చేసేటప్పుడు కాస్త ఆలోచించండి. మీకు ఆ పని చేసే సమయం, తీరక ఉంటే తప్పనిసరిగా చేయొచ్చు. కానీ.. కుదరకపోతే మాత్రం వారు మిమ్మల్ని అపార్థం చేసుకునే ఆస్కారం ఉంది. ఒకసారి మాట ఇచ్చాక అది నిలబెట్టుకోవాలి. ఆ కమిట్‌మెంట్ అవసరం. అలాకాకుండా ఎవరేం అడిగినా ముందు వెనుకా చూసుకోకుండా మాట ఇవ్వొద్దు. కుదురుతుందా ... లేదా ? అని ఆలోచించకుండా ఒప్పేసుకోవడం తప్పు. కుదరదనిపిస్తే 'చేయలేను' అని కచ్చితంగా చెప్పేయండి.

ఇతరులు తమను మంచి వాళ్లు అనుకోవాలని ఆశించే వారు ప్రతి దానికీ 'ఎస్' అనేస్తారు. 'నో' అంటే అందరితో తాము చెడ్డ వాళ్లమనే భావన వస్తుందని భయపడతారు. తమ ఇమేజ్ దెబ్బతింటుందని బాధపడతారు. కానీ... ప్రతిదానికీ 'ఎస్' చెప్పేయడం వల్ల చివరకు ఇబ్బందులు ఎదుర్కొక తప్పదనే విషయాన్ని మరచిపోతారు.



అందరి పనులు చేసే వారికి తమ పని తాము చేసుకునే అవకాశం ఉండదు. తమ పనులు కాలేదని చివరికి చిరాకుగా ఉంటారు. వారిలో అసంతృప్తి ఆవరిస్తుంది. ఎదుటివారి సంతోషం కోసం తమ ఆనందాన్ని త్యాగం చేస్తారు గానీ.. తమ కోసం తాము చిన్న పని కూడా చేసుకోలేరు.

కాబట్టి అందరికీ అన్ని వేళలా 'ఎస్' చెప్పకుండా కుదరదని చెప్పేయండి. 'చేసేస్తాను' అన్నట్టే 'నేను చేయలేను' అని చెప్పడం కూడా అలవాటు చేసుకోవాలి.

ఇతరుల పనులు చేయడంలో తప్పు లేదు కానీ.. దీని వల్ల మీకు అదనపు ఒత్తిడి పెరుగుతుంది. పని చేసే దాకా అవుతుందో.. లేదో..? అనే టెన్షన్ పట్టుకుంటుంది. పూర్తయ్యాక సొంత పనులు కుంటుపడి పోయాయనే ఆందోళన తప్పదు. ఇతరుల పనులు చేయడం వల్ల మీ పనులు వాయిదా పడతాయి. లేదా సరిగ్గా చేయలేకపోతారు. మీ మీద మీకు ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. అంతేకాదు... ఎలాగో చేసిపెడుతున్నారు కదా అని అవతలి వాళ్లు మీకు మరిన్ని పనులు చెప్పడం మొదలు పెడతారు. దీంతో పని ఒత్తిడి మరింత పెరుగుతుంది. మీ మానసిక ప్రశాంతతకు భంగం కలుగుతుంది. అందుకే... ఆ పరిస్థితులు ఎదురుకాకుండా జాగ్రత్త పడండి. వారు చెప్పిన పని చేయడం తప్పదనుకున్నప్పుడే ఒప్పుకోండి. లేదంటే నిర్మొహమాటంగా కుదరదని చెప్పేయండి.

ప్రేమ సూక్తులు

- ఎన్ని కాలాలు మారినా ఎదలో దాగి ఉన్న జ్ఞాపకాలు ఎప్పటికీ మారవు.
- కనురెప్పల తడిని అర్థం చేసుకోగలిగే సహృదయం ఉంటే కన్నీటి భాష తెలుస్తుంది.
- నీ కంటిలో నీటి చుక్కను చూసి ఎవరైతే విలవిలలాడుతారో వారే నీ వారని తెలుసుకో.
- అప్పు అయినా ప్రేమ అయినా తిరిగి ఇస్తేనే దాని విలువ. లేకపోతే రెండూ భారమే.
- నువ్వు ప్రేమించే వాళ్లు ఎంతమందైనా దొరుకుతారు. నిన్ను ప్రేమించే వాళ్లు దొరకడం నిజంగా నీ అదృష్టమే.
- మనసుకు మబ్బు పడితే... కళ్లు వర్షాన్ని కురిపిస్తాయి. మాటలు మసకబారితే భావం జాలువారుతుంది.
- మనకంటే బెటర్ చాయిస్ చూసుకుని మనల్ని వదిలేసి వెళ్లిన వాళ్లు.. వాళ్లకంటే బెస్ట్ చాయిస్‌ను ఎంచుకునే అవకాశాన్ని మనకు వదిలి వెళ్లిపోతారనే విషయాన్ని గ్రహించాలి.
- ఒకరిచే గాఢంగా ప్రేమించబడటం మంచి మనోబలాన్నిస్తుంది. ఒకరిని గాఢంగా ప్రేమించడం మంచి ధైర్యాన్నిస్తుంది. ఈ సృష్టిని చైతన్యవంతం చేసేది ప్రేమ మాత్రమే.
- ఓటమి కూడా ఓదార్పునిస్తుంది మిత్రులు తోడుంటే.
- విజయం కూడా వెక్కిరిస్తుంది.. ఎవరూ లేకుంటే.
- కఠినమైన హృదయంలో ప్రేమ పుట్టించడం కష్టం. ఆ హృదయంలో విఫలమైన ప్రేమను తుడిచివేయడం అంతకన్నా కష్టం.
- ఎవరినీ ఆశించొద్దు అనుకుంటూ ఉంటాం. కానీ.. మనం ఎక్కువగా ఇష్టపడిన వాళ్ల నుంచి మనకు తెలియకుండానే ఎంతో కొంత ఆశీస్తూ ఉంటాం.
- ప్రేమ గుర్తులను చేతిలో పెట్టడం కాదు... పట్టుకున్న చేతిని జీవితాంతం వదలకూడదు.
- నిజంగా ప్రేమించే వారెవరైనా ప్రపంచంకెల్లా అందమైన వారిని కోరుకోరు. తన కోసం ప్రపంచాన్ని అందంగా మార్చగల వారినే కోరుకుంటారు.



పరిమళాలు

వహ్వా.. వహ్వా

చూపుల దారంతో
ఎన్నాళ్లని బంధాలను
గాలిపటంలా ఎగరేస్తావు!
దూరంతో దారులు కలవవు
చూపులు దగ్గరైతేనే గమ్యం చేరేది!


మాటల ఊటలతో
ఎన్నాళ్లని మనసును
బావిలా నింపేస్తావు!
ధారలతో దరులు చేరవు
మాటలు కలిస్తేనే దాహం తీరేది!

నవ్వుల జల్లులతో
ఎన్నాళ్లని ఎదను
చెరువులా తడిపేస్తావు!
చినుకులతో ఎడారి నిండదు
నవ్వులు కలిస్తేనే మమత నిలిచేది!

వీడిన కొమ్మలెప్పుడూ కలవవు
విరబూసిన పూలే కలుపుతాయి!
ప్రేమకో, పూజకో అల్లుకుపోయి
పరిమళాలు వెదజల్లుతాయి!

ఓడిన మనసులెప్పుడూ కలవవు
చిగురించిన ప్రేమలే కలుపుతాయి!
ఏకమై, మమేకమై అనంతమయి
అనుబంధాలు విరజిల్లుతాయి!

– పుట్టి గిరిధర్,
9491493170



ఆందోళన వద్దు



రంగం ఏదైనా విజయం సాధించడానికి సరైన మార్గం అవసరం. మనమెంత ఎత్తుకు ఎదుగుతామనేది మన జీవితం పట్ల మనకున్న దృక్పథాన్నిబట్టి ఉంటుంది. మనసులో రూపొందించుకున్న ఆశలు, ఆశయాలే జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయి. ఆలోచనలు సక్రమమైనపుడే మేధస్సు వికసిస్తుంది. ఒక మంచి ఆలోచన మనకు తట్టినపుడు దానిని పదే పదే మననం చేసుకోవాలి. చెడు ఆలోచనలను అదుపు చేయటం ముఖ్యం. అయితే... ఇది అంత సులభమేమీ కాదు. అయినా ప్రయత్నిస్తూనే ఉండాలి. బిజీ లైఫ్‌తోనే ఇది సాధ్యం. నిరంతరం పనిచేస్తూంటే మనసుకు, అందులో చెలరేగే ఆలోచనలకు స్థిరత్వం ఉంటుంది. అప్పుడే మెరుగైన జీవితానికి ఉపయోగపడే కొత్త కొత్త ఐడియాలు పుట్టుకొస్తాయి. వాటిని అప్పటికప్పుడే మరచిపోవద్దు. దాన్ని ఆచరణలో పెట్టే దాకా నిరంతరం నెమరేసు కుంటూనే ఉండాలి. అంతేకాదు.. ఐడియాలపై ఎప్పటికప్పుడు రివ్యూ చేయాలి. వాటిని కార్యరూపం దాల్చడానికి ఎదురయ్యే సాధ్యాసాధ్యాలను సమీక్షించుకోవాలి. ఎంతటి కఠినమైన పనినైనా చేయడానికి సిద్ధపడాలి. స్థయిర్యాన్ని కూడగట్టుకున్నప్పుడే అసాధ్యం సుసాధ్యమవుతుంది.

మన పనికి ఎవరో ఆటంకం కలిగిస్తారని ముందుగానే ఊహించుకోవడం కన్నా పరికితనం మరొకటి లేదు. ఇలా చేస్తే ఎవరో ఎందుకు..? మనకు మనమే అడ్డంకులు సృష్టించుకున్నట్టు. ఆగధాలను, ప్రమాదాలను అధిగమిస్తేనే విజయం.

మానసిక సంఘర్షణకు కారణం?

దైనందిన జీవితంలో చాలామంది మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఏదైనా కొత్త పనిని ప్రారంభించాలన్నా, ఆఫీసులో కొత్త ఆలోచనలను ఆచరణలో పెట్టాలనే ఒకటే టెన్షన్. అది సక్సెస్ అవుతుందో.. లేదో అనే భయం. ఇది మాత్రం శ్రేయస్కరం కాదు. దీని నుంచి బయటపడితేనే అనుకున్న పని సజావుగా సాగుతుంది. అనవసరపు భయాందోళనలు పెట్టుకుని మన లక్ష్యాన్ని మనమే నీరుగార్చుకోవద్దు. ఆటుపోట్లు ఎదురవుతాయని ఊహించుకుంటే ఒక్క అడుగూ ముందుకు వేయలేం. ఎంతటి క్లిష్టపరిస్థితులనైనా ఎదుర్కొని అనుకున్న పనిని పూర్తి చేస్తాననే మనోధైర్యం కలిగి ఉంటేనే ఏదైనా సాధించుకోగలం. చేయగలమా.. లేదా..? అనే మానసిక సంఘర్షణ వల్ల ప్రతికూల పరిస్థితులే తప్ప ప్రయోజనమేమీ ఉండదు. దీన్ని జయించినప్పుడే విజయం వైపు అడుగులు పడతాయి.

– ఎస్. శ్రీధర్, ఖమ్మం


అర్థమేమిటి?

- స్నేహమంటే.. పేరు పేరునా పిలచి పలకరించుకోవడంకాదు. పదిమందిలో మనపేరుతో పాటు పలుకరించే పదమది.
- స్నేహమంటే.. ఎన్నటికీ ఎడబాటే ఎరుగనిది. దూరమైనా దగ్గరగా ఉన్నామన్న భావమది.
- కలసి ఉండాలని కలలు కనడం కాదు స్నేహమంటే.. బాధ ఇక్కడైతే అక్కడ కన్నీరు కార్చేది.
- స్నేహమంటే ఆనందంగా జీవించడానికి ఔషధం లాంటిది.
- స్నేహమంటే అన్నింటినీ మరిపించి హాయిగా నవ్వించగలిగేది.

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక,
ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.
e-mail : josh@navatelangana.com



హెచ్‌సీఏపై అజహర్ గుస్సా

లోథా కమిటీ సిఫారసుల ప్రకారం అర్హతలేదు


హైదరాబాద్ క్రికెటర్లు రంజీకి ఎంపిక కాకపోవటం బాధాకరం

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై భారత మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్-సీఏ తీరు సరిగా లేదంటూనే.. ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆరోపించారు. నూతన కమిటీని వెంటనే రద్దు చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. లోథా కమిటీ సిఫారసుల ప్రకా రం చూస్తే హెచ్‌సీఏ సెలక్షన్ కమిటీకి ఎలాంటి అర్హత లేదని విమర్శించారు. భారతీయ క్రికెటర్లకు హెచ్‌సీఏలో గుర్తింపు లేదన్న అజహర్.. హైదరాబాద్ క్రికెట్ జట్టు నుంచి కొందరు క్రీడా కారులు రంజీకి ఎంపిక కాకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరిగిం దని తెలిపారు. ఈఎంపిక లోథా కమిటీ సిఫారసుల మేరకే జరిగిందా లేదా అర్థం కావటం లేదని అజహర్ చెప్పారు.. ఎన్నికల య్యాక హెచ్‌సీఏలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపించారు. తాను చేసే వ్యాఖ్యలు ఎవరినీ నిందించటానికి కాదని తెలి పారు.. హెచ్‌సీఏ ఎన్నికలపై సుప్రీం తీర్పు రావడానికి ఇంకా సమయం ఉన్నదని... అప్పటిదాకా వేచి చూడాల న్నారు. తీర్పు వచ్చాక ఏం చెయ్యాలో.. ఎలా అడుగులు వేయాలో నిర్ణయిస్తానని తెలిపారు.

టాప్‌సీడ్‌తో అమీతుమీకి సౌమ్యజిత్,సత్యయాన్

బల్గేరియా టిటి ఫైనల్స్‌కు చేరిక

న్యూఢిల్లీ:2017 ఐటిటిఎఫ్ ప్రపంచ టూర్‌లో భారత టేబుల్ టెన్నిస్ తారలు సౌమ్యజిత్ ఘోష్, జి. సత్యయాన్ ఫైనల్స్‌కు చేరారు. శనివారం నాటి సెమీస్‌లో ఆగ్రేల్ బల్గేరియా ఓపెన్ డబుల్స్‌లో అమల్‌రాజ్, సనీల్ శెట్టి(భారత్)జంటపై 11-3, 12-10,11-8తో జయకేతనం ఎగుర వేశారు. భారత్ జంట జపాన్ టాప్‌సీడ్స్ జిన్ ఉదా, మహ్రు యోషిమురతో టైటిల్ పోరులో ఆదివారం ఢీకొననున్నారు. అంతకు ముందు ఘోష్,సత్యయాన్‌లు క్వార్టర్ ఫైనల్లో యింగ్ హెంగ్-వుయ్, లిన్ ఉన్ జు జంటపై 3-2తో విజయం సాధించి సెమీస్‌కు చేరిన విషయం తెల్సిందే. మహిళల డబుల్స్ సెమీస్‌లో మౌనిక బత్రా, మౌమా దాస్ స్వీడన్-హంగరీ జంట ఎక్లహోమ్, జార్గోనా చేతిలో 4-11, 11-8, 12-14, 12-14తో పోరాడి పరాజయం చెందారు.



సిన్సినాటి నుంచి సానియా, బోపన్న ఔట్

ఒహియా(అమెరికా): సిన్సినాటి మాస్టర్స్ డబుల్స్‌లో భారత్ టెన్నిస్ తారలు సానియా మీర్జా, రోహన్ బోపన్నలు పోరాటం ముగిసింది. సెమీస్‌లో మీర్జా,క్వార్టర్స్‌లో బోపన్న ద్వయాలు ఓటమి చవిచూసి ఇంటి ముఖం పట్టాయి.

మహిళల డబుల్స్‌లో ఢిపెండింగ్ ఛాంపియన్ మీర్జా, పెంగ్ షాయాయి సెమీస్ పోరులో సు-వుయ్(తైవాన్), మోనికా నికోలస్(రోమేనియా) జంట చేతిలో 4-6,6-7తో ఇంటి ముఖం పట్టారు. క్వార్టర్స్ ఫైనల్లో బోపన్న, డూడింగ్ జంట రెండో సీడ్, పోలెండ్ ద్వయం లూకాస్ కుబట్, మార్కోలో మెలో చేతిలో 1-6, 7-6,7-10తో పోరాడి ఓటమి చెందారు. ఇరుజట్ల మధ్య పోరు గంటా 36 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది.

ఇరుజట్లకు బస్తీమే సవాల్

నేడు భారత్-శ్రీలంక తొలి వన్డే

దంబుల్లా: శ్రీలంక, భారత్ మధ్య జరగనున్న వన్డే సిరీస్ నుంచి 2019లో జరిగే ప్రపంచకప్ కౌంట్‌డౌన్ మొదలు కానుంది. భారత్‌లో ప్రపంచకప్ సన్నద్ధతకు ఆటగాళ్ల ఫిటెనెస్‌ను బిసిసిఐ పరీక్షించనుండగా, శ్రీలంక కనీసం రెండు మ్యాచ్‌లైనా గెలవకపోతే పోటీల్లో పాల్గోనే అవకాశం ప్రమాదం పడనుంది. దీంతో ఇరుజట్లకు ఇది బస్తీమే సవాలే. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శ్రీలంక,భారత్‌లు తొలి వన్డేలో దంబుల్లా వేదికగా ఆదివారం తలపడనున్నాయి. ఎటువంటి వత్తిడి లేకుండా టీమిండియా అలవోకగా శ్రీలంకపై 3-0తో తొలిసారి క్లీన్‌స్వీప్‌తో చరిత్ర సృష్టించింది. మరోవైపు సిరీస్‌లో ఘోరంగా వైఫల్యం చెందిన లంకేయులు వన్డే సిరీస్‌లో నిలబెట్టుకోకపోతే ఆ దేశంలోనే మరోసారి అభిమానుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొనే ప్రమాదంలో పడింది.దంబుల్లాలో భారత్, శ్రీలంకల మధ్య 11 మ్యాచ్‌లు జరగ్గా శ్రీలంక కేవలం 4 వన్డేల్లోనే విజయం సాధించింది. మరోవైపు ఇక్కడ నుంచి కెప్టెన్ కోహ్లీ 2008లో తొలి మ్యాచ్‌ను మొదలెట్టాడు. దీంతో తొమ్మిదేళ్ల అనంతరం మళ్లీ విరాట్ ఏ విధంగా బ్యాటింగ్ చేస్తాడన్నది ఆసక్తి కరంగా మారింది. దీంతో తొలి వన్డే నుంచి అటు



విరాట్, ఇటు తరంగా ఆధిపత్యం సాధించడంపైనే గురిపెట్టాల్సి ఉంటుంది. ఈ సిరీస్‌లో రెండు వన్డేలను గెలిస్తే 2019 ప్రపంచకప్‌కు నేరుగా శ్రీలంక అర్హత సాధించనుంది. భారత్ కూడా 4-1తో సిరీస్ గెలవకపోతో నెం:1 కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పరుగుల వరదతో ఫిట్‌నెస్ నిరూపించకపోతే స్వదేశంలో జరిగే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లకు దూరం కానున్నారు. అదే జరిగితే ప్రపంచకప్ తుది జట్టు నుంచి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని భారత్ ఆటగాళ్లు రాణించాల్సి ఉంది.

రహానే, పాండే బెంచ్‌కే పరిమితం?

ధోనీకి అగ్ని పరీక్ష.. ఓపెనర్‌గా రాహుల్‌కు సవాల్

మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా తప్పుకుని కేవలం వన్డే, టి 20ల్లోనే సభ్యుడిగా ఉన్న మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అసలైన పరీక్ష శ్రీలంకలోనే మొదలు కానుంది. 36 ఏళ్ల ధోనీ 2019 ప్రపంచ కప్‌లో స్థానం సాధించాలంటే తన ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది. తాజా జట్టులో ఇతర వికెట్ కీపర్ ఎవర్ని తీసుకోలేదు. దీంతో అతడ్ని పరీక్షించే యోచనలో సెలక్టర్లులున్నారన్నది స్పష్టమవుతోంది. ఐదో స్థానంలో ధోనీ బ్యాట్ పట్టనున్నాడు. ఐసిసి ఛాంపియన్‌షిప్ ఫైనల్ పేలవమైన ప్రదర్శన, విండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కొంత విమర్శలు ఎదుర్కొన్న ఎంఎస్ ఈ సిరీస్‌లో సత్తా చాటడానికి పావులు కదుపుతున్నాడు. వన్డేల్లో నాలుగో స్థానంలో రాహుల్ బరిలో దిగుతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. 2016లో జింబాబ్వే వన్డే సిరీస్‌తో వన్డే జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల్లో ఓపెనర్‌గా కేవలం 24 పరుగులే చేశాడు. ఆ తర్వాత గాయాల బారిన పడి జట్టుకు పలుమార్లు దూరం అయ్యాడు.

విద్యార్థులతో సీజీజీ చెలగాటం

డిగ్రీ ఆన్‌లైన్ సీట్ల కేటాయింపులో గందరగోళం

'ఈనెల 10న నాకు సైఫాబాద్ పీజీ కాలేజీలో బీఎస్సీ ఎంపీఎస్‌లో సీటొచ్చింది. నాకు 905 మార్కులొచ్చాయి. బీసీ-బీ. ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్ ఉంది. అయినా ఈనెల 17న మళ్లీ కేటాయించినపుడు నాకు సీటు రాలేదు. నాకన్నా తక్కువ మార్కులున్న వారికి సీటొచ్చింది. ఎందుకు సీటు కోల్పోయానో అర్థం కావడం లేదు.'అని ఇ. రవికుమార్‌గౌడ్ అన్నారు.

'నాకు ఈనెల 10న సికింద్రాబాద్‌లోని ఎస్‌పీ కాలేజీలో బీఎస్సీ ఎంపీసీఎస్‌లో సీటొచ్చింది. సర్టిఫికెట్లు ఇచ్చాను. ఫీజు చెల్లించడానికి రెండు రోజుల తర్వాత వెళ్తే సీటు రద్దయిందని కాలేజీ వాళ్లు చెప్పారు. ఇప్పుడు నాకు ఏ కాలేజీలోనూ సీటు రాలేదు. ఏం చేయాలో తోచడం లేదు.'అని సీహెచ్ రాజేష్ చెప్పారు.

'నాకు ఈనెల 10న కేశవమెమోరియల్ డిగ్రీ కాలేజీలో బీకాం జనరల్‌లో సీటొచ్చింది. చేరాను. కాలేజీ ఫీజు రూ.10 వేలు, దరఖాస్తు ఫీజు రూ.250 చెల్లించాను. తరగతులకు హాజరవుతున్నాను. ఈనెల 17న వివి కాలేజీలో సీటొచ్చిందని మరోసారి ఎస్‌ఎంఎస్ వచ్చింది. ఈ కాలేజీలో చేరడానికి నాకు ఇష్టం లేదు. ఏం చేయాలనే దానిపై దోస్త్ కార్యాలయానికి వచ్చాను'అని బి జైకిరణ్ వివరించారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుండా రమ్య బీసీ-బీ. కానీ ఓసీ జనరల్ కేటగిరీలో జగిత్యాల జిల్లా రాజారాంపల్లిలోని సాధన డిగ్రీ కాలేజీలో సీటు కేటాయించారు. బీసీ-బీకి శ్రావణ్‌కుమార్‌కు ఈనెల 10న ఖైరతాబాద్‌లోని న్యూగవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో సీటొచ్చింది. ఇప్పుడు సీటు రాలేదు. ఇలా ఈనెల 10న సీట్లు వచ్చి ఈనెల 17న కేటాయించిన దాంట్లో సీట్లు కోల్పోయిన వారు 91 మంది విద్యార్థులున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు తెలంగాణ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వారి సమస్యలను లిఖితపూర్వకంగా రాసి సంబంధిత అధికారులకు ఇస్తున్నారు.

దీంతో దోస్త్ కార్యాలయానికి ఫిర్యాదుల తాకిడి తీవ్రంగా ఉంది. ఈనెల 10న, ఈనెల 17న రెండు సార్లు సీట్లు కేటాయించడంతో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ఈనెల 10న 2,790 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 2,699 మంది మాత్రమే ఈనెల 17న కేటాయించిన దాంట్లో సీట్లు పొందారు. అందులో 2,365 మందికి అంతకు ముందు కేటాయించిన కాలేజీలు, కోర్సుల్లోనే సీటొచ్చింది. మిగిలిన 110 మందికి కాలేజీ మారగా, 224 మందికి కాలేజీతోపాటు కోర్సు కూడా మారింది. ఇలా అనే తప్పులకు విద్యార్థులు బలయ్యారు. ఈ తప్పులన్నింటికీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ద్వారానే జరగడం గమనార్హం. అందుకే అది సెంటర్ ఫర్ బ్యాడ్ గవర్నెన్స్ అని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

మూడోవిడతలో రెండుసార్లు అలాట్ చేసిన సీజీజీ

- సీటు కోల్పోయిన 91 మంది విద్యార్థులు
- 334 మందికి కాలేజీలు, కోర్సులు మారిన వైనం
- బీసీ విద్యార్థికి ఓసీలో సీటు కేటాయింపు
- 'దోస్త్'కు ఫిర్యాదుల తాకిడి


CENTRE FOR GOOD GOVERNANCE
Knowledge • Technology • People

సీజీజీ తప్పులకు విద్యార్థులు బలి

ఈనెల 10న కేటాయించినపుడు సీజీజీ తీవ్రమైన తప్పు చేసినట్టు తెలిసింది. రెండో విడతలో నిండిన సీట్లనూ కలుపుకొని మూడోవిడతలోనూ సీట్లు కేటాయించినట్టు సమాచారం. వెంటనే విద్యార్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కేటాయించిన కాలేజీలో చేరారు. కాలేజీలూ ఆ విద్యార్థులను చేర్చుకున్నాయి. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీన్ని గమనించిన సీజీజీ అధికారులు ఆ సీట్ల కేటాయింపు సరైంది కాదని, ఈనెల 17న మళ్లీ కేటాయించింది. ఈనెల 10న మంచి కాలేజీలో సీటొచ్చిన విద్యార్థులు మళ్లీ అక్కడే కావాలని కోరుకుంటున్నారు. మరికొందరు ఇంటికి దగ్గర ఉన్న కాలేజీ వచ్చినందున ఎందుకు మార్చారని ప్రశ్నిస్తు న్నారు. ఈనెల 17న కేటాయించిన దాంట్లో ఎక్కువ మార్కులొచ్చిన వారికి మంచి కాలేజీలో సీటు రాలేదు. తక్కువ మార్కులొచ్చిన వారికి మంచి కాలేజీలో సీటు దక్కింది. ఇలా అనేక సమస్యలు ఉత్పన్న మయ్యాయి. ఈనెల 10న సీటొచ్చి ఈనెల 17న సీటు రాని వారు ఏకంగా 91 మంది ఉన్నారు. వారంతా మానసిక వేదనకు గురవుతున్నారు. సీజీజీ చేసిన తప్పులకు తామెందుకు నష్టపోవాలని అధికారులను పలువురు విద్యార్థులు ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మరోసారి ఆప్షన్లు ఇచ్చే సౌకర్యం కల్పిస్తాం : పాపిరెడ్డి

సీజీజీ వల్ల ఇబ్బందులు ఎదుర్కొని సీటు రాని విద్యార్థులకు మరోసారి వెబ్‌ఆప్షన్లు ఇచ్చే సౌకర్యం కల్పిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి తనను కలిసిన విలేకరులతో చెప్పారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు దక్కని విద్యార్థులందరికీ ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 23 వరకు మూడో విడతలో కేటాయించిన విద్యార్థులు కాలేజీల్లో చేరేందుకు గడువుందని చెప్పారు. ఈనెల 24 వరకు మిగిలిన సీట్ల వివరాలు అందుతాయని, ఆ తర్వాతే వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈనెల 26,27 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని సూచన ప్రాయంగా చెప్పారు. సోమవారం సీజీజీ, దోస్త్ అధికారులతో సమావేశం నిర్వహించి పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న కాలేజీల్లోనూ 5,894 మంది విద్యా ర్థులకు సీట్లు కేటాయిం చామని చెప్పారు. వారూ ఈ అవకాశాన్ని సద్విని యోగం



చేసుకొని వేరే కాలేజీలో సీటు పొందాలని సూచించారు. ఈ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఉంటుందన్నారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని తక్కువ ఆప్షన్లు ఇచ్చి సీటు రాని వారు 6,694 మంది ఉన్నారని వివరిం చారు. మూడో విడతలో 70,808 మందికి సీట్లు కేటాయించామన్నారు. శనివారం నాటికి 23,937 మంది చేరారని చెప్పారు. మూడు విడతల్లో కలిపి 1,55,973 మంది విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం పొందారని వివరించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.